అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శుక్రవారం 29-9-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 219 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

హరిత విప్లవ పితామహుడు

ఇక లేరు



చెన్నైలోని స్వగృహంలో స్వామినాథన్ కన్నుమూత

- పలువురు ప్రముఖుల సంతాపం

చెన్నై : హరిత విప్లవ పితామహుడు, వ్యవసాయ శాస్త్రవేత్త, జన్యు శాస్త్ర నిపుణుడు ఎంఎస్. స్వామినాథన్ (98) ఇక లేరు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం ఉదయం 11.20 గంటలకు చెన్నైలోని తన స్వగృహంలో తుది శ్వాస విడిచారు. ఆహార రంగంలో దేశం స్వయం సమృద్ధి సాధించేందుకు, ఆకలిని, పేదరికాన్ని పారద్రోలేందుకు ఆయన ఎన్నో పరిశోధనలు చేశారు. అధిక దిగుబడిని అందించే వరి, గోధుమ వంగడాలను అందించి దేశానికి ఎంతో మేలు చేకూర్చారు. స్వామినాథన్ మరణం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రధాని నరేంద్ర మోడీ సహా పలువురు ప్రముఖులు సంతాపాన్ని వ్యక్తం చేశారు.

స్వామినాథన్ 1925 ఆగస్ట్ 7న తమిళనాడులోని కుంభకోణంలో జన్మించారు. ప్రాథమిక విద్య, మెట్రిక్యులేషన్‌ను అక్కడే పూర్తి చేశారు. తండ్రి వైద్యుడు కావడంతో ఆయన కూడా వైద్య విద్యలోనే ప్రవేశించారు. అయితే 1943లో బెంగాల్‌లో సంభవించిన కరవు కాటకాలను చూసి చలించిపోయి వైద్య విద్యకు స్వస్తి చెప్పి, వ్యవసాయ రంగం వైపు అడుగులు వేశారు. త్రివేండ్రంలోని మహారాజా కళాశాలలో జువాలజీ కోర్సులో చేరి అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీ పూర్తి చేశారు. ఆ తర్వాత మద్రాసు వ్యవసాయ కళాశాలలో చేరి డిగ్రీ చదివారు. 1949లో ఢిల్లీలోని భారత వ్యవసాయ పరిశోధనా సంస్థ నుండి సైటో జెనెటిక్స్‌లో పీజీ చేశారు. ఆ తర్వాత నెదర్లాండ్స్ వెళ్లి అక్కడి వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బంగాళదుంపల జన్యువులపై పరిశోధనలు చేశారు. 1950లో కేంబ్రిడ్జ్ యూనివర్సిటీకి చెందిన ప్లాంట్ బ్రీడింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరి ...11లో

ప్రముఖుల సంతాపం

స్వామినాథన్ మరణం తనను ఎంతగానో కలచివేసిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. ఆహార భద్రత కోసం ఆయన అలుపెరుగని కృషి చేశారని కొనియాడారు. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో దేశం స్వయంసమృద్ధి సాధించడంలో ఆయన పాత్ర మరువలేనిదని అన్నారు. స్వామినాథన్ మరణం పట్ల ప్రధాని మోడీ విచారం వ్యక్తం చేశారు. దేశం క్లిష్ట పరిస్థితులలో ఉన్నప్పుడు వ్యవసాయ రంగంలో ఆయన చేసిన కృషి లక్షలాది మంది జీవితాలను మార్చిందని, దేశానికి ఆహార భద్రతను కల్పించిందని కొనియాడారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, పలువురు కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు స్వామినాథన్ మరణం పట్ల సంతాపం తెలిపారు. స్వామినాథన్ మృతి వ్యవసాయ రంగానికి తీరని లోటని రైతు సంఘాల నేతలు అన్నారు.

వ్యవసాయ రంగం పెద్ద దిక్కును కోల్పోయింది : సీఎం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భారత హరిత విప్లవ పితామహుడు, ప్రపంచ ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త, ఎంఎస్ స్వామినాథన్ మరణం పట్ల ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. ఆయన మరణంతో దేశ వ్యవసాయ రంగం పెద్ద దిక్కును కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయాధారిత దేశంలో మెజారిటీ ప్రజల జీవనాధారం, ప్రజల సాంస్కృతిక జీవన విధానం వ్యవసాయ రంగంతో ముడివడి ఉన్నదనే ...11లో

దేశానికి తీరనిలోటు : సీపీఐ(ఎం)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారత హరిత విప్లవ సారథి, వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ (98) మరణం పట్ల సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సంతాపాన్ని ప్రకటించింది. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపింది. ఈ మేరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 1965 నుంచి 1985 వరకు భారతదేశంలో హరిత విప్లవాన్ని కొనసాగించి ఆహార ఉత్పత్తిలో దేశాన్ని స్వయంసమృద్ధం చేసిన శాస్త్రవేత్తగా స్వామినాథన్ పేరొందారని గుర్తు చేశారు. 1965లో స్వామినాథన్ ఆధ్వర్యంలో హరిత విప్లవం ...11లో

అణచివేస్తున్నారు

ఎఫ్ఏటీఎఫ్ సిఫార్సులను దుర్వినియోగం చేస్తున్నారు

- మోడీ ప్రభుత్వంపై ఆమ్నెస్టీ ఆగ్రహం

కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం పౌర సమాజ బృందాలను, కార్యకర్తలను అణచివేస్తోందని అమ్నెస్టీ ఇంటర్నేషనల్ విమర్శించింది. ఇందుకోసం ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) చేసిన సిఫార్సులను దుర్వినియోగం చేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేసింది. ఎఫ్ఏటీఎఫ్ సిఫార్సులను ఆధారంగా చేసుకొని క్రూరమైన చట్టాలను అమలు చేసేందుకు అధికారులు పూనుకుంటున్నారని, ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థల కార్యకలాపాలను అడ్డుకుంటూ వాటిపై ఉగ్రవాద సంబంధమైన ఆరోపణలు మోపుతున్నారని తెలిపింది.

న్యూఢిల్లీ : 'ఉగ్రవాదంపై పోరాటం సాగించే పేరుతో మోడీ ప్రభుత్వం ఎఫ్ఏటీఎఫ్ సిఫార్సులను వాడుకుంటోంది. ఆర్థిక, ఉగ్రవాద నిరోధక చట్టాలను దుర్వినియోగం చేస్తూ విమర్శకుల నోళ్లు మూయించే ప్రయత్నం చేస్తోంది. తన సిఫార్సుల దుర్వినియోగంపై ప్రభుత్వాధికారులను ఎఫ్ఏటీఎఫ్ బాధ్యులను చేయాలి' అని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ బోర్డు అధ్యక్షుడు ఆకార్ పటేల్ పత్రికా ప్రకటనలో కోరారు. చట్టాలను దుర్వినియోగం చేయడం ద్వారా ఎఫ్ఏటీఎఫ్ ప్రమాణాలకు, అంతర్జాతీయ మానవ హక్కుల చట్టానికి అనుగుణంగా వ్యవహరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఎఫ్ఏటీఎఫ్ 37 సభ్య దేశాలతో ఏర్పడిన అంతర్ ప్రభుత్వ సంస్థ. అంతర్జాతీయ మనీ లాండరింగ్, ఉగ్రవాదులకు ఆర్థిక సాయం వంటి అంశాలపై సభ్య దేశాలకు సిఫార్సులు చేస్తుంది. మన దేశం 2010 నుండీ ఈ సంస్థలో సభ్యురాలిగా ఉంటోంది.

అట్టడుగు వర్గాల ప్రజలు, మైనారిటీలు, వాతావరణ మార్పులు వంటి వాటిపై పనిచేస్తున్న 16 స్వచ్ఛంద సంస్థలలో 11 సంస్థల లైసెన్సులను ప్రభుత్వం ఏకపక్షంగా రద్దు చేసింది. విదేశీ నిధులు పొందాలంటే స్వచ్ఛంద సంస్థలకు ఈ లైసెన్సు తప్పనిసరి. గత దశాబ్ద కాలంలో దేశంలోని 20,600 ఎన్‌జీఓల లైసెన్సులు రద్దు చేశారు. 2022 నుండే ఆరు వేల సంస్థల లైసెన్సులు రద్దయ్యాయి. లైసెన్సుల రద్దుకు అధికారులు కుంటిసాకులు చెబుతున్నారు. ప్రభుత్వ సంస్థల ప్రతిష్టను దిగజారుస్తున్నాయని, ప్రజలు లేదా దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపణలు చేస్తున్నారు. ప్రభుత్వ నిర్బంధాల కారణంగా అనేక ఎన్‌జీఓలు తమ సిబ్బంది సంఖ్యను 50-80% మేర తగ్గించుకుంటున్నాయని అమ్నెస్టీ తెలిపింది. 'మా కార్యకలాపాలన్నీ దాదాపుగా నిలిచిపోయాయి. మాకు వ్యతిరేకంగా పెట్టిన కేసుల విషయంలో న్యాయస్థానాలలో పోరాడడానికే పరిమితమయ్యాము' అని ఓ ఎన్‌జీఓ నిర్వాహకుడు చెప్పారు.



చట్టాలను రద్దు చేయాలి : ఆమ్నెస్టీ

ఉపా, పీఎంఎల్ఏ, ఎఫ్‌సీఆర్ఏ చట్టాలను రద్దు చేయాలని లేదా వాటిని అంతర్జాతీయ మానవ హక్కుల ప్రమాణాలకు అనుగుణంగా సవరించాలని ఆమ్నెస్టీ సిఫార్సు చేసింది. భీమా కోరెగావ్ కేసులో ముస్లిం విద్యార్థి ఉమర్ ఖలీద్, కాశ్మీర్‌కు చెందిన మానవ హక్కుల కార్యకర్త ఖుర్రమ్ పర్వేజ్, పాత్రికేయుడు ఇర్ఫాన్ మెహ్రాజ్, మరో 16 మంది 2018 నుంచి ఎలాంటి విచారణ లేకుండా జైలులో మగ్గుతున్నారని, ఉగ్రవాదులకు ఆర్థిక సాయం చేశారంటూ వారిపై ఆరోపణలు మోపారని తెలిపింది. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్‌ను లక్ష్యంగా చేసుకునేందుకు మోడీ ప్రభుత్వం పీఎంఎల్ఏను ఉపయోగించింది. దీంతో ఆ సంస్థ భారత్‌లో 2020 సెప్టెంబర్ నుంచి కార్యకలాపాలను నిలిపివేసింది. ఇలాంటి చర్యల వెనుక ఉన్నది రాజకీయ ఉద్దేశాలేనని, అంతర్జాతీయ సంస్థల పట్ల వ్యతిరేక వాతావరణాన్ని సృష్టించేందుకే ఇలా చేస్తున్నారని పటేల్ చెప్పారు.

బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలి

ప్రధాని ఏ మొఖం పెట్టుకుని వస్తున్నారు?

- కాంగ్రెస్ నేతలవి జూటా మాటలు
- ఆర్థిక వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- మరిపెడ, నర్సంపేట, ములుగులో పర్యటన



నవతెలంగాణ - మరిపెడ/నర్సంపేట/ములుగు

మోటార్లకు మీటర్లు పెడతామని రైతును ఇబ్బందులకు గురి చేస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని ఆర్థిక వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఏ మొఖం పెట్టుకొని ప్రధాని మహబూబ్ నగర్‌కు వస్తున్నారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశారని తెలిపారు. గురువారం వరంగల్, ములుగు మహబూబాబాద్ జిల్లాల్లో మంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. డోర్నకల్ నియోజకవర్గంలోని మరిపెడలో తొర్రూరు, మరిపెడ 100 పడకల ఆస్పత్రుల నిర్మాణాలకు, వరంగల్ జిల్లా నర్సంపేటలో ప్రభుత్వం ఇటీవల రూ.183 కోట్లతో మంజూరు చేసిన వైద్య కళాశాలకు శంకుస్థాపన చేశారు. వైద్య కళాశాల నిర్మాణ పనులకు, 33/11 కేవి సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రూ.21.27లక్షలతో ఏర్పాటు చేసిన ప్రత్యేక ...11లో

గణపతికి..ఘన వీడ్కోలు

ప్రశాంతంగా నిమజ్జనం

- భారీ భద్రత, వార్ రూం నుంచి పర్యవేక్షణ
- హుస్సేన్‌సాగర్‌లో వేడుకగా నిమజ్జనోత్సవం
- వర్షంలోనూ సాగిన శోభాయాత్రలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ నగరదారులన్నీ ట్యాంక్‌బండ్‌కు మళ్లాయి. గణపతి బప్పా మోరియా నినాదాలతో నగరం మారు మోగింది. డప్పుల చప్పుళ్లు, నృత్యాలు, పీకల మోతల మధ్య జై బోలో గణేష్ అంటూ కేరింతల మధ్య ట్యాంక్ బండ్ హోరెత్తింది. వర్షంలోనూ వినాయక శోభయాత్రలు కొనసాగాయి. జనం ఆటలు, పాటలతో హుస్సేన్‌సాగర్ తీరంలో సందడి నెలకొంది. ఖైరతాబాద్ మహాగణపతికి ఘన వీడ్కోలు పలికారు. గురువారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు గణనాథుల నిమజ్జనం కొనసాగింది. చిన్న గణనాథులతోపాటు పెద్దపెద్ద గణనాథులు జనాన్ని ...2లో





వెన్నంటే ఉంటాం

ఇంటి స్థలం దక్కేవరకూ పోరాడుదాం : కేరళ ఎంపీ డాక్టర్ వి.శివదాసన్

- పేదల మధ్య ఐక్యతను దెబ్బతీయడానికి కుట్ర : వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య



నవతెలంగాణ-ములుగు డెస్క్

వాజేడు మండలంలోని సర్వే నెంబర్ 11లో ఇంటి జాగా కోసం పోరాటం చేస్తున్న పేదలకు స్థలాలు దక్కే వరకు వెన్నంటే ఉంటామని కేరళ ఎంపీ డాక్టర్ వి.శివదాసన్ అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం ములుగు జిల్లా వాజేడులో భూపోరాట ప్రాంతంలో "కూలి రేట్లు-ఉపాధి అవకాశాలు- భూ సమస్య"పై గ్యానం వాసు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. పేదలకు భూములు ఇవ్వడానికి ముందుకు రాని ప్రభుత్వాలు అంబానీకి, ఆదాని కార్పోరేట్ శక్తులకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ప్రభుత్వ భూములను అంటగడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుపేదలకు ఇంటి జాగా ఇవ్వడానికి ప్రభుత్వం సుముఖంగా లేదన్నారు. ఇదే స్థలాన్ని పెట్టుబడిదారులు ఆక్రమిస్తే వెంటనే పంపకాలు చేసేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ప్రకటిస్తూ.. పేదలపై నిత్యావసర వస్తువుల ...11లో

కిటెక్స్ సంస్థకు మంత్రి కేటీఆర్ శంకుస్థాపన



రూ.1200 కోట్ల పెట్టుబడితో ప్రారంభం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో భారీ తయారీ యూనిట్‌కు కిటెక్స్ సంస్థ పూనుకున్నది. గురువారం రంగారెడ్డి జిల్లా సీతారాంపూర్‌లో కిటెక్స్ సంస్థ తన ఇంటిగ్రేటెడ్ ఫైబర్ టు అప్పారెల్ తయారీ క్లస్టర్‌ను ఆ సంస్థ చైర్మెన్ సాబుజేకబ్‌తో కలిసి మంత్రి కల్వకుంట్ల తారకరామారావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..రాష్ట్రంలో తన పెట్టుబడులను భారీగా విస్తరించి, పెద్ద ఎత్తున ...11లో



కాంగ్రెస్‌లో చేరిన మైనంపల్లి

ఆయనతోపాటే కుమారుడు రోహిత్

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం, కుంభం అనిల్‌కుమార్ కూడా

న్యూఢిల్లీ : బీఆర్ఎస్ మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో బీఆర్ఎస్‌కు చెందిన బిగ్ షాట్‌లు మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, ఆయన కుమారుడు మైనంపల్లి రోహిత్, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం, కుంభం అనిల్ కుమార్ రెడ్డి గురువారం కాంగ్రెస్‌లో చేరారు. ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే సమక్షంలో వీరంతా కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. ఖర్గే వీరందరినీ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కాగా ఢిల్లీలో జరిగిన ఈ చేరికల కార్యక్రమంలో ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్ ఛార్జి మాణిక్ రావు ఠాక్రే, టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి , సీనియర్ నేత షబ్బీర్ అలీ, ...11లో

సారీ.. రిస్క్ తీసుకోలేం

గెలుపే ముఖ్యం...గెలిచే వారికే టికెట్లు

- మీక్కావాలా? కుటుంబ సభ్యులకా? తేల్చుకోండి
- పైరవీలు పని చేయవు...పని చేస్తేనే పదవులు
- సీనియర్లకు కాంగ్రెస్ అధిష్టానం ఝలక్
- మైనంపల్లికి మూడు టికెట్లు ఎలా? అంటూ కొందరు సీనియర్‌ల కినుక !

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో విజయం దిశగా కాంగ్రెస్ పార్టీ అచీతూచీ అడుగులేస్తున్నది. బీఆర్ఎస్ హ్యాట్రిక్ ఆలోచనకు చెక్‌పెట్టేందుకు కాంగ్రెస్ అధిష్టానమే డైరెక్టుగా రంగంలో దిగింది. ఈసారి 'చేయి' జారకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నది. అన్నిస్థాయిల్లోనూ పైరవీలను నియంత్రిస్తోంది. టికెట్ల కోసం హస్తినలో మకాం వేసిన వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. 'ఢిల్లీలో ఏ గడప తొక్కినా...టికెట్ల విషయంలో మేం రిస్క్ తీసుకోలేం...వదిలేయండి...అధికారంలోకి వచ్చాక మాట్లాడుకుందాం' అంటూ మర్యాదగా పంపిస్తున్నట్టు నేతలు చెబుతున్నారు. టికెట్ల విషయంలో తాము రిస్క్ తీసుకుంటే, ఎన్నికల్లో పార్టీ కుప్పకూలుతుందని అధినేతలు వారిని హెచ్చరిస్తున్నారు. బీఆర్ఎస్‌తో నేరుగా తలపడి గెలిచే అభ్యర్థులతోనే నాయకులే లక్ష్యంగా కాంగ్రెస్ ఎన్నికల్లో రణరంగంలోకి దిగుతుందని మొహంమీదనే చెప్పేస్తున్నారు. టికెట్టు ఇచ్చిన తర్వాత కూడా అవసరమైతే బిఫామ్ మారే అవకాశం ఉంటుందన్న సంకేతాలు ఇస్తున్నారు. టార్గెట్ మిస్సవ్వకుండా కారును ఢీ కొట్టాలని చెబుతున్నారు. ఏఐసీసీ టికెట్టు ఇచ్చిన తర్వాత అభ్యర్థి మావోడు కాదు...మా సామాజికవర్గం కాదు...ఆయనతో తమకు సంబంధం లేదు... ఆయన తరఫున మేమెట్లా ప్రచారం చేస్తామనుకునే వారిని కూడా ఏఐసీసీ ఓ కంట కనిపెడుతున్నది. అధికార బీఆర్ఎస్ అంగ, ఆర్థిక బలాన్ని ధీటుగా ఎదుర్కొనే నాయకులే ఈ పరిస్థితుల్లో అవసరమని భావిస్తోంది. మొత్తంగా అన్ని ఒడపోతలు పూర్తి చేసి గెలుపు గుర్రాల వైపే మొగ్గు చూపుతున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అందుకోసం 119 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచేవి ఎన్ని సీట్లు? వాటి జాబితా ఇవ్వండి? ...11లో

తయారీ రంగంలో ఏది పురోగతి ?

● పదో సంవత్సరంలోకి మేక్ ఇన్ ఇండియా ● ప్రభుత్వ మౌనానికి అర్థమేంటి?



న్యూఢిల్లీ : నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం సెప్టెంబరు 25 నాటికి పదో సంవత్సరంలోకి ప్రవేశించింది. ప్రతి చిన్న సంఘటనను, కార్యక్రమాన్ని అట్టహాసంగా జరుపుకునే ఈ ప్రభుత్వం ఈ పదో వార్షికోత్సవం గురించి అస్సలు పట్టించుకోలేదు. ఇందుకు కారణాలు ఏమిటి?

మూడు ప్రధానమైన లక్ష్యాలతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఏడాదికి 12నుండి 14శాతం మేరకు తయారీ రంగం వృద్ధిరేటును పెంచడం, 2022 నాటికి జీడిపిలో 25శాతం తయారీ రంగం వాటాను పెంచడం, 2022 నాటికి తయారీ రంగంలో 10కోట్ల ఉద్యోగాలను సృష్టించడం లక్ష్యాలుగా పెట్టుకుంది. అయితే ఈ లక్ష్యాల్లో ఏ ఒక్కదాన్నీ కూడా ప్రభుత్వం సాధించలేకపోయింది. బహుశా అందుకనే ఈ వార్షికోత్సవాలను ఆర్భాటంగా చేసి వుండకపోవచ్చు.

2013-14 నుండి తయారీ రంగం వృద్ధి రేటు సగటున 5.9శాతంగా వుంది. అలాగే తయారీ రంగం వాటా కూడా స్తంభించిపోయింది. 2022-23లో 16.4శాతం దగ్గరే నిలిచిపోయింది. 2016, 2021 మధ్య తయారీ రంగంలో ఉద్యోగాలు కూడా సగానికి సగం తగ్గిపోయాయి. మేక్ ఇన్ ఇండియా దశాబ్దంగా చెప్పుకునే ఈ కాలంలో తయారీ రంగంలో కార్మిక శక్తి బాగా క్షీణించింది. 2011-12లో 12.6శాతం వుండగా 2021-22లో 11.6శాతానికి తగ్గిపోయింది.

మేక్ ఇన్ ఇండియా పేరుతో తయారీ రంగంలో ఇంత పేలవమైన పనితీరును నమోదు చేస్తున్నా కొన్ని అసాధారణ సంఘటనలను కూడా సాధారణమైనవిలా ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోంది. ఇందుకు యాపిల్ ఐ ఫోన్ తయారీ ప్రధాన ఉదాహరణగా వుంది. భారత్‌లో యాపిల్ ఐ ఫోన్ల ఉత్పత్తి మూడు రెట్లు పెరిగిందని చెబుతున్నారు. దాదాపు 7శాతం ఫోన్లు ఇప్పుడు దేశంలోనే తయారవుతున్నాయి. దీంతో తయారీ రంగం అద్భుతంగా పనిచేస్తున్నదనడానికి ప్రభుత్వం దీన్ని ఉదాహరణగా చెబుతోంది. కానీ గణాంకాలను నిశితంగా పరిశీలిస్తే అవన్నీ బూటకమేనని అర్థమైపోతుంది.

వాస్తవానికి తయారీ రంగం చాలా నిరుత్సాహంగా వుంది. పెద్దఎత్తున నిరుద్యోగిత నెలకొంది. యువతలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. అక్కడో ఫ్యాక్టరీ, ఇక్కడో ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే సరిపోదు, భారత్‌కు వందలాది కొత్త ఫ్యాక్టరీలు అవసరం. రాష్ట్రాలవారీగా ఏర్పాటు చేసే ఆ ఫ్యాక్టరీలు వివిధ వర్గాలు వినియోగించే ఉత్పత్తులను తయారుచేయాల్సి వుంటుంది. యుపిఎ హయాంలో దాదాపు లక్షకు పైగా ఫ్యాక్టరీల సంఖ్య పెరిగింది. కానీ 2013-14, 2019-20 మధ్య కాలంలో ఈ సంఖ్య కేవలం 22వేలే పెరిగింది. యుపిఎ హయాంలో మరిన్ని ఉపాధి అవకాశాలు పెరిగాయి. ఏటా 6.2శాతం ఉద్యోగల సంఖ్య పెరిగింది. కానీ మోడీ హయాంలో ఈ సంఖ్య 2.8శాతానికి పడిపోయింది. అలాగే కార్మికుల వేతనాలు కూడా క్షీణించాయి. యుపిఎ కాలంలో కార్మికుల వేతనాలు ఏటా 17.1శాతం చొప్పున పెరగగా, 2014 నుండి 8.4శాతానికి పడిపోయాయి.

పెట్టుబడుల కొరత అనేది ప్రభుత్వ విధానాలపై విశ్వాసం కోల్పోవడానికి ప్రధాన కారణంగా వుంటుంది. తగినంత డిమాండ్ లేకపోవడంతో తయారీ రంగంలో పెట్టుబడులు కూడా వుండడం లేదు. అలాగే విధానపరమైన తప్పుడు చర్యలు కూడా ఇందుకు కొంత కారణం కావచ్చు. పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి సరిగా లేకపోవడం వంటివి అందులో కొన్ని. బలహీనమైన తయారీ రంగం భారతదేశాన్ని బాగా దెబ్బతీస్తోంది. పైకి కనిపించే డేటా కన్నా ఎక్కువగా ఈ దెబ్బ ప్రభావం వుంది.

ఒక విధానాన్ని సమీక్షించడానికి ఒక దశాబ్ద కాలమంటే చాలా ఎక్కువ సమయం. ఒక కార్యక్రమం పదే పదే విఫలమైందంటే, మరింత ప్రభావవంతమైన దాని కోసం దీన్ని పక్కనబెట్టాల్సిన సమయం ఆసన్నమైందనుకోవచ్చు.

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, అజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు
(10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	- 58,800	▼ 650
22 క్యారెట్లు	- 53,800	▼ 600
కిలో వెండి	- 76,500	▼ 500



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 104
రిటైల్ (లైవ్)	రూ. 126
స్కిన్‌తో	రూ. 183
స్కిన్‌లెస్	రూ. 208

ప్రపంచ గమనం

రష్యా, చైనాలపై యుద్ధం చేసే సత్తా అమెరికాకు ఉందా?

నెల్లూరు నరసింహారావు

పశ్చిమ దేశాల మీడియా తలపై పెట్టుకుని ఊరేగిన ఉక్రెయిన్ ప్రతిదాడి ఈ సంవత్సరం జూన్ లో మొదలై మూడు నెలలుగా తడబడుతుండటం ప్రపంచానికి తెలిసిపోయింది. అయితే ఈ ప్రతిదాడి ఉక్రెయిన్ సైనిక దళాల పరిస్థితినే కాకుండా ఈ యుద్ధాన్ని వెనుక నుంచి నడుపుతున్న అమెరికా బలహీనతను కూడా బహిర్గతం చేసింది. ఇదేదో ఆకస్మికంగా జరిగిన విషయమేమీ కాదు. లక్షలాది కోట్ల రక్షణ బడ్జెట్ల దన్ను ఉన్నప్పటికీ ఒక బలమైన దేశంతో యుద్ధం చేయటం అమెరికాకు అంత తేలిక కాదని అనేక విశ్లేషణా నివేదికలు పదేపదే తెలియజేస్తూనే ఉన్నాయి. ఏదో ఒక మూడవ ప్రపంచ దేశాన్ని కాకుండా ఒక బలమైన శత్రువుతో తలపడినప్పుడు సూటిగా లక్ష్యాలను ఛేదించే ఆయుధాలు, గూఢచర్యం, లక్ష్యాలను చేరుకునే సామర్థ్యం ఉండటంతోనే అమెరికాకు సరిపోదని అనేకమంది నిష్ణాతులు చెప్పారు. సోవియట్ యూనియన్ పతనం తరువాత అమెరికాకు శత్రుశేషం అంటూ లేకుండా పోయింది. రష్యా ప్రధాన శత్రువు పాత్రను ధరించలేదు. చైనాకు పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలనే యావతప్ప అమెరికాతో పోటీపడే ఆలోచనే లేదు. దానితో అమెరికా సైన్యం సంఖ్యాపరంగా కుదింపుకు గురవటమే కాకుండా అమెరికాకు అంతకుముందున్న ఆయుధ సంపత్తికూడా పెద్ద ఎత్తున తగ్గిపోయింది. వేలకువేల ట్యాంకులు, విమానాలు, ఫిరంగులు, వేల నౌకలు, లక్షలాది టన్నుల మందుగుండు, ఇతర సైనిక ఆస్తులను అమ్మటమో లేక ధ్వంసం చేయటమో జరిగింది. అయితే రాబోయే దశాబ్దాలలో పరిస్థితులు మారే అవకాశం ఉన్నదని ప్రముఖ దౌత్యవేత్త జార్జి కెన్నన్ లాంటివాళ్ళు హెచ్చరించారు. ముఖ్యంగా నాటోను విస్తరించటమనే పెద్ద తప్పువల్ల భవిష్యత్తులో రష్యాతో సంబంధాలు దెబ్బతింటాయని 1997లోనే కెన్నన్ చెప్పాడు. అయితే అప్పట్లో అటువంటి హెచ్చరికలు అమెరికాకు అస్పష్టమైనవిగా తోచాయి. దానితో 2010కల్లా ప్రాబల్య రాజ్యాలమధ్య పోటీ నెలకొనేటప్పటికి అమెరికా, దాని మిత్రదేశాలకు తాము ఆదమరచి ఉన్నామనే విషయం అర్థమైంది.

సైనిక వ్యవస్థలో జరిగిన మార్పులవల్ల అమెరికాకు రెండు పర్యవసానాలు ఎదురయ్యాయి. సైన్యం పరిమాణమే తగ్గిపోవటం మొదటిది, తమకు కావలసిన సైన్యాన్ని సమకూర్చుకోగల సామర్థ్యం, అలా సమకూర్చుకోదలచినప్పుడు కావలసిన శిక్షణను ఇవ్వగలిగిన సామర్థ్యం అమెరికాకు కొరవడటం రెండవది. ఈ పరిస్థితి సైన్యానికే కాకుండా వాయు సేనకు, నౌకాదళానికి కూడా ఎదురైంది. వివిధ దళాలకు కావలసిన దీర్ఘశ్రేణి ఆయుధాలను ఆచరణలో అందించే పరిస్థితి లేకుండా పోయింది. స్థానిక యుద్ధాలు చేయటానికి సరిపడా సైనిక యంత్రాంగం ఉండటంవేరు, ఒక ప్రధాన దేశాన్ని ఎదుర్కోవటానికి కావలసిన యంత్రాంగం వేరు. ఇప్పటి పరిస్థితుల్లో అమెరికా దగ్గర ఒక వారం రోజులపాటు ఒక ప్రధాన శత్రుదేశంతో తలపడటానికి కావలసిన ఆయుధ సంపత్తికూడా లేదనేది సుస్పష్టం.

అమెరికన్ వాయుసేన, సైన్యంతోపాటు నౌకాదళం కూడా యుద్ధ సన్నద్ధత సామర్థ్యాన్ని కోల్పోయింది. దీనితోపాటు ఉత్పత్తి సామర్థ్యం కూడా కొరవడింది. ఒకప్పుడు వాణిజ్య నౌకా నిర్మాణంలో అమెరికా అగ్రభాగాన ఉండేది. అటువంటి అంతస్థును అమెరికా కోల్పోయింది. ఆధునిక ఉత్పత్తికి కావలసిన సౌకర్యాలుగానీ, నైపుణ్యాలుగానీ నేటి అమెరికాలో లేవు. నేడు ప్రపంచ వాణిజ్య నౌకా నిర్మాణంలో మూడు ఆసియా దేశాలకు 93శాతం వాటావుంది. ఈ మూడు దేశాలలో చైనాకు 47శాతం, దక్షిణ కొరియాకు 30శాతం, జపాన్ కు 17శాతం వాటావుంది. దక్షిణ కొరియా, జపాన్ అమెరికాకు మిత్రదేశాలైనా వాటికి వేగంగా సైనిక శక్తిని జోడించే సామర్థ్యం లేదు. ఈలోపు అమెరికా కూడా తన సైన్యానికి, వాయుసేనకు, నౌకాదళానికి కావలసిన ఆయుధాలను, యంత్ర సామాగ్రిని వేగంగా ఉత్పత్తి చేయగల సామర్థ్యాన్ని మెరుగుపర్చుకోలేకపోతోంది.

పైన పేర్కొన్న విషయాలతో అమెరికా సతమతమౌతోందంటే దాని ప్రత్యర్థి దేశాలలో అంతా బాగున్నట్టు కాదు. సోవియట్ పతనం తరువాత రష్యా సైన్యంలో జరుగుతున్న సంస్కరణలు అసమగ్రంగా ఉన్నాయి. రష్యా మిలిటరీ పరిశ్రమలో గూఢచార, కమ్యూనికేషన్ల వ్యవస్థ, లక్ష్యాలను ఛేదించటంలో ఆధునీకరణ సమస్య ఉంది. అయితే పెద్ద ఎత్తున యుద్ధంలో పాల్గొనే అవకాశాన్ని రష్యా మిలిటరీ ఎన్నడూ విస్మరించలేదు. అందుకే రష్యావద్ద అపారమైన ఆయుధ నిల్వలు ఉన్నాయి. సైనిక ఉత్పత్తులను వేగవంతం చేసే సామర్థ్యాన్ని రష్యా కోల్పోలేదు. ఉక్రెయిన్ పైన నాటో కన్ను పడేదాకా పెద్ద యుద్ధం సంభవిస్తుందని రష్యా ఊహించలేదు. అయితే అమెరికా నాయకత్వంలోని పశ్చిమ దేశాలు రష్యా యుద్ధ సన్నద్ధతను తక్కువగా అంచనావేశాయి.

ఈలోపు చైనా సైనిక సన్నద్ధత గురించి ఊహాగానాలేగానీ వాస్తవాలు అంతగా తెలియదు. 1979లో వియత్నాంతో ఏదో తేలికపాటి యుద్ధం చేసిన చరిత్ర మాత్రమే చైనాకు ఉంది. అయినప్పటికీ చైనాకున్న సైనిక సంస్కృతి రష్యా నుంచి వచ్చింది. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో బ్రిటన్ తన సామ్రాజ్యాన్ని రక్షించుకోవటానికి అమెరికా సహకారాన్ని తీసుకుంది. ఆ కాలంలో జర్మనీ, జపాన్, సోవియట్ యూనియన్, బ్రిటన్ తో సహా అన్నింటినీ కలిపినా అమెరికన్ ఆర్థిక వ్యవస్థ అంత ఉండేవి కావు. ఈ నాలుగు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలలో మూడు దేశాలతో కలిసి అమెరికా సైనిక కూటమి ఉంది.

అయితే నేటి అమెరికా పారిశ్రామిక సామర్థ్యం చైనాకంటే బలహీనంగా ఉంది. ఫైనాన్షియల్, సాంకేతిక రంగాలలో అమెరికా ఆధిపత్యానికి చైనా నుంచి సవాళ్ళు ఎదురవుతున్నాయి. అంటే 1940వ దశకంలోని జర్మనీకంటే కూడా చైనా అమెరికాకు బలమైన వ్యూహాత్మక ప్రత్యర్థిగా ఉంది. కాబట్టి నేటి అంతర్జాతీయ రాజకీయాలలో అమెరికా అంతకుముందటిలాగా ఆధిపత్యాన్ని చెలాయించటం అంత తేలిక కాదనేది సుస్పష్టం.

గణపతికి.. ఘన వీడ్కోలు

(మొదటిపేజీ తరువాయి)

ఆకర్షించాయి. వివిధ రూపాల్లో ఏర్పాటు చేసిన గణనాథులను చూసేందుకు జిల్లాల వారితోపాటు నగరమంతా ట్యాంక్‌బండ్‌కు పయనమైంది.

బాలాపూర్ నుంచి హుస్సేన్ సాగర్‌తోపాటు వివిధ మార్గాల్లో శోభయాత్ర సందడిగా సాగింది. రహదారుల పొడవునా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాళ్ల వద్ద నీళ్ల, పులిహోరాను అందించారు. మరికొన్ని చోట్ల భోజనాలు, పూరీలు, సమోసాలను పంచిపెట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అన్ని ముందస్తు చర్యలు తీసుకున్నారు. హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్‌డ కమిషనరేట్ల పరిధిలో 40వేల మందికిపైగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 25వేలకుపైగా సీసీ కెమెరాలతో పర్యవేక్షించారు. నిమజ్జనం కోసం వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకున్నారు. వెంట వెంటనే క్రేన్లతో విగ్రహాలను నిమజ్జనం చేశారు. హుస్సేన్‌సాగర్‌లో అర్ధరాత్రి వరకు వేల సంఖ్యలో విగ్రహాలు నిమజ్జనం అయ్యాయి.

మంత్రులు తలసాని, మహమూద్ అలీ ఏరియల్ వ్యూ

గ్రేటర్‌లోని పలు ప్రాంతాల్లో గణేష్ శోభాయాత్ర, నిమజ్జనాన్ని మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. మధ్యాహ్నం బేగంపేట విమానాశ్రయం నుంచి మంత్రులు డీజీపీ అంజనీ కుమార్, పోలీస్ కమిషనర్ సీపీ ఆనంద్, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్‌తో కలిసి ఏరియల్ వ్యూ ద్వారా నగరంలో గణేష్ విగ్రహాల శోభాయాత్ర, హుస్సేన్‌సాగర్ వద్ద నిమజ్జనాలను పరిశీలించారు. అంతకుముందు మంత్రి తలసాని నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ముందుగా ఖైరతాబాద్ వినాయకుడి శోభాయాత్రలో పాల్గొన్న అనంతరం చార్మినార్, మోజం జాహి మార్కెట్, అబిడ్స్, లిబర్టీ, తెలుగుతల్లి ఫ్లై ఓవర్ వద్ద శోభాయాత్రగా వస్తున్న విగ్రహాలకు స్వాగతం పలికారు. తదనంతరం హుస్సేన్‌సాగర్‌లో బోట్‌లో తిరిగి నిమజ్జనాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. ఈ సంవత్సరం నగరంలోని వివిధ ప్రాంతాల్లో సుమారు 90 వేల విగ్రహాలను ఏర్పాటు చేశారని, శుక్రవారం ఉదయం వరకు నిమజ్జనాలు కొనసాగే అవకాశముందని చెప్పారు.

వార్ రూం నుంచి పరిశీలన

గణేష్ నిమజ్జనాన్ని బంజారాహిల్స్‌లోని సీసీసీలోని (కమాండ్ కంట్రోల్ రూం) వార్ రూం నుంచి హోంమంత్రి మహమూద్ అలీ, డీజీపీ అంజనీకుమార్, సీపీ సీవీ ఆనంద్, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ పరిశీలించారు. సిబ్బందికి కావాల్సిన సలహాలు, సూచనలు అందించారు. అనంతరం హెలీక్యాప్టర్‌లో ఏరియల్ వ్యూవ్ దారా నగరంలో కొనసాగిన శోభయాత్రను పరిశీలించారు. జలమండలి ఏర్పాటు చేసిన తాగు నీటి శిబిరాలను ఎండీ దాన కిశోర్ తనిఖీ చేశారు. ట్యాంక్ బండ్, నెక్లెస్ రోడ్, పీపుల్స్ ప్లాజా పరిసరాల్లో ఉన్న శిబిరాలకు వెళ్లిన ఆయన అక్కడి ఏర్పాట్లు పరిశీలించారు. నీటి నాణ్యత, క్లోరిన్ పరీక్షల వివరాలు అధికారుల్ని అడిగి తెలుసుకున్నారు.

7గంటలు సాగిన ఖైరతాబాద్ గణేషుడి శోభాయాత్ర జనసంద్రమైన సాగర్ పరిసర ప్రాంతాలు..

ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం ముగిసింది. వేలాది మంది వెంట రాగా ఉదయం 6.30గంటలకు మండపం నుంచి దశ మహా విద్యాగణపతి శోభాయాత్ర ప్రారంభమైంది. మధ్యాహ్నం 1.30 గంటలకు ట్యాంక్‌బండ్ ఎన్టీఆర్ మార్గ్ క్రేన్ నెం.4 వద్ద నిమజ్జనం పూర్తి చేశారు. దాదాపు 7గంటలపాటు సాగిన శోభాయాత్రకు సందర్శకులు, రాజకీయ నాయకులు, ప్రముఖుల రాకతో హుస్సేన్‌సాగర్ ప్రాంగణం కిక్కిరిసింది. ఏడాదికో ప్రత్యేక అలంకారంలో దర్శనమిస్తున్న ఖైరతాబాద్ గణేష్ ఈసారి 63 అడుగులు, సిద్ధి, బుద్ధి సమేత గణపతిగా కనిపించారు. ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జన శోభాయాత్ర ఖైరతాబాద్,



టెలిఫోన్ భవన్, సెక్రటేరియట్, ఎన్టీఆర్ మార్గ్ మీదుగా ట్యాంక్ బండ్ వద్దకు చేరుకుంది. ఈ శోభా యాత్ర కోసం పోలీసులు భారీ ఏర్పాట్లు చేశారు.

అప్పుల భారతం

విదేశీ రుణాలు రూ.52 లక్షల కోట్లు

● కరెంట్ ఖాతా లోటు ప్రమాద ఘంటికలు : ఆర్‌బిఐ రిపోర్ట్‌లో వెల్లడి



న్యూఢిల్లీ : భారత దేశం అప్పుల కుప్పగా మారింది. మరోవైపు దేశ ఎగుమతులు క్షీణించడం, దిగుమతులు పెరగడంతో వాణిజ్య లోటు ఎగిసిపడి.. తద్వారా కరెంట్ ఎకౌంట్‌పై తీవ్ర ఒత్తిడి పెరిగిందని ఆర్‌బిఐ గణంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుత ఏడాది జూన్ చివరి నాటికి విదేశీ రుణాలు 629.1 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. భారత కరెన్సీలో ఇది దాదాపు రూ.52 లక్షల కోట్లకు సమానం. గురువారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) వెల్లడించిన గణంకాల ప్రకారం.. ప్రస్తుత ఏడాది మార్చి చివరి నాటికి 624.3 బిలియన్లుగా ఉన్న విదేశీ అప్పులు మరో 4.7 బిలియన్లు పెరిగాయి. "2023 మార్చి చివరి నాటికి జిడిపిలో విదేశీ అప్పులు 18.8 శాతంగా ఉండగా.. 2023 జూన్ చివరి నాటికి 18.6 శాతంగా నమోదయ్యాయి. ఇందులో 54.4 శాతం వాటాతో అమెరికన్ డాలర్ విలువ కలిగిన రుణాలున్నాయి. భారత రూపాయల్లో 30.4 శాతం, ఎస్‌డిఆర్ 5.9 శాతం, యెన్ 5.7 శాతం, యూరో 3.0 శాతం చొప్పున నిష్పత్తి విలువ కలిగిన అప్పులున్నాయి." అని ఆర్‌బిఐ తెలిపింది.

జూన్ 2023 చివరి నాటికి దీర్ఘకాలిక రుణం (ఒక సంవత్సరం పైన ఉన్న అసలు మెచ్యూరిటీతో) 505.5 బిలియన్ల అప్పులున్నాయి. ఇది ఇంతక్రితం త్రైమాసికం ముగింపుతో పోల్చితే 9.6 బిలియన్లు పెరిగింది. మొత్తం విదేశీ రుణంలో స్వల్పకాలిక రుణాల వాటా (ఒక సంవత్సరం వరకు మెచ్యూరిటీతో) 2023 మార్చి చివరి నాటికి 20.6 శాతం నుండి ఈ ఏడాది జూన్ చివరి నాటికి 19.6 శాతానికి తగ్గాయి. మోడీ ప్రభుత్వం స్వల్ప కాల అప్పులను తగ్గించుకుని.. దీర్ఘకాల రుణాలను పెంచుకోవడం ద్వారా ప్రజలపై మరింత అదనపు భారం మోపినట్లయ్యింది.

ఏడు రెట్లయిన కరెంట్ ఖాతా లోటు

భారత కరెంట్ ఎకౌంట్ లోటు (సిఎడి) ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. ఆర్‌బిఐ గణాంకాల ప్రకారం.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో సిఎడి ఏకంగా ఏడు రెట్లు ఎగిసి 9.2 బిలియన్ డాలర్లుగా చోటు చేసుకుంది. ఇంతక్రితం త్రైమాసికంలో ఇది 1.3 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. దేశ ఎగుమతుల కంటే దిగుమతులు ఎక్కువగా ఉండటంతో విదేశాలకు భారత చెల్లింపులు అధికంగా ఉండటమే కరెంట్ ఎకౌంట్ లోటు. గడిచిన జూన్ త్రైమాసికంలో జిడిపిలో కరెంట్ ఎకౌంట్ లోటు 1.1 శాతానికి పెరిగిందని ఆర్‌బిఐ వెల్లడించింది. వాణిజ్య లోటు పెరగడంతో కరెంట్ లోటు ఎగిసిందని పేర్కొంది. "ప్రధానంగా కంప్యూటర్, ట్రావెల్, వ్యాపార సేవల ఎగుమతుల క్షీణత కారణంగా నికర సేవల రసీదులు క్రమంగా తగ్గాయని తెలిపింది. 2023 జూన్ త్రైమాసికంలో భారత సరుకుల వాణిజ్య లోటు 55.6 బిలియన్లకు పెరిగింది. ఇంతక్రితం ఏప్రిల్‌లో త్రైమాసికంలో ఇది 52.6 బిలియన్లుగా చోటు చేసుకుంది. మరోవైపు విదేశాల్లోని భారతీయుల రెమిటెన్స్‌లు 28.6 బిలియన్ల నుంచి 27.1 బిలియన్లకు తగ్గాయి. ప్రస్తుత జులై - సెప్టెంబర్ త్రైమాసికంలో కరెంట్ ఎకౌంట్ లోటు నిష్పత్తి రెండితలు పెరిగి జిడిపిలో 2.4-2.6 శాతం వరకు చేరొచ్చని ఎంకే గ్లోబల్ ఫైనాన్సియల్ సర్వీసెస్ లీడ్ ఎకనామిస్ట్ మాధవి అరోరా పేర్కొన్నారు. జులై-సెప్టెంబర్‌లో సిఎడి 19-21 బిలియన్లకు ఎగిసి జిడిపిలో 2.3 శాతానికి చేరే అవకాశం ఉందని ఇక్రా ముఖ్య ఆర్థికవేత్త అదితి నాయర్ పేర్కొన్నారు.

బీసీలకు జనాభా ప్రకారం సీట్లు కేటాయించండి

● ఠాక్రేకు దాసు సురేష్ వినతి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీసీలకు జనాభా ప్రకారం టికెట్లు కేటాయించాలని బీసీ రాజ్యాంధికార సమితి జాతీయ అధ్యక్షులు దాసు సురేష్ కాంగ్రెస్ పార్టీని కోరారు. ఈమేరకు గురువారం హైదరాబాద్‌లోఆ పార్టీ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రేకు బీసీల వివరాలతో కూడిన నివేదికను అందజేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీల అవకాశాలను ద్విగుణీకృతం చేసే దిశగా వారి జనాభా 60శాతం పైనున్న 42 నియోజకవర్గాలు, 50 శాతం పైచిలుకు జనాభా ఉన్న 72 స్థానాల వివరాలను సమర్పించారు. కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి నేతలు బండారి పద్మావతి, భోగ శ్రీనివాస్, పైరసాని దుర్గేష్, ఉమా, రాధాకష్ణ, కొత్తపల్లి బాయమ్మ, భండారి వైద్యనాథ్, గీసబోయిన ఆకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఏల బదిలీల వెబ్‌ఆప్షన్లకు సాంకేతిక సమస్య

● నమోదు గడువు రేపటివరకు పొడిగింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గురువారం నుంచి ప్రారంభమైన స్కూల్ అసిస్టెంట్ల (ఎస్ఏ) బదిలీల వెబ్‌ఆప్షన్ల నమోదు ప్రక్రియకు సాంకేతిక సమస్య ఎదురైంది. దీంతో వెబ్‌ఆప్షన్ల నమోదు ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి వెబ్‌ఆప్షన్ల నమోదు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన ఒక ప్రకటన విడుదల చేశారు. స్కూల్ అసిస్టెంట్లు, తత్సమాన కేటగిరి ఉపాధ్యాయులు వెబ్‌ఆప్షన్ల నమోదు గడువును ఈనెల 30వ తేదీ ఉదయం 11.59 గంటల వరకు పొడిగించామని తెలిపారు. అప్షన్ల సవరణకు వచ్చేనెల ఒకటిన అవకాశముందని పేర్కొన్నారు.


గుండె జబ్బుల నివారణకు కార్డియాక్ రిహాబ్

● రిస్క్ గ్రూపునకు ఉపయోగపడుతున్న వైనం

● జబ్బుకు గురైనా రిహాబ్ మళ్లీ సాధారణ జీవితం

● దేశంలోనే హైదరాబాద్ కేంద్రంగా రిహాబ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



గుండెను పదిలంగా చూసుకోవాలని పెద్దలు చెబుతుంటారు. శరీరంలో కీలకమైన ఈ అవయవం లబ్ డబ్ శబ్దానికి బదులుగా పదే పదే ఆటుపోటులకు గురవుతుంటుంది. మారిన జీవనశైలి, ఒత్తిడి గుండెపై పెను ప్రభావం చూపిస్తున్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా హృద్రోగాలపై ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ప్రతి ఏడాది సెప్టెంబర్ 29న ప్రపంచ గుండె దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ఏడాదికిగాను 'గుండెను ఉపయోగించుకో... గుండెను తెలుసుకో' అనే అంశాన్ని ఎంపిక చేశారు. ప్రపంచవ్యాప్తంగా నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ (అసాంక్రమిత వ్యాధులు) పెరిగిపోతుండగా అందులో గుండెపోటుతో మరణిస్తున్న వారి సంఖ్య అధికంగా ఉంటున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం ఈ జబ్బులు వచ్చిన తర్వాత దానికి చికిత్స, రకరకాల శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నాయి. గుండె జబ్బులు రాకుండా నివారణకు జీవనశైలిని, ఆహారపు అలవాట్లను మార్చుకోవడం, తగిన వ్యాయామం వంటివి నిపుణులు సూచిస్తున్నారు. అయితే గుండె పంపింగ్ సామర్థ్యాన్ని పెంచడం ద్వారా భవిష్యత్తులో గుండె జబ్బులు రాకుండా నివారించడం, ఇది వరకే గుండె జబ్బుల బారిన పడి ఉంటే వారి గుండె బలాన్ని పెంచేందుకు కార్డియాక్ రిహాబ్ దోహదం చేస్తున్నది. భారతదేశంలో ఉన్న ఒకే ఒక్క కార్డియాక్ రిహాబ్ హైదరాబాద్‌లో ఉండడం గమనార్హం.


ప్రస్తుతం ప్రయివేటుగా అందుతున్న ఈ సేవలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహించి పేద ప్రజలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కార్డియాక్ రిహాబ్ ఫిజిషియన్ డాక్టర్ మురళీధర్ బాబీ కోరారు.

కార్డియాక్ రిహాబ్ దాదాపు మూడు నెలల పాటు కొనసాగుతున్నది. కొన్ని సందర్భాల్లో కొద్ది కాలం ఎక్కువ కూడా రిహాబ్ చేస్తుంటారు. ఇప్పటికే గుండెపోటుకు గురైన వారికి, శస్త్రచికిత్స చేసుకున్న వారికి రిహాబ్ ఇచ్చిన తర్వాత ఇంటికి పరిమితం అయిన స్థితి నుంచి ఏకంగా పరుగుపందెంలో కూడా పాల్గొంటుండటం విశేషం. ప్రస్తుతం గుండె జబ్బులు వయస్సుతో నిమిత్తం లేకుండా అందరిని భయపెడుతున్న తీరు తెలిసిందే. ఈ నేపథ్యంలో రిహాబ్ కూడా అన్ని వయస్సుల వారికి ఉపయోగపడుతుండటం గమనార్హం. గుండె మార్పిడి చేయించుకోవాలని సూచించిన రోగులు మొదలు బైపాస్ సర్జరీ, ఇతరత్రా గుండె సంబంధిత వ్యాధులు కలిగిన వారు కూడా రిహాబ్ చేసుకుంటూ కొత్త జీవితాన్ని గడుపుతున్నారు. జబ్బు రాకముందు మాదిరిగా తమ విధులకు వెళుతూ ఆశ్చర్యం కలిగిస్తున్నారు.

సాధారణంగా మధుమేహం, హైపర్ టెన్షన్, అధిక కొలెస్ట్రాల్, గుండె జబ్బులు కలిగిన కుటుంబ చరిత్ర, ఒత్తిడితో కూడిన జీవితాన్ని గడిపే వారు ఎక్కువగా గుండెపోటుకు గురయ్యే ప్రమాదంలో ఉంటారు. ఇలాంటి వారు హార్ట్ అటాక్స్ బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తగా రిహాబ్ చేసుకుంచే మంచిది. తద్వారా వారి భవిష్యత్ గుండె జబ్బులను నివారించుకోవడమే కాకుండా ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడే అవకాశమున్నది.

డాక్టర్లు అర్థం చేసుకోవాలి :డాక్టర్ మురళీధర్ బాబీ

కార్డియాక్ రిహాబ్ ఇస్తున్న ఫలితాలను కార్డియాలజిస్టులు, కార్డియో థొరాసిక్ సర్జన్లు, ఫిజిషియన్లు, ఇతర డాక్టర్లు అర్థం చేసుకోవాలని కార్డియాక్ రిహాబ్ స్పెషలిస్ట్ డాక్టర్ మురళీధర్ బాబీ సూచించారు.



హృద్రోగుల్లో వస్తున్న మార్పును గమనించాలని కోరారు. రిహాబ్ గుండె జబ్బులతో పాటు ఇతర జబ్బుల తీవ్రతను తగ్గిస్తున్న విషయాలు ఆయా కేసుల విషయంలో గమనించినట్టు తెలిపారు. మరిన్ని వివరాల కోసం www.CardicRehab.com లో సంప్రదించాలని సూచించారు.

అది పార్టీ పంచాయతీ కాదు : కత్తి వెంకటస్వామి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మైనంపల్లి హనుమంతరావు, వేముల వీరేశం, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి చేరికల కార్యక్రమానికి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దూరంగా ఉండటం పార్టీ పంచాయతీ కాదనీ, అది రెడ్ల పంచాయతీ అని కాంగ్రెస్ ఓబీసీ జాతీయ నేత కత్తి వెంకటస్వామి వ్యాఖ్యానించారు. ఈమేరకు గురువారం ఆయన నవతెలంగాణతో మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలతో వారు కొట్లాడితేనే అది పార్టీ పంచాయతీ అవుతుందన్నారు. పార్టీపైనా, కోమటిరెడ్డిపైనా తీవ్ర విమర్శలు చేసిన అనిల్ కుమార్‌రెడ్డిని రేవంత్‌రెడ్డి చేర్చుకున్నారనీ, అందుకే వెంకట్‌రెడ్డి దూరంగా ఉన్నారని తెలిపారు.

కేజ్రీవాల్ నివాసంపై సిబిఐ విచారణ మొదలు

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ నివాసం నిర్మాణం, పునరుద్ధరణలో జరిగిన అవకతవకలపై సిబిఐ ప్రాథమిక విచారణను ప్రారంభించింది. ఈ విషయాన్ని సంబంధిత అధికారులు తెలిపారు.ఆరోపణలను ధృవీకరించడానికి దర్యాప్తు ఏజెన్సీ ప్రాథమిక విచారణను నిర్వహిస్తుంది. దాని ఆధారంగా ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలా వద్దా అనే నిర్ణయాన్ని అధికారులు తీసుకుంటారు. ఈ అక్రమాలను మొదట లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్జీ) కార్యాలయం లేవనెత్తింది. వారు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) చేత ఆడిట్ చేయాలని కోరుతూ ఈ ఏడాది మేలో కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఏ)కి లేఖ రాశారు. మార్పు పేరుతో సీఎం అధికారిక నివాసం పునర్నిర్మాణంలోఅవకతవకలు జరిగాయని ఎల్జీ కార్యాలయం పేర్కొన్నది. సిబిఐ ప్రాథమిక విచారణపై అధికార ఆప్ స్పందించింది. ఆప్ ఎలాంటి తప్పు చేయలేదని ఖండించింది. బిజెపిపై ఆరోపణలు సంధించింది. కేజ్రీవాల్ నేతృత్వంలోని పార్టీని ప్రజల కోసం పని చేయకుండా ఆపడానికి బిజెపి చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగానే ఈ చర్య అని అభివర్ణించింది. కేజ్రీవాల్ 2015లో ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి సివిల్ లైన్స్‌లోని 6, ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్‌లోని అధికారిక నివాసాన్ని ఆక్రమిస్తున్నారు.

ఎర్రజెండా నాయకత్వంలోనే పేదలకు న్యాయం

మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి
సీపీఐ(ఎం)లో 200 కుటుంబాల చేరిక



నవతెలంగాణ-అడవిదేవులపల్లి

సమాజంలో పేద ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కార వేదిక కమ్యూనిస్టు పార్టీ అని, ఎర్రజెండా నాయకత్వంలోనే పేదలకు న్యాయం జరుగుతుందని మాజీ శాసనసభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు.

గురువారం నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలంలోని మల్కచర్ల, చింతచెట్టుతండా, చిట్యాల, ముదిమాణిక్యం, గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా 200 కుటుంబాలు సీపీఐ(ఎం)లో చేరాయి. అనంతరం జూలకంటి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని పోరాడి హక్కు పత్రాలు ఇప్పించిన పార్టీ సీపీఐ(ఎం) అని చెప్పారు. అడవిదేవులపల్లి మండలం కావాలని పట్టుబట్టి పోరాడి మండలాన్ని సాధించామన్నారు. ఈ రోజు ప్రభుత్వం సంక్షేమ పథకాలను బీఆర్ఎస్ పార్టీ పథకాలుగా మార్చేసిందని, పేదలకు పథకాలు అందడం లేదని చెప్పారు. గృహలక్ష్మి పథకాన్ని అర్హులకు అందించాలని, రాజకీయ జోక్యాన్ని నివారించాలని కోరారు. ఉద్యోగాల భర్తీ విషయంలో కూడా తీరని అన్యాయం చేస్తున్నారన్నారు. రెండు రాష్ట్రాల ప్రభుత్వాలను ఒప్పించి సత్తెరసాల వద్ద ఉన్న కృష్ణా నదిపై వంతెన సాధిస్తామన్నారు. రాష్ట్రంలో ఉన్న ఖాళీలను భర్తీ చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. అందరికీ సమాన న్యాయం జరగాలంటే ఎర్రజెండా రాజ్యం రావాలని, ఈ మండల ప్రజానీకం సీపీఐ(ఎం) నాయకత్వానికి అండగా ఉండాలని కొరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు రవినాయక్, రాగిరెడ్డి మంగారెడ్డి, వినోద్‌నాయక్, మండల కార్యదర్శి జిట్టంగి సైదులు, నాయకులు, సైదనాయక్ కోటిరెడ్డి, పాపానాయక్, కరీమున్నీసా, దయానంద్ పాల్గొన్నారు.

ఎన్నికలు సమీపిస్తున్నందునే మహిళా బిల్లు

చిత్తశుద్ధి ఉంటే 2024 ఎన్నికల్లోనే అమలు చేయాలి
ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి



నవతెలంగాణ-సూర్యాపేట

ఎన్నికల ఎత్తుగడలో భాగంగానే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లు తెచ్చిందని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న మహిళా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ అక్టోబర్ 5న దేశ రాజధాని ఢిల్లీలో చేపట్టనున్న ర్యాలీని జయప్రదం చేయాలని కోరుతూ గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఐద్వా ఆధ్వర్యంలో జీపు జాతాను ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2014 ఎన్నికల ముందు హామీ ఇచ్చి 9ఏండ్లు దాని గురించి పట్టించుకోకుండా.. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు సమీపిస్తున్నందున బిల్లును ముందుకు తెచ్చిందని విమర్శించారు. చిత్తశుద్ధి ఉంటే 2024 ఎన్నికల్లోనే మహిళా రిజర్వేషన్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళల హక్కుల రక్షణకు భరోసా, భద్రత కల్పించాలన్నారు. రోజు రోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందాయని విమర్శించారు. కేరళ, తమిళనాడు తరహాలో రేషన్ షాపుల ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువులు ఇవ్వాలని కోరారు. ఉపాధి హామీ పని దినాలు సంవత్సరానికి 200 రోజులు పెంచాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలందరికీ 125 గజాల ఇంటి స్థలం ఇవ్వాలన్నారు. దేశవ్యాప్తంగా 2021లో 26046 మంది, 2022లో 31677 మంది లైంగికదాడులకు గురయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై దాడులు, దౌర్జన్యాలు, లైంగిక దాడులు పెరిగాయన్నారు. మహిళలకు ఆర్థిక, మానసిక పరిపుష్టి అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. మహిళా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గద్దె దిగేవరకు పోరాడాలని పిలుపునిచ్చారు.

ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు మద్దెల జ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మేకన పోయిన సైదమ్మ, నాయకులు జూలకంటి విజయలక్ష్మి, అండం నారాయణమ్మ, కోట సృజన, గోలి భాగ్యమ్మ, పిట్టల రాణి, గంగపురి శశిరేఖ, చింత పద్మ, భాగ్యమ్మ, సుగుణమ్మ, శ్రామిక మహిళా కన్వీనర్ చెరుకు ఏకలక్ష్మి, తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు కొప్పుల రజిత పాల్గొన్నారు.



కనీస వేతన చట్టాన్ని సవరించని ప్రభుత్వం

- వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్

నవతెలంగాణ-ములుగు డెస్క్

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రభుత్వం కనీస వేతన చట్టాన్ని సవరించడం లేదని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ అన్నారు. వాజేడు మండలం మండపాకలో వ్యకాస రాష్ట్ర కమిటీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇంటి జాగాలు, ఇండ్ల నిర్మాణం, సాగుభూమి, ధరణి సమస్యలపై నిరంతరం పోరాటాలు సాగించాలని అన్నారు. ఉపాధి హామీ చట్టం రక్షణ కోసం దేశవ్యాప్తంగా అక్టోబర్ 11వ తేదీ నుంచి చేపట్టనున్న నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పేదలకు ఉపాధి హామీ చట్టాన్ని దూరం చేయాలని మోడీ ప్రభుత్వం యత్నిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిలో భాగంగానే బడ్జెట్లో నిధుల తగ్గింపు, పని ప్రదేశాల్లో ఆన్‌లైన్ హాజరు నమోదు, ఆధార్ ప్రతిపాదన ద్వారా కూలీలకు డబ్బులు, జాబ్ కార్డుల తొలగింపు, డ్రోన్ల ద్వారా పర్యవేక్షించాలన్న కొత్త విధానాన్ని తీసుకొచ్చిందని చెప్పారు. ప్రభుత్వాల విధానాల వల్ల అసంఘటిత రంగంలో పనులు దొరక్కపోవడంతో పేదల జీవనం అస్తవ్యస్తంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం బోగస్ రేషన్ కార్డు ఏరివేత పేరుతో పేదలకు రేషన్ బియ్యం దక్కకుండా చేస్తుందన్నారు. కేవైసీ మరో రెండు నెలలు పొడిగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జి.నాగయ్య వెంకట్రాములు, నాయకులు మచ్చ వెంకటేశ్వర్లు, కనకయ్య, పొన్నం వెంకటేశ్వర్లు, బుర్రి ప్రసాద్, బి రెడ్డి సాంబశివ, గ్యానం వాసు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు మందలించారని విద్యార్థి ఆత్మహత్య

- విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నా



నవతెలంగాణ-ఆత్మకూర్(ఎస్)

ఉపాధ్యాయులు మందలించారని మనస్తాపానికి గురైన విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ ఎస్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలో బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు, బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా నిడమానూరు మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన ఆలకుంట్ల వెంకన్న, జయలక్ష్మీ దంపతుల కుమారుడు రాకేష్ మహాత్మా జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. మంగళవారం రాత్రి హాస్టల్ గదిలో లైట్లు వేసి ఉన్నాయని పాఠశాల ఉపాధ్యాయులు రాకేష్‌తోపాటు మరో ఐదుగురు విద్యార్థులను మందలించారు. దాంతో మనస్తాపానికి గురైన రాకేష్ బుధవారం రాత్రి హాస్టల్ పాత మరుగుదొడ్ల వద్ద రేకుల షెడ్డులో ఉరేసుకున్నాడు. గురువారం తెల్లవారుజామున తోటి విద్యార్థులు నిద్ర లేచే సరికి రాకేష్ కనిపించలేదు. దాంతో వారు ఉపాధ్యాయులకు సమాచారం అందించారు. ఉపాధ్యాయులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు పాఠశాల చేరుకున్నారు. చుట్టుపక్కల వెతకగా.. రేకుల షెడ్డులో విగతజీవిగా కనిపించాడు. రాకేష్ మృతదేహాన్ని సూర్యాపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. విద్యార్థి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్టు ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపారు.

సిబ్బందే కారణం విద్యార్థి సంఘాల ధర్నా

విద్యార్థి రాకేష్ మృతికి పాఠశాల సిబ్బంది కారణమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్ వర్మ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు గోపగాని రవి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు పోలే బోయిన కిరణ్ అన్నారు. మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల ఎదుట విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పాఠశాల సిబ్బంది విద్యార్థులపై దుర్భాషలాడటం, పైపులతో కొట్టడం లాంటి చర్యలకు పాల్పడ్డారన్నారు. ఎంతో చురుకుగా ఉండే రాకేష్ మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయని, సమగ్ర విచారణ జరిపి బాధితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాకేష్ తండ్రి అంగవైకల్యంతో బాధపడుతున్నాడని, వారిది నిరుపేద కుటుంబమని, రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. తరచూ బీసీ గురుకులాల్లో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని, ఎంతో భవిష్యత్ ఉన్న విద్యార్థులు నేల రాలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బానోత్ వినోద్ కుమార్, మనోహర్ శ్రీను, డిఎస్ఓ జిల్లా కార్యదర్శి భాష్పంగు సునీల్, టీవీజేఎస్ జిల్లా అధ్యక్షులు బొమ్మగాని వినయ్, అరుణ్, లెనిన్, భరత్ పాల్గొన్నారు.

యువత పరిశ్రమలవైపు వెళ్లాలి

స్థానికులకే ఉద్యోగాలు

- ఐటీ, పరిశ్రమలు, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్
- సీతారాంపూర్, చందనెల్లిలో సింటెక్స్, కిటెక్స్‌కు శంకుస్థాపన



నవతెలంగాణ-షాబాద్

యువత రాజకీయాలు, రియల్ ఎస్టేట్ వైపే కాకుండా పరిశ్రమల స్థాపన వైపు వెళ్లాలని ఐటీ, పరిశ్రమల, పురపాలక శాఖ మంత్రి తారకరామారావు అన్నారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో ముందంజలో ఉందని చెప్పారు. గురువారం రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో ఆయన పర్యటించారు. సీతారాంపూర్ స్టేజీ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం సీతారాంపూర్ గ్రామ సమీపంలోని కిటెక్స్, చందన్‌వెల్లి గ్రామ సమీపంలో సింటెక్స్ పరిశ్రమలకు కేటీఆర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాబోయే ఏడేండ్లలో చందన్‌వెల్లి, సీతారాంపూర్‌లో వెల్‌స్పన్ గ్రూప్ రూ.ఐదు వేల కోట్ల పెట్టుబడి పెడుతోందన్నారు. దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 50వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పరిశ్రమల స్థాపనకు తెలంగాణలో సదుపాయాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. గుజరాత్, కర్నాటక రాష్ట్రాల్లో పెట్టాల్సిన ప్లాంట్లను తెలంగాణలో పెట్టారని, దీనికి కారణం సీఎం కేసీఆర్ సమర్థ నాయకత్వమేనని అన్నారు. స్థానిక యువతకే ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. చేవెళ్ల, వికారాబాద్, తాండూర్, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లిలో ఐటీతోపాటు టూరిజం అభివృద్ధి చెందిందన్నారు. పరిగిలో ఆహార శుద్ధి పరిశ్రమ ఉందన్నారు. యువత రాజకీయాలు, రియల్ ఎస్టేట్ వైపు కాకుండా పరిశ్రమల వైపు వచ్చేలా ప్రోత్సహించాలన్నారు.

సమాచార, పౌర సంబంధాల, గనుల శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కేటీఆర్ కృషితో రంగారెడ్డి జిల్లా పరిశ్రమల ఖిల్లాగా మారిందన్నారు. రూ.370 కోట్ల పెట్టుబడులతో వెయ్యి మందికి ఉద్యోగ కల్పన వస్తుందన్నారు. జిల్లాలో రూ.62 వేల 832 కోట్ల పెట్టుబడులతో 1,358 పరిశ్రమలు స్థాపించగా.. వీటిలో ఏడు లక్షల ఆరు వేల మంది ఉద్యోగులుగా పనిచేస్తున్నారన్నారు. రూ.1400 కోట్ల పెట్టుబడులతో సింటెక్స్ పరిశ్రమలో 12వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు.

వికారాబాద్ జిల్లాలోనూ అనువైన ప్రాంతాల్లో పరిశ్రమల స్థాపనకు సీఎం కేసీఆర్‌కు నివేదిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ హరీష్, జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, రోహిత్ రెడ్డి, టీఎస్-ఎస్ఐసీ ఎండీ వెంకట్, వెల్‌స్పన్ గ్రూప్ అధినేత బాలకృష్ణ గోయంక, కిటెక్స్ జాకబ్, ఆర్డీఓ సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పదోన్నతులపై ప్రత్యేక శ్రద్ధ వహించండి

2010 కంటే ముందు నియామకమైన టీచర్లకు టెట్ అవసరం లేదు

- హైకోర్టు అనుమతి ఇవ్వకుంటే ఐదేండ్లలో టెట్ అర్హత పొందేలా చూడాలి : మంత్రి సబితకు ఎమ్మెల్సీ నర్సిరెడ్డి లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయుల పదోన్నతుల సమస్య పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డికి గురువారం ఆయన లేఖ రాశారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పదోన్నతులపై భర్తీ చేసే స్కూల్ అసిస్టెంట్, తత్సమాన పోస్టుల్లో పదోన్నతి పొందడానికి టెట్ పేపర్-2 ఉత్తీర్ణత ఉండాలన్న హైకోర్టు తీర్పుపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. స్కూల్ అసిస్టెంట్, తత్సమాన పోస్టుల్లో ఇప్పటికే విద్యాశాఖలో పనిచేస్తున్న ఎస్జీటీ, తత్సమాన క్యాడర్ వారు పదోన్నతులు పొందేందుకు టెట్ పేపర్-2 అర్హత ఉండాలంటూ హైకోర్టు తీర్పు ఇచ్చినట్టు వార్తా పత్రికల్లో వచ్చిందని తెలిపారు. ఎన్‌సీటీఈ ఉత్తర్వుల ప్రకారం 2010 తర్వాత ఉపాధ్యాయ నియామకాల్లో టెట్‌ను ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. అందువల్ల రాష్ట్రంలో 2010 కంటే ముందు ఉపాధ్యాయులుగా నియమింపబడిన వారు



టెట్ పరీక్ష రాయలేదని గుర్తు చేశారు. ఇప్పుడు పదోన్నతుల ద్వారా భర్తీ అయ్యే పోస్టుల్లో 2010 కంటే ముందు ఎస్జీటీ, తత్సమాన పోస్టుల్లో నియమించబడిన వారే పదోన్నతి పొందుతారని వివరించారు. ఈ సమస్య పరిష్కారానికి మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహించాలనీ, హైకోర్టు తీర్పును పరిశీలింపజేయాలని సూచించారు. తీర్పు సారాంశం టెట్ పేపర్-2 అర్హత పొందడం తప్పనిసరి ఉంటే హైకోర్టు స్పెషల్ పిటిషన్ వేయాలని కోరారు. 2010 కంటే ముందు నియమించబడిన ఉపాధ్యాయులు టెట్ పేపర్-2 అర్హత అవసరం లేదనే అనుమతిని హైకోర్టు నుంచి తీసుకోవాలని తెలిపారు. కోర్టు ఆ ప్రతిపాదనను కాదంటే పదోన్నతి తర్వాత ఐదేండ్లలో టెట్ పేపర్-2 అర్హత సాధిస్తారన్న ఆదేశాలను పొందాలని సూచించారు. ఐఏఎస్ నుంచి గ్రూప్-2 అధికారుల వరకు వారి ఉద్యోగానికి అవసరమైన పరీక్షలు అర్హత పొందడానికి, ఉద్యోగంలో చేరిన తర్వాతే అవకాశమిస్తున్నారని పేర్కొన్నారు. హైకోర్టులో కేసు రాత్రికి రాత్రే వేస్తే తెల్లారేసరికి తీర్పు వచ్చేది కాదని తెలిపారు. పాఠశాల విద్యాశాఖ సంచాలకుల నిర్లక్ష్యం వల్లే ఇలాంటి తీర్పులు వస్తాయని విమర్శించారు. ప్రభుత్వ అడ్వకేట్ జనరల్‌కు సరైన వివరణ ఇస్తే తీర్పు ఇలా ఉండబోదని పేర్కొన్నారు. అందుకే విద్యామంత్రి ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.

స్కీమ్ వర్కర్ల అక్రమ అరెస్టులు

మలుగు జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ నిర్బంధం

- రాత్రే సీఐటీయూ, ఏఐటీయూసీ నేతల అరెస్ట్
- పోలీసులకు, ఆశ వర్కర్లకు మధ్య తోపులాట
- ఆశా వర్కర్ చేతికి గాయం
- పోలీస్ స్టేషన్‌కు వచ్చి సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే సీతక్క
- ర్యాలీగా వెళ్లి కలెక్టర్ ఛాంబర్ ముందు బైటాయింపు



నవతెలంగాణ - ములుగు

కనీస వేతనాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత.. ఇతర సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, మధ్యాహ్న భోజన కార్మికుల పట్ల ప్రభుత్వం కర్కషంగా వ్యవహరిస్తోంది. సమస్యలను పరిష్కరించేందుకు ముందుకు రాకపోగా.. అక్రమ అరెస్టులు, నిర్బంధాలకు తెగబడుతోంది. గురువారం ములుగు జిల్లా పర్యటనకు మంత్రి హరీశ్‌రావు వస్తున్నాడన్న సమాచారంతో ఆయన్ను కలిసి తమ గోడు వెళ్లబోసుకుందామనుకున్న కార్మికులను ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. రాత్రికి రాత్రే సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులను అరెస్టు చేశారు. గురువారం ఉదయం ములుగు చేరుకున్న వాళ్లని చేరుకున్నట్టే అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కొంతమంది ఆశ వర్కర్లు మంత్రి సభా స్థలికి వెళ్లే ప్రయత్నం చేయగా.. మిషన్ భగీరథ కార్యాలయం వద్ద పోలీసులు ఆపారు. దీంతో పోలీసులకు, ఆశ వర్కర్లకు మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో ఆశ వర్కర్ చేతికి గాయమైంది. బలవంతంగా ఆశా వర్కర్లందర్నీ డీసీఎంలో ఎక్కించుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసుస్టేషన్‌లో ఆశ, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన కార్మికుల, సీఐటీయూ నాయకులను ఎమ్మెల్యే సీతక్క కలిసి సంఘీభావం తెలిపారు. అందరూ కలిసి ర్యాలీగా ములుగు ప్రభుత్వ ఆస్పత్రి ముందు జాతీయ రహదారిపై పెద్దఎత్తున రాస్తారోకో చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయానికి ర్యాలీగా చేరుకొని లోపలికి చొచ్చుకెళ్లి కలెక్టర్ ఛాంబర్ ముందు బైటాయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సీతక్క మాట్లాడుతూ.. మహిళలు అని చూడకుండా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వ ధనంతో, ప్రజాధనంతో నిర్వహించే సభలో ప్రజా సమస్యలపై విజ్ఞాన పత్రాలు కూడా స్వీకరించకుండా అక్రమ అరెస్టులకు పాల్పడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఆయా కార్మిక యూనియన్లతో చర్చలు జరిపి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జంపాల రవీందర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, గొల్లపల్లి రాజేందర్ గౌడ్, మల్లాడి రామ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, ఆశ, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మక్క, పద్మ నీలాదేవి, మంజుల తదితరులు ఉన్నారు.



ఎంఎస్.స్వామినాథన్ మృతి తీరని లోటు

- ఏ.విజయరాఘవన్, బి.వెంకట్ సంతాపం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హరిత విప్లవ పితామహుడు ప్రొఫెసర్ స్వామినాథన్ మృతికి అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు ఏ.విజయరాఘవన్, ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన మరణం వ్యవసాయ రంగ అభివృద్ధికి తీరని లోటని పేర్కొన్నారు. గురువారం ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆహారోత్పత్తిలో దేశానికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు రావడంలో స్వామినాథన్ చేసిన కృషి మరువలేనిదని పేర్కొన్నారు. రైతుల పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడం కోసం ఎమ్ఎస్‌పీ, సీ2ప్లస్‌సీ ఫార్ములా రూపొందించడంలో వ్యవసాయ కమిషన్ చైర్మెన్‌గా కీలక పాత్ర పోషించారని తెలిపారు. అఖిల భారత స్థాయిలో వివిధ భావాలు కలిగిన రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు, కార్మిక, ప్రజా సంఘాలను ఒక వేదిక మీదకు తీసుకొచ్చి ఢిల్లీ రైతాంగ ఉద్యమానికి ప్రేరణగా నిలిచారని పేర్కొన్నారు. స్వామినాథన్ అగ్రేరియన్ స్టడీ సెంటర్ పేరుతో ఆహార పంటలతోపాటు భూ సమస్యలు, ఉపాధి అవకాశాలపై రూపొందించిన నివేదికలు ప్రపంచ స్థాయి గుర్తింపు పొందాయని పేర్కొన్నారు. మధుర స్వామినాథన్ ప్రజా పంపిణీ వ్యవస్థ, గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలు వంటి అంశాలపై ప్రత్యేక అధ్యయనం చేశారనీ, వీకే రామచంద్రన్ ఆధ్వర్యంలో నడుపుతున్న ఎఫ్ఏఎస్, వ్యవసాయ కార్మిక సంఘాలతో సత్సంబంధాలున్నాయని తెలిపారు. రైతుల పంటలకు కనీస మద్దతు ధరల చట్ట సాధన కోసం, వ్యవసాయ కార్మికులకు ఉపాధి, ఆహార భద్రత వంటి గ్యారెంటీ పథకాలను అమలు చేసుకోవడం కోసం దేశవ్యాప్త బలమైన ఉద్యమాలను నిర్వహించడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

స్వామినాథన్‌తోనే ఆహారభద్రత
వ్యవసాయ, సాగునీటిరంగ నిపుణులు : సారంపల్లి మల్లారెడ్డి

హరిత విప్లవ పితామహుడు, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్.స్వామినాథన్ మృతి వ్యవసాయ ప్రపంచానికి తీరనిలోటు. వ్యవసాయంరంగంలో సంస్కరణలు తెచ్చిన ఘనత ఆయనదే. రైతులకు గిట్టుబాటు ధర ఉండాలని మొదటి నుంచి చెబుతున్నారు. అమెరికాకు చెందిన బోర్లాగ్, చైనాకు చెందిన లాంగ్‌పింగ్ శాస్త్రవేత్తలతోపాటు స్వామినాథన్ కృషిమూలంగా ప్రపంచంలో ఆహారభద్రత నెలకొంది. ఉత్పత్తిని నాలుగైదు రెట్లు పెంచారు. కొరత లేకుండా చేశారు. మద్దతు ధర కింద ఉత్పత్తి ధరలో 50 శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్వామినాథన్ సిఫారసులను ఆమోదించిన కేంద్ర సర్కారు, అమలుచేయకుండా రైతులను మోసం చేసింది.

ఆయిల్‌పామ్.. గోల్డెన్ ఫామ్

- రైతులు సాగుకు ముందుకు రావాలి : రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్ సి.పార్థసారథి



నవతెలంగాణ ములుగు

ఆయిల్‌పామ్ భవిష్యత్‌లో గోల్డెన్ ఫామ్‌లా లాభదాయకంగా మారుతుందని రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్ సి.పార్థసారథి అన్నారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 108వ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా గురువారం సిద్దిపేట జిల్లా మండల కేంద్రమైన ములుగులో శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణా రాష్ట్ర హార్టికల్చర్ యూనివర్సిటీలో ఒక రోజు ఆయిల్‌పామ్ సాగుపై వర్క్‌షాప్ నిర్వహించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ సి.పార్థసారథి ఆచార్య కొండా లక్ష్మణ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగు కోసం రైతులు ముందుకు రావాలన్నారు. ఆయిల్ పామ్ పంట వేసిన మొదటి నాలుగు సంవత్సరాల్లో ఫలసాయం ఉండదన్నారు. ఆ తర్వాత బాగా లాభాలు వస్తాయన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ఉత్సవాలను రెండ్రోజుల పాటు నిర్వహిస్తున్నామని విశ్వవిద్యాలయం ఉపకులపతి డా.నీరజప్రభాకర్ తెలిపారు.

అంతరపంటగా పత్తి

తాను రెండున్నర ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నానని పెద్దపల్లి జిల్లాకు చెందిన రంగయ్య వర్క్‌షాప్‌లో తెలిపారు. ఎకరానికి 54 మొక్కల చొప్పున 135 మొక్కలను నాటినట్టు చెప్పారు. 4 నెలల్లో రూ.30 వేల ఖర్చు వచ్చిందన్నారు. మొక్కకు మొక్కకు మధ్య 9 మీటర్లు ఉండాలన్నారు. ఇప్పటి వరకు ఎలాంటి సమస్యా రాలేదన్నారు. అంతరపంటగా పత్తి వేశానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హార్టికల్చర్ అడ్వైజర్ శ్రీనివాస రావు, ఇండియన్ ఆయిల్ ఫామ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ సురేష్, గజ్వేల్ ఆర్డీఓ బన్సీలాల్, అన్ని జిల్లాల ఉద్యానశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

మరోసారి చమురు ధరల పెరుగుదల!

ప్రపంచ మార్కెట్లో మరోసారి ముడి చమురు ధరలు పెరుగుతున్నాయి. విపణి పండితుల జోశ్యాలను వమ్ము చేస్తున్నాయి. సౌదీ అరేబియా, రష్యా, ఇతర చమురు ఎగుమతిదేశాలు(ఒపెక్) ఉత్పత్తిని తగ్గించగా అమెరికా పెంచినప్పటికీ జూన్ నెల నుంచి ఇప్పటి వరకు 30శాతం పైగా ధరలు పెరగటం ఆందోళన కలిగిస్తోంది. గతేడాది ఒక

> **మాంద్యం వంటి ప్రతికూలతలతో అసలే అంతంత మాత్రంగా ఉన్న వృద్ధి రేటు చమురు ధరలతో మరింత కుదేలు కావటం ఖాయం. ఆచరణలో అది సామాన్యుల మీద భరించలేని భారాన్ని మోపుతుంది. తినీ తినక కాస్తో కూస్తో కూడబెట్టుకున్న సొమ్మంతా ధరల పెరుగుదలతో హరీ అంటున్నది. చమురు ధరలు పెరిగితే మనదేశంలోని 42 శాతం కుటుంబాలు ఆమేరకు ఇతర ఖర్చులు తగ్గించు కుంటాయని గతేడాది లోకల్ సర్కిల్స్ సర్వే వెల్లడించింది.**

పీపా ధర 110 డాలర్ల వరకు పెరిగింది. గురువారం నాడు సంపాదకీయం రాస్తున్న సమయానికి ప్రామాణిక బ్రెంట్ రకం ధర 97 డాలర్లు దాటింది. వందడాలర్ల వద్ద స్థిరపడుతుందని వెలువడుతున్న అంచనాలు అభివృద్ధి చెందుతున్న దేశాలకు చెడువార్తలే. ఇంతకు మించి ధరలు ఎంతకాలం ఉన్నప్పటికీ ఆర్థిక వ్యవస్థ ఖాయిలా తీవ్రంగా ఉంటుందని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. చమురు ధరల తగ్గుదల ఎగుమతి మీద ఆధారపడిన దేశాలపై ప్రతికూల ప్రభావం చూపుతున్న కారణంగా అవి ఉత్పత్తిని తగ్గించి ధరలను పెంచుకోవాలని చూస్తున్నాయి. చమురు ధరలు ఆకస్మికంగా పెరగటానికి కారణాలు ఏమిటి ? అమెరికా భవిష్యత్ అవసరాల కోసం భారీ ఎత్తున వ్యూహాత్మక చమురు నిల్వల విధానాన్ని అనుసరిస్తున్న సంగతి తెలిసిందే.ప్రస్తుతం అవి నాలుగు దశాబ్దాల కనిష్టానికి పడిపోయాయి. తిరిగి వాటిని నింపుతున్నప్పటికీ అవి 2021నాటి స్థాయికి మాత్రమే చేరతాయనే అంచనాలు ధరలు పెరగటానికి ఒక కారణం. ఒపెక్ దేశాలు ఉత్పత్తిని తగ్గించటం మరొక కారణమైతే చైనాలో ఆర్థిక వృద్ధి మందగించిందంటూ ఎన్ని కథలు వినిపించినప్పటికీ అక్కడ తిరిగి గిరాకీ ఏర్పడనుందనే అంచనాలు కూడా దోహదం చేస్తున్నాయి.



ఈ ఏడాది సెప్టెంబరులో అమెరికాలో రోజుకు పదమూడు మిలియన్ల పీపాల చమురు ఉత్పత్తి జరిగి 2019నవంబరు నాటి రికార్డును దాటుతుందని చెబుతున్నారు. వచ్చే ఏడాది సగటున నెల వారీ అదే మాదిరి కొనసాగవచ్చని చెబుతున్నప్పటికీ జెపి మోర్గాన్ సంస్థ విశ్లేషకులు చమురు ధర 2026 నాటికి 150 డాలర్లకు చేరవచ్చని చెప్పారు. వచ్చే ఏడాది 90 నుంచి 110 డాలర్ల మధ్య కదలాడవచ్చన్నారు. ఆ సంస్థ విశ్లేషణ వెలువడిన నాడు 93.55గా ఉన్న ధర వారంలోపే గురువారంనాడు 96-97 డాలర్ల మధ్య కదలాడింది. ఈ ఏడాది వంద డాలర్లకు మించకపోవచ్చని ఫిబ్రవరిలో చెప్పిన అంచనా ఏడునెలల్లోనే తప్పి వందడాలర్లు దాటే దిశలో పయనిస్తోంది. గిరాకీ-సరఫరా మధ్య లోటు 2025లో రోజుకు 1.1 మిలియన్ పీపాలుగా ఉన్నది 2030 నాటికి 7.1మిలియన్ల పీపాలకు పెరగవచ్చని జెపి మోర్గాన్ అంచనా. అందువలన చమురు ధరల్లో స్వల్ప ఎగుడు దిగుళ్ల తప్ప పెరిగేందుకే ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. గత ఏడాదిన్నర కాలంగా ధరలు తగ్గిన కారణంగా తమ లాభాలకు గండిపడుతుందనే ఉద్దేశ్యంతో కడుపు నిండిన అమెరికా చమురు సంస్థలు అసలు ఉత్పత్తినే తగ్గించి వేశాయి. ఇప్పుడు పెరుగుతుండటంతో రిగ్గుల దుమ్ము దులుపుతున్నాయి. రష్యా చమురు ఎగుమతుల నిషేధం కొనసాగుతుందనే ధైర్యం కూడా దీనికి దోహదం చేస్తున్నది.

మాంద్యం వంటి ప్రతికూలతలతో అసలే అంతంత మాత్రంగా ఉన్న వృద్ధి రేటు చమురు ధరలతో మరింత కుదేలు కావటం ఖాయం. ఆచరణలో అది సామాన్యుల మీద భరించలేని భారాన్ని మోపుతుంది. తినీ తినక కాస్తో కూస్తో కూడబెట్టుకున్న సొమ్మంతా ధరల పెరుగుదలతో హరీ అంటున్నది. చమురు ధరలు పెరిగితే మనదేశంలోని 42 శాతం కుటుంబాలు ఆమేరకు ఇతర ఖర్చులు తగ్గించు కుంటాయని గతేడాది లోకల్ సర్కిల్స్ సర్వే వెల్లడించింది. ఇప్పటికే డాలరు విలువ పెరగటం, భారత్ వంటి దేశాల కరెన్సీల విలువలు పతనం కావటంతో చమురు కొనుగోలు భారం అవుతున్నది. అంతర్జాతీయ మార్కెట్లో ధరలతో నిమిత్తం లేకుండా పెట్రోలు, డీజిలు మీద భారీ ఎత్తున సెస్‌లను పెంచి గడచిన తొమ్మిది సంవత్సరాలలో దాదాపు 30లక్షల కోట్ల రూపాయల మేరకు జనం మీద భారం మోపిన సంగతి తెలిసిందే. అదే మోడీ సర్కార్ 2017 నుంచి ఇప్పటి వరకు కనీసవేతనాలను సవరించలేదు. నగదు రూపంలో గతంతో పోల్చితే పొందుతున్న మొత్తం పెరిగినట్లు కనిపిస్తున్నప్పటికీ ద్రవ్యోల్బణంతో పోలిస్తే నిజవేతనాలు తగ్గాయి, అంటే జనం జేబులకు చిల్లుపడింది. దీన్నే గోడదెబ్బ చెంపదెబ్బ అంటారు. పెరుగుతున్న ఉప్పు పప్పుల ధరలతో పోల్చితే ఎన్నికల కోసం గ్యాస్‌బండ మీద రెండు వందల రూపాయలు తగ్గించిన మాత్రాన జనానికి ఒరిగేదేమీ లేదు. పదేండ్ల క్రితం నాడున్న స్థితికి చమురు మీద పన్నులు తగ్గిస్తే జనానికి ఉపశమనం.



మహిళా రిజర్వేషన్

నిరవధిక జాప్యంతో ఆమోదం!

ఇరవైఏడు సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం ఎట్టకేలకు ఎంతగానో అందరూ ఎదురు చూస్తున్న మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందింది. కానీ, ఇది ఆనందించే అంశంగా లేదు. ఇన్నేళ్ళూ, వరుసగా వచ్చిన ప్రభుత్వాలన్నీ కూడా ఈ బిల్లును చంపేయడానికే చూశాయి, ఉదాసీనతతో మూటగట్టి మూలన పెట్టడానికే ప్రయత్నించాయి. కానీ, వామపక్షాలు, ఐద్వాతో సహా కొన్ని మహిళా ఉద్యమ విభాగాలు మాత్రమే నిరంతరంగా పోరాడుతూ, ఈ బిల్లును సజీవంగా వుంచేందుకు పోరాటం, ప్రచారం చేస్తూ వచ్చాయి. తాజా అధ్యాయంలో విషాద కరమైన అంశమేమంటే, బిల్లు ఆమోద ముద్ర పొందినా, దీని అమలు మాత్రం 2029 సార్వత్రిక ఎన్నికల వరకు, అది కూడా తీవ్రమైన స్థాయిలో ప్రశ్నించదగ్గ కారణాలతో వాయిదా వేశారు. తదుపరి జన గణన ప్రక్రియ పూర్తయిన పిదప 2026లో సీట్ల పునర్విభజన ప్రారంభమైన తర్వాత మాత్రమే చట్టసభల్లో మహిళలకు సీట్ల రిజర్వేషన్ జరుగుతుందని ముసాయిదా బిల్లు పేర్కొంటోంది. మహిళా రిజర్వేషన్ వాస్తవ రూపం దాల్చడానికి జనాభా లెక్కల నిర్వహణ లేదా పునర్విభజన ప్రక్రియ ఏదీ అవసరం లేదు. బిల్లును ఆమోదించిన తక్షణమే రిజర్వేషన్‌ను అమలు చేయవచ్చు, జనగణన, పునర్విభజన ప్రక్రియలు నిర్వహించినపుడు సీట్ల సంఖ్య ఆ దామాషా ప్రకారం పెరుగుతాయి. కానీ, ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకునేందుకు మహిళలకు గల హక్కును మరికొన్ని సంవత్స రాల పాటు నిరాకరించడానికి వీటిని ముందుకు తీసుకువచ్చారు.

మహిళా రిజర్వేషన్ బిల్లును బీజేపీ క్రమం తప్పకుండా తన ఎన్నికల ప్రణాళికల్లో చేరుస్తూ వచ్చింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లోగా అమలు చేస్తామంటూ 2014 లోనే ఈ దేశ మహిళలకు హామీ ఇచ్చింది. ఆ రెండు ఎన్నికల తర్వాత లోక్‌సభలో బీజేపీకి మెజారిటీ వచ్చింది. దాంతో ఈ బిల్లును తొక్కిపారేసింది. అధికారంలో వున్న తొమ్మిదేండ్ల లో బిల్లును ఆమోదిస్తామన్న హామీని మాత్రం నెరవేర్చలేదు. ఇప్పుడు, రెండో పదవీ కాలం చివరిలో బిల్లును ప్రవేశ పెట్టింది. దీంతో తమ పని సులువైపోతుందని, పితస్వామ్యపు తుట్టెను కదపకుండానే, తమకు రావాల్సిన ఓట్లు వచ్చే స్తాయని బీజేపీ, ప్రధాని గట్టి నమ్మకంతో వున్నట్లు కనిపిస్తోంది.కానీ కచ్చితంగా ఇదేదీ జరిగేది కాదు. దేశవ్యాప్తంగా మహిళలందరూ సంతోషంతో పొంగిపోయేందుకు ఇందులో ఏమీ లేదని, నిజానికి మోసపోయామని భావిస్తున్నారు. పార్లమెంట్‌లో కానీ, రాష్ట్రాల అసెంబ్లీల్లో గానీ తమ సంఖ్య పెరగకుండానే మరో సార్వత్రిక ఎన్నిక, అనేక రాష్ట్రాల ఎన్నికలు జరుగుతాయనే క్రూరమైన వాస్తవం వారి కళ్ళ ముందుంచబడింది.

మనకు స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్ళలో, ప్రజాస్వామ్యానికి మూలాధారం అంటూ బీజేపీ చెబుతున్న దానిలో లోక్‌సభలో మహిళల సీట్ల శాతం 5 శాతం నుండి ఈనాటి 15 శాతానికి మాత్రమే పెరిగింది. ఇది సిగ్గుపడాల్సిన వాస్తవంగా వుంది. ప్రపంచంలోని అనేక ఇతర దేశాలు మెరుగైన రికార్డును కలిగి వున్నాయి. పార్లమెంట్లకు ఎన్నికైన మహిళల సీట్ల సంఖ్య పరంగా చూస్తే భారత్ ఇరవయ్యవ స్థానంలో వుంది. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇది మారవచ్చు, కానీ మారదు. మన దేశంలో మహిళలు పెద్ద సంఖ్యలో ఓటు వేస్తున్నారు, పైగా ప్రతి ఎన్నికతో ఈ సంఖ్య పెరుగుతూ వస్తోంది. పైగా గాయాన్ని మరింత రేపేలా, 'బిల్లు లక్ష్యాలు-కారణాలు'ను ప్రభుత్వం పేర్కొంది. "మహిళా సాధికారత, మహిళల నేతత్వంలో అభివద్ధి ద్వారా, మహిళల ఆర్థిక స్వాతంత్ర్యం గణనీయంగా మెరుగు పరచబడింది. విద్య, ఆరోగ్యానికి సమాన అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి. తద్వారా 'నారీ శక్తి'కి పెద్ద పీట వేసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంది. ఉజ్వల యోజన, స్వచ్ఛ భారత్ మిషన్ కింద టాయిలెట్లకు అవ కాశం, ముద్ర యోజన ద్వారా ఆర్థిక క్రమంలోకి తీసుకురావడం వంటి వివిధ చొరవల ద్వారా ముఖ్యంగా మహిళలకు ప్రశాంత జీవనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. అయితే, మహిళల నిజమైన సాధికారతకు... నిర్ణయం తీసు కునే ప్రక్రియలో మహిళలు మరింత ఎక్కువగా పాల్గొనడం అవసరం. వారు విభిన్నమైన దక్కోణాలతో చట్టసభల్లో చర్చలు జరిపి, నిర్ణాయక క్రమాన్ని మరింత పరిపుష్టం చేసి, నాణ్యతగా మారుస్తారు." అని ప్రభుత్వం పేర్కొంది.

ఉజ్వల యోజన అనేది లక్షలాదిమంది నిరుపేద మహిళలపై క్రూరమైన జోక్‌గా మారిందని రుజువైంది. వివిధ సాంకేతిక అభ్యంతరాల కారణంగా వారికి ఉచితంగా సిలిండర్లు రావడం లేదు. దాంతో ఇప్పుడు అత్యంత వ్యయభరితంగా మారిన సిలిండర్లను వారు కొనుగోలు చేయలేకపోతున్నారు. అలాగే, దేశంలో పలు ప్రాంతాల్లో నిర్మించిన తర్వాత, పని చేస్తున్న టాయిలెట్ల సంఖ్యకు సంబంధించి ప్రభుత్వం చెబుతున్న గొప్పలు కూడా కేవలం కాగితాలపైనే. కానీ, నిరుపేద మహిళల పారిశుధ్య పరిస్థితులు పెద్దగా మారలేదని, ఇంకా అలానే కొనసాగుతు న్నాయనేది సిగ్గుచేటైన వాస్తవికతగా వుంది. చట్టసభల్లో మహిళల రిజర్వేషన్‌కు హామీ కల్పించే బిల్లు అమలుకు సుదీర్ఘకాలం పట్టనుండడంతో...ఆచరణలో అత్యంత నిరుత్సాహకరంగా మారిన ఈ పథకాల ప్రస్తావన, సముచితంగా వుంది.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

బుద్ధుడు హిందువనడానికి ఆధారమే లేదు!



డాక్టర్ దేవరాజు మహారాజు

ఒకప్పటి భరతఖండంలో షోడస మహా జనపదాలు ఉండేవి. అంటే పదహారు రాజ్యాలు ఉండేవి. జనపదం అంటే రాజ్యం. అంగరాజ్యం, కోసల రాజ్యం, మల్ల రాజ్యం, లిచవి రాజ్యం (వజ్జి) మొదలైనవి. వీటిలో వాయువ్య భరత ఖండాన్ని పర్షియన్లు జయించారు. సింధూ ప్రాంతంలోని కాంభోజ, గాంధార రాజ్యాలను కూడా జయించారు. ఈ రెండూ ప్రస్తుతం పాకిస్థాన్‌లో భాగమైపొయ్యాయి. అయితే అప్పటి ఆ పర్షియన్లు పాలించింది సాధారణ శకానికి ముందు 600-334 BCE మధ్య కాలం. వీరికి 'స' పలకనందు వల్ల, 'స' పలకాల్సి వచ్చినప్పుడు 'హ'పలికేవారు. అందుకే సింధూను హిందూ అన్నారు. సింధూ ప్రాంతాన్ని హిందూ దేశమన్నారు. మనోభావాలు దెబ్బతీసుకోకుండా ఇక్కడ, అందరూ ఒక విషయం తెలుసుకోవాలి. పార్శీ, ఉరుదూ, అరబిక్ డిక్షనరీల ప్రకారం - ఆ భాషలలో హిందూ అంటే దొంగ / బానిస / నల్లనివాడు వంటి అర్థాలు రాసిపెట్టుకున్నారు. ఏమైనా హిందూ అనేది ఒక మతానికి సంబంధించిన పదమే కాదు - అది ఒక ప్రాంతానికి సంబంధించిన పదం. ముందుగా ఆ విషయం గుర్తుంచుకోవాలి! ఇక 'హిందుత్వం' అనేది కూడా బుద్ధుని తర్వాత కాలంలో క్రమంగా రూపుదిద్దుకున్నది. అందువల్ల బుద్ధుడు హిందువు అని చెప్పుకోవడం పచ్చి అబద్ధం అవుతుంది. ఒకవేళ ఎవరైనా అలా అనుకుంటే, వారికి చారిత్రక అవగాహన లేదనుకోవాలి. లేదా తెలిసి ఉన్నా బుద్ధుణ్ణి తమలో కలుపుకోవడానికి కుట్ర పూరితంగా అలా అంటున్నారేమోనని... అనుకోవాల్సి వస్తుంది.

> **పురాతన హిందూ దేవాలయాలు, హిందూ దేవతా విగ్రహాలు ఏవైనా - అవన్నీ నిస్సందేహంగా మార్పులు చేసుకున్న బౌద్ధారామాలు, బుద్ధుడి విగ్రహాలు మాత్రమేనన్నది - ప్రసిద్ధ చరిత్రకారులంతా ముక్తకంఠంతో చెప్పిన విషయం! ఇకపోతే.. బుద్ధుడు హిందువనడానికి ఒక్క ఆధారం కూడా లేదు. ఆయన హిందువే కానప్పుడు ఆయన్ని హిందూమతంలో చేర్చుకుని, దశావతారాల్లో భాగం చేసుకోవడం జనాన్ని మోసం చేయడం కాదా? సత్యాన్ని దాచిపెట్టి, వచ్చే తరాల వారి కళ్ళుగప్పడం కాదా? ఏమైనా, బుద్ధుడి విలువను, ప్రత్యేకతను ఆయనకు అలా ఉంచి, మహనీయుడిగా, పరిపూర్ణుడిగా గౌరవించుకోవడం, నమస్కరించుకోవడం విజ్ఞత అనిపించుకుంటుంది!**

భారతదేశాన్ని మొదటగా జయించి ఆక్రమించిన విదేశీ రాజులు పర్షియన్లు, ఇరానియన్లు. సైరస్ మరయూ అతని మనుమడు డేవియన్ - ఇది సాధారణ శకానికి ముందు 600 BCE! ఇక బుద్ధుడు పుట్టేనాటికి - అంటే సాధారణ శకానికి ముందు 563BCE నాటికి మన దేశంలోనే కాదు, చైనా ఈజిప్టు, మొసపొటేమియాలలో కూడా ఎక్కడా 'హిందూ మతం' అనేది లేదు. వేదాలలో, స్మృతులలో, ఇతిహాసాలలో, పురాణాలలో ఎక్కడా 'హిందూ' అనే మాటే / శబ్దమే వినిపించదు. బుద్ధుడు క్షత్రియుడా కాదా అన్నది స్పష్టంగా తెలియదు. అయితే శాక్య తెగకు చెందిన వాడన్నది స్పష్టం. గతంలో తెగలకు, తండాలకు, గణాలకూ అలాగే కొన్ని రాజ్యాలకు రాజులైనంత మాత్రాన, వారు క్షత్రియులు కావల్సిన అవసరం లేదు. తర్వాత కాలంలోని అశోకుడు ఆ తర్వాతి కాలంలో శివాజీ వంటివారు ఎంతోమంది రాజ్యాలు ఏలారే గాని, వారంతా క్షత్రియులు కారన్నది మనకు తెలుసు.

గౌతముడి తండ్రి శుద్ధోధనుడు. ఈయన శాక్య తెగకు చెందినవాడు. ఈ తెగ రోహిణీ నది ఒడ్డున ఉండేది. రోహిణీ నదికి ఆవలివైపు 'కొలియ' తెగ ఉండేది. ఇంతకు ముందు చెప్పినట్టు షోడస మహా జనపదాలైన పదహారు రాజ్యాలు మాత్రమే కాకుండా, అప్పట్లో ఇంకా చిన్న చిన్న జనపదాలు కూడా ఉండేవి. వీటిని గణాలు అని అనేవారు. ఒక్కో గణానికి ఒక్కో గణనాయకుడు (గణపతి) ఉండేవాడు. గణం అంటే రాజ్యం. గణనాయకుడు అంటే రాజు. ఆ కాలంలో శాక్య, కొలియ తెగలుండేవి. వారి రాజ్యాలు వేరు వేరుగా ఉండేవి. రోహిణీ నదీ జలాల విషయమై శాక్యులకు, కొలియలకూ మధ్య జరగబోయే యుద్ధాన్ని వ్యతిరేకించినందుకు 'సంఘ' నిర్ణయాన్ని అనుసరించి, గౌతముడు దేశాన్ని వదిలి వెళ్ళాల్సి వచ్చింది. బుద్ధుడు దేశాన్ని / రాజ్యాన్ని వదిలిపోవడానికి కారణం ఆనాటి తెగల మధ్య ఘర్షణేనని కోశాంబి, డా.బిఆర్. అంబేద్కర్ వంటి ప్రముఖులు, విజ్ఞులు అభిప్రాయపడ్డారు.

సాధారణ శకానికి ముందు బుద్ధుడు పుట్టేనాటికి (600-300BCE) మన భూభాగంలో ఉన్న మతాలు రెండు రకాలు. 1. వైదిక మతం 2. అవైదిక మతం. వైదిక మతాన్ని వేద సంప్రదాయం ORTHODOX అని అన్నారు. ఆ వైదిక మతాలన్నీ సాంప్రదాయేతర మతాలు. ఇవి సుమారుగా అరవై రెండు ఉండేవి. ఇవన్నీ బ్రాహ్మణ వ్యవస్థకి వ్యతిరేకంగా ఉండేవి. ఉదాహరణకు అజీవిక, చార్వాక, లోకాయత వంటివి. ఈ అవైదిక మతస్థుల్ని "శ్రమణులు" అన్నారు. ఇక వైదిక మతం బ్రాహ్మణీయ భావజాలంతో ఉండి, వర్ణ వ్యవస్థను స్థిరపరిచింది. రుగ్వేదంలోని పురుషసూక్తంలో వర్ణవ్యవస్థ గురించిన ప్రస్తావన మొదటిసారి కనిపిస్తుంది. కానీ, కులవ్యవస్థ గురించి, పంచముల గురించి ఇందులో వివరాలు కనిపించవు. అయితే అవి తర్వాతి కాలంలో వచ్చిన మనుస్మృతి. నారద స్మృతులలో వివరంగా ఉన్నాయి.

వైదిక, అవైదిక మతాలు ఇలా వ్యాపించి ఉన్న దశలో శ్రమణుడైన బుద్ధుడు పుట్టి పెరిగాడు. వైదిక మతంలోని అసమానతలను నిరసించాడు. పశుబలిని, జీవ హింసను తీవ్రంగా దుయ్యబట్టాడు. ఇవన్నీ వైదిక-వేద-సంప్రదాయ -బ్రాహ్మణీయ మతానికి వ్యతిరేకం! బుద్ధుడు ప్రారంభించిన ఈ పనులే ఉద్యమ రూపం దాల్చి 'బౌద్ధం' అయ్యింది. అంతేగాని, బుద్ధుడు ఏ మతాన్ని స్థాపించలేదు. ఆయన శ్రమణుడు, నాస్తికుడు గనక, ప్రతి విషయాన్నీ తనదైన ఆలోచనా విధానంతో విశ్లేషించి, తన అనుచరులకు బోధించేవాడు. అంతే - తనని తాను దేవదూతగా గానీ, దేవుడిగా గానీ ప్రకటించుకోలేదు. సమ సమాజమే లక్ష్యంగా, ఒక ఉద్యమం చేపట్టిన సంఘ సంస్కర్త మాత్రమే! బుద్ధుడి మార్గాన్ని అనుసరించిన ఆయన అనుయాయులు బౌద్ధులుగా గుర్తింపబడ్డారు.

బుద్ధునికి ఇద్దరు గురువులున్నారు. మొదటివారు రుద్రక. రెండవవారు అలారక లామా. వీరి వద్ద రెండేళ్ళపాటు బుద్ధుడు వేద విద్యను అభ్యసించాడు. ఆలోచించి, అందులో ఏమీలేదనీ, అవి ఉట్టి మూర్ఖపు రాతలనీ నిర్ణయించుకున్నాడు. వాటిని అక్కడే వదిలేసి, స్వయంగా తన అన్వేషణను తీవ్రతరం చేశాడు. ఆ క్రమంలోనే 'తథాగతు'డయ్యాడు... తథాగతుడంటే ఉన్నది ఉన్నట్టుగా స్వీకరించి, నడుచుకునేవాడు. ఉన్న వాస్తవాల ప్రకారం అంటే నిజాల ప్రకారం నడుచుకునేవాడు. విషయం తెలుసుకోకుండానే బుద్ధుడు వైదిక ధర్మం పట్ల విముఖుడు కాలేదు. క్షుణ్ణంగా తెలుసుకున్న తర్వాతే - అందులో ఏమీలేదన్న నిర్ధారణకు వచ్చాడు. అందులోని అమానవీయమైన అంశాలకు చలించిపోయి తిరస్కరించాడు. ఈ లోకాన్ని, లోకరీతిని అందులోని బాధల్ని, వేదనల్ని అవగాహన చేసుకుని ఆలోచించి, తనలో తను మథనపడి,



తపించి, తపించి తెలుసుకున్న విషయాలు తన అనుచరులకు బోధించాడు. బయట ప్రపంచంలో ఉన్న విషయాలకు బుద్ధుడు చెప్పే విషయాలు భిన్నంగా ఉంటూనే, నిజానికి దగ్గరగా ఉన్నందువల్ల ఆయన్ని 'జ్ఞానోదయమైన వాడిగా' ఈ ప్రపంచం గుర్తించింది. అందులో మహిమలూ, మాయలూ ఏవీ లేవు.

పరిసరాల్ని, ప్రకృతిని, ఆకాశాన్ని అరణ్యంలోని చిన్నా పెద్దా జీవుల్నీ - వాటి ప్రవృత్తిని నిశితంగా పరిశీలించడం - సమాజంలో అప్పటికి ఉన్న రీతి రివాజును అర్థం చేసుకుని, ఏది మంచి ఏది చెడ్డ అని అవలోకించుకుని తనలోకి తాను ప్రయాణించి, ప్రతి విషయాన్ని విశ్లేషించుకుని, చివరగా ఆయన తీసుకున్న నిర్ణయమే - జ్ఞానోదయం! జ్ఞానోదయమంటే ఆలోచనల పరిపక్వత. నిగూఢమైన అంశాల్ని సరళంగా అర్థం చేసుకోగల నిపుణత. సాధించుకున్న జ్ఞానాన్ని మళ్ళీ అంతే సులభంగా ప్రజల భాషలో ప్రజలకు అందించాలన్న తహతహతో కూడిన నైపుణ్యం. ఎప్పటికప్పుడు కొత్త ఉత్సాహంతో, కొత్త ఉత్తేజంతో, నిబద్ధతతో దేశమంతా తిరుగుతూ బోధన చేయాలన్న సంకల్పం. ఆయనలోని ఇన్ని లక్షణాల వల్ల ఈ దేశం, ప్రపంచానికి కొత్త విలువలు చూపగలిగింది. కొత్త జ్ఞానం అందించగలిగింది. బౌద్ధం - శాంతి, అహింస, సత్యాన్వేషణల మార్గాన్ని బోధించగలిగింది. అప్పటికి ఇవన్నీ ప్రపంచానికి కొత్తవి. బుద్ధుడు తన ఆలోచనల తీవ్రతలోంచి సాధించిన జ్ఞానం - సార్థకమైంది. ప్రపంచ జనావళి ఆలోచనా స్థాయిని అనూహ్యంగా పెంచగలిగింది.

బుద్ధుని మరణానంతరం బౌద్ధంలో మార్పులు, చేర్పులూ జరిగాయి. బౌద్ధ భిక్కుల్లో వచ్చిన బేదాభిప్రాయాల వల్ల కొంత - వైదిక మత ప్రభావం వల్ల కొంత - బౌద్ధంలో మార్పులు జరిగాయి. హీనయాన, మహాయాన, వజ్రయానాలుగా విభజన జరిగింది. బుద్ధుడి కాలంలో ఆయన తన బోధనలు ఆనాటి ప్రజల భాష అయిన పాలి భాషలో చేసేవాడు. బుద్ధుడి అనంతరం పాలి, ప్రాకృత భాషలతో పాటు వైదిక మత ప్రభావం వల్ల బౌద్ధ ప్రచారంలో సంస్కృతం కూడా చేరింది. విగ్రహారాధన మొదలైంది. గుళ్ళూ, గోపురాలూ వెలిశాయి. బుద్ధుడి తర్వాతే బౌద్ధం - ఒక మతంగా మారింది. హీనయాన, మహాయాన, వజ్రయానాలు వేటికవి బలం పుంజుకుని విస్తరించాయి. తను ఒక దైవ స్వరూపుడవుతాడని గానీ, తన ఉపదేశాలన్నీ బౌద్ధమత సిద్ధాంతాలవుతాయని గానీ బుద్ధుడు తన జీవిత కాలంలో ఊహించలేదు. తన బోధనల్ని సంస్కృతంలోకి అనువదిస్తామన్న పండితుల్ని బుద్ధుడు వారించాడు. అలాంటి పని చేయకండని తీవ్రంగా హెచ్చరించాడు కూడా! అయితే ఆయన మరణం తర్వాత, జరగాల్సినవి జరిగిపోయాయి.

ఒక రకంగా భారతదేశంలో విగ్రహారాధన, ఆలయాల నిర్మాణం మొదటిసారి బౌద్ధంతోనే ప్రారంభ మయ్యాయి. అదెలా జరిగిందంటే, బౌద్ధభిక్షువులు బుద్ధుని అస్థికలపై చైత్యాలు నిర్మించుకున్నారు. ఆ తర్వాత ఆ చైత్యాలను పవిత్ర ఆలయాలుగా భావించి - బుద్ధుణ్ణి దేవుడిగా పూజించడం మొదలు పెట్టారు. క్రమంగా లెక్కలేనన్ని బుద్ధ విగ్రహాలు అన్ని చోట్లా వ్యాపించాయి. ఆ తర్వాత, అశోకుడి కాలంలో బహిరంగ స్థలాలలో బౌద్ధ స్థూపాలు వెలిశాయి. వాటిమీద బుద్ధుడి జీవిత చరిత్ర, బౌద్ధజాతక కథల చిత్రాలు చెక్కుకున్నారు. ఆ రకంగా మన దేశంలో మొదటి ఆరామాలైనా, స్థూపాలైనా, శిల్పాలైనా అన్నీ బౌద్ధులు చెక్కినవే! బుద్ధుడి గోర్లు నిక్షిప్తం చేసిన చోటు - 'నక్లవ్' పట్టణం కాలక్రమంలో లక్నోగా మారింది. గుజరాత్ ప్రాంతానికి ఒకప్పటి పేరు బుద్ధదేశ్. ముంబాయి ఒకప్పుడు బౌద్ధక్షేత్రమనడానికి చాలా ఆధారాలున్నాయి. పురాతన హిందూ దేవాలయాలు, హిందూ దేవతా విగ్రహాలు ఏవైనా - అవన్నీ నిస్సందేహంగా మార్పులు చేసుకున్న బౌద్ధారామాలు, బుద్ధుడి విగ్రహాలు మాత్రమేనన్నది - ప్రసిద్ధ చరిత్రకారులంతా ముక్తకంఠంతో చెప్పిన విషయం! ఇకపోతే.. బుద్ధుడు హిందువనడానికి ఒక్క ఆధారం కూడా లేదు. ఆయన హిందువే కానప్పుడు ఆయన్ని హిందూమతంలో చేర్చుకుని, దశావతారాల్లో భాగం చేసుకోవడం జనాన్ని మోసం చేయడం కాదా? సత్యాన్ని దాచిపెట్టి, వచ్చే తరాల వారి కళ్ళుగప్పడం కాదా? ఏమైనా, బుద్ధుడి విలువను, ప్రత్యేకతను ఆయనకు అలా ఉంచి, మహనీయుడిగా, పరిపూర్ణుడిగా గౌరవించుకోవడం, నమస్కరించుకోవడం విజ్ఞత అనిపించు కుంటుంది!

- వ్యాసకర్త: సుప్రసిద్ధ సాహితీవేత్త, జీవశాస్త్రవేత్త.

కర్నాటకలో బీజేపీ టిక్కెట్ల కుంభకోణం!

ఆమె మూడు పదులు నిండకుండానే అన్ని విధాలుగా పేరు మోసిన కట్టర్ హిందూత్వవాది. అతడు తన మతం, కాషాయ దుస్తులతో మోసానికి పాల్పడిన మరో కట్టర్. వీరితో చేతులు కలిపిన మరో నలుగురితో కలసి వారు ఇప్పుడు బెంగళూరు పోలీసు కస్టడీలో ఉన్నారు. ఉద్రేక, ఉన్మాద ఉపన్యాసాలు చేసి రెచ్చగొట్టటంలో పేరు మోసిన హిందూత్వ నేతగా పేరున్న చైత్ర కుందాపుర, శ్రీ హలస్వామి మహాసంస్థాన్ మఠ అధిపతి అభినవ హలస్వామి, వారితో చేతులు కలిపిన బీజేపీ యువ మోర్చా నేతలు, ఇతరులు ఈ 'టికెట్ కేసు'లో ఉన్నారు. అధికారంలో ఉన్న పెద్దలతో తమకు ఉన్న సంబంధాలను ఉపయో గించి నామినేటెడ్ పోస్టులు, కాంట్రాక్టులు, ఎన్నికల్లో పోటీకి టిక్కెట్లు ఇప్పిస్తామంటూ డబ్బులు కొట్టేసేవారి గురించి బయటకు తెలిసేది తక్కువ. ఎందుకంటే చెప్పుకుంటే పరువు పోతుందని అనేక మంది తేలుకుట్టిన దొంగల మాదిరి కిమ్మనరు. కర్నాటకలో ఇప్పుడు బీజేపీ టిక్కెట్ల కుంభకోణం వెల్లడి కావటంతో ఆ పార్టీ ఇప్పుడు ఇరుకున పడింది. తమకేమీ సంబంధం లేదని పార్టీ నేతలు చెబుతుండగా, అగ్ర నేతల ప్రమేయం ఉందని కేసుల్లో అరెస్టయిన వారు అంటున్నారు.

ఉడిపి జిల్లాలోని బైందూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో తనకు బీజేపీ టిక్కెట్ ఇస్తామంటూ డబ్బు తీసుకొని మోసం చేశారని గోవిందబాబు పూజారి అనే వ్యాపారవేత్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు బెంగళూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రధాని, కేంద్ర హోంమంత్రి కార్యాలయం, ఆర్ఎస్ఎస్ నేతలతో తమకు ఉన్న సంబంధాల గురించి చెప్పి డబ్బు వసూలు చేశారన్నది వారి మీద మోపిన నేరం. తనకు ఒకరిని పరిచయం చేసి అతగాడు ఆర్ఎస్ఎస్ నేత అని చెప్పారని, బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీకి నిధులు అవసరమంటూ చెప్పటంతో అతగాడికి రూ.మూడు కోట్లు, మరో రూ. రెండు కోట్లు చైత్ర అనుచరులకు చెల్లించినట్లు పూజారి తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. డబ్బు తీసుకున్నప్పటి నుంచి వారంతా తప్పించుకుంటున్నారని తెలిపాడు. అనేక రాష్ట్రాలలో ఇలాంటి మోసగాళ్ల ఎందరో ఉన్నారు. కర్నాటకలో 2020లో బెంగళూరు పోలీసులు స్వామి అలియాస్ సేవాలాల్ అనే జ్యోతిష్కుడు యువరాజ్ రామదాస్‌ను అరెస్టు చేశారు. అతగాడు 2014 నుంచి 2020 వరకు అనేక మంది నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసినట్లు వార్తలొచ్చాయి. ఒక గవర్నర్, ఒక కేంద్ర మంత్రి, ఒక రాజ్యసభ సభ్యుడితో తనకు సన్నిహిత సంబంధాలున్నట్లు చెప్పేవాడు. 2015లో జౌళిశాఖ కేంద్ర మంత్రిగా ఉన్న సంతోష్ గాంగవార్‌కు శ్రీకాళహస్తికి చెందిన కోలా ఆనంద కుమార్ అనే వ్యక్తిని పరిచయం చేశాడు. కేంద్ర సిల్క్‌బోర్డు ఛైర్మన్ పదవి ఇప్పిస్తానంటూ ఒకటిన్నర కోట్ల రూపాయలు వసూలు చేశాడు. ఈ స్వామికి ఒక ప్రముఖ బీజేపీ నేత తనను పరిచయం చేసినట్లు, తన దగ్గర డబ్బు తీసుకున్న తరువాత పదవీ లేదు, స్వామి ముఖం చాటేసినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఆనందకుమార్ పేర్కొన్నారు. సదరు స్వామి ఒక ఎంపీని తిరిగి నామినేట్ చేయిస్తానని రూ.ఇరవై కోట్లు, కర్నాటక హైకోర్టు మాజీ మహిళా జడ్జికి గవర్నర్ పదవి ఇప్పిస్తానంటూ రూ.ఎనిమిదిన్నర కోట్లు కోట్లు వసూలు చేశాడు. బిఎస్ ఇంద్రకళ అనే ఆ మాజీ జడ్జి నగదు రూపంలో నాలుగున్నర కోట్లు, ఆర్‌టిజిఎస్ ద్వారా రూ.3.77 కోట్లు చెల్లించారు. ఆమెను ఢిల్లీ తీసుకువెళ్లి కొంత మంది బీజేపీ అగ్రనేతలను పరిచయం చేశారట. ఆమె 2020లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. న్యాయమూర్తులుగా ఎలాంటి వారు ఎంపిక అవుతున్నారు, గవర్నర్ పదవులను కొనుక్కోవటం ఎంత సులభంగా ఉంటుందో డబ్బు, పలుకుబడి కలవారి ప్రయత్నాల గురించి ఈ ఉదంతం వెల్లడించింది. బీజేపీ, ఆర్ఎస్ఎస్ పెద్దలతో ఉన్న పలుకుబడితో తన కుమారుడికి ఉద్యోగం ఇప్పించమని ఒక డాక్టర్ రూ.30లక్షలు సమర్పించుకున్నారట. 2019లో స్వామి తనను రూ.పది కోట్లకు మోసం చేసినట్లు శశికాంత్ బంద్రే అనే వాణిజ్యవేత్త ఫిర్యాదు చేసిన తరువాత పైన పేర్కొన్న మోసాలన్నీ వెలుగులోకి వచ్చాయి.

ఇక హిందూత్వ నాయకురాలు చైత్ర కుందాపూర్, ఆమె గ్యాంగ్ మోసం చేసిన తీరు గురించి పోలీసులు వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. మోసగాళ్ల ముఠాలో స్వామీజీతో పాటు కబాబ్‌లు తయారు చేసి అమ్ముకొనే వ్యక్తి, ఒక క్షురకుడు ఉన్నారు. తమ సైద్ధాంతిక గురువు ఆర్ఎస్ఎస్, బీజేపీ, ప్రధాని కార్యాలయంలో తనకు పెద్ద తలకాయలు ఎందరో తెలుసని చైత్ర ప్రచారం చేసుకుంది. 2022లో వ్యాపారవేత్త పూజారికి ప్రసాద్ బైదూర్ అనే వ్యక్తిని పరిచయం చేసి అతను బీజేపీ కార్యకర్త అని చెప్పారు. చైత్ర



తలచుకుంటే రాష్ట్రంలో, కేంద్రంలో ఏదైనా సాధించగలదని అతను పూజారిని నమ్మించాడు. అది బాగా పని చేసిందని గ్రహించిన తరువాత ఆ ముఠా గగన్ కదూర్, రమేష్ నాయక్ అనే వారిని పరిచయం చేశారు. రమేష్ తన పేరును దాచి తాను చిక్‌మగళూరుకు చెందిన విశ్వనాథ్ అనే ఆర్ఎస్ఎస్ నేతనని గత 45ఏళ్లుగా పనిచేస్తున్నట్లు నమ్మించాడు. తరువాత బెంగళూరులోని ధనికులు నివాసముండే ప్రాంతంలో చెన్నా నాయక్ అనే అతన్ని బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యుడని పరిచయం చేశారు. ఒక పర్యావరణవేత్త, పద్మశ్రీ అవార్డు పొందిన 110సంవత్సరాల తిమ్మక్క కుమారుడు ఉమేష్‌తో గగన్ కదూర్‌కు పరిచయం ఉంది. ఆమెకు వయసు పైబడటంతో కాబినెట్ స్థాయి కల్పించి ఒక కారు కూడా ఇచ్చారు. ఉమేష్‌ను ఒప్పించి ఆ కారులో చెన్నా నాయక్, ఇతర ముఠా పూజారిని కలిశారు. అధికారిక కారును చూసి నిజంగానే పలుకు బడి కలిగిన వారని పూజారి నమ్మాడు. టిక్కెట్ కనుక రాకపోతే ఇచ్చిన సొమ్ము పూర్తిగా తిరిగి ఇస్తామని రమేష్ నాయక్ నమ్మబలికాడు. మూడు రోజుల్లో రూ.50లక్షలు, తరువాత రూ.మూడు కోట్ల మేర వసూలు చేశారు. ఆ సొమ్ములో ఒకటిన్నర కోట్లు అభినవ హలశ్రీ స్వామి అనే మఠాధిపతికి చెల్లించినట్లు పూజారి పేర్కొన్నాడు. 2022 జులై ఏడు నుంచి 2023 జనవరి 16 వరకు మొత్తం ఐదు కోట్లు సమర్పించుకున్నాడు.

బీజేపీ అభ్యర్థులను ప్రకటించటానికి కొద్ది రోజుల ముందు కాశ్మీరులోని ఒక ఆసుపత్రిలో ఆర్ఎస్ఎస్ నేత విశ్వనాథ్ మరణించినట్లు గగన్‌కదూర్ చెప్పాడు. అనుమానం వచ్చిన పూజారి విచారించగా అసలు ఆ పేరుగల వ్యక్తిలేడని తేలింది. దాంతో తన డబ్బు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేయటంతో మోసగాళ్ల ముఠా తప్పించుకు తిరిగింది. చివరకు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో అరెస్టు చేశారు. సెప్టెంబరు పన్నెండు నుంచి హలశ్రీ స్వామి పరారీలో ఉండి పందొమ్మిదవ తేదీ రాత్రి ఒడిషా పోలీసులకు చిక్కాడు. ఇంతకీ రమేష్ నాయక్ చిక్‌మగలూర్‌లోని ఒక క్షురకుడు అని తేలింది. చెన్నానాయక్ బెంగళూర్ కెఆర్‌పురంలో వీధుల్లో కబాబ్‌లు అమ్ముతాడని పోలీసులు గుర్తించారు. పూజారి నుంచి కొట్టేసిన సొమ్ములో భారీ మొత్తాన్ని చైత్ర నొక్కేసింది. విద్యార్థినిగా ఉండగా ఏబీవీపీలో పని చేసిన చైత్ర కొన్ని పత్రికల్లో జర్నలిస్టుగా, స్పందన అనే టీవీలో యాం కర్‌గా పని చేసింది. హిందూత్వ కార్యకర్తగా మైనారి టీల మీద రెచ్చగొట్టే ప్రసంగాలతో అనేక పాత్రల్లో కనిపించిన చైత్ర 2018లో ఉడిపి పట్టణంలో కాంగ్రెస్ మీద ధ్వజమెత్తి వెలుగులోకి వచ్చింది. కేంద్ర మంత్రులు కూడా ఆమెను ఆకాశానికెత్తారు. ముస్లింల మీద విద్వేష పూరిత ప్రసంగాలు చేసినందుకు ఆమెపై కేసులు కూడా నమోదు చేశారు. ఈ ఉపన్యాసాలకు బజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ ఏర్పాటు చేసిన ప్రదర్శనలు, సభలు, సమావేశాలే వేదికలు.

అవివాహిత అయిన చైత్ర కుందాపుర మీద ఉడిపిలో బీజేపీ కార్యకర్త సుధీన్ ఒక కేసు దాఖలు చేశాడు. తన కోసం ఒక దుకాణాన్ని కట్టిస్తానని చెప్పి ఆమె రూ.ఐదు లక్షలు తీసుకున్నదని, అది చేయకపోగా సొమ్ము వాపసు అడిగితే అత్యాచారం చేసినట్లు కేసు పెడతానని, హత్య చేయిస్తానని బెదిరించినట్లు పేర్కొన్నాడు. బీజేపీ టిక్కెట్ పేరుతో సొమ్ము తీసుకున్న వ్యాపారి పూజారిని కూడా బెదిరించినట్లు వెల్లడైంది. అరెస్టుకు ముందు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు ఒక లేఖ రాసి అతని వాణిజ్య లావాదేవీల మీద విచారణ జరపాలని, దర్యాప్తుకు తాను సహకరిస్తానని పేర్కొన్నది. తాను జర్నలిస్టుగా ఉన్నప్పటి నుంచి గోవిందబాబు పూజారి తెలుసునని, బీజేపీ టిక్కెట్ కోసం చూశాడని, తాను ఒక ప్రయివేటు కంపెనీలో పని చేసినపుడు అతని అక్రమ లావాదేవీల గురించి తెలుసుకున్నట్లు రాసింది. అతని అక్రమాలను బయట పెట్టేందుకు అతనితో సంబంధాల్లో ఉండి సమాచారం సేకరించినట్లు చెప్పుకుంది. చిత్రం ఏమిటంటే సదరు పూజారికి ఎంఎల్ఏ టిక్కెట్ రాకున్నా, ఎన్నికలకు ముందు బీజేపీ వెనుకబడిన తరగతుల మోర్చా కార్యదర్శి పదవిని బహూకరించారు. ఏ నియోజకవర్గంలో టిక్కెట్‌ను ఆశించాడో అదే చోట బీజేపీ అభ్యర్థికి ప్రచారం చేశాడు. అనేక మంది నేతలతో సంబంధాలను ఏర్పాటు చేసుకొని ఒక గుర్తింపు పొందాడు. అధికారం వచ్చిన తరువాత ఆ సొమ్మును ఏదో విధంగా రాబట్టుకోవచ్చని భావించి ఉండాలి. బీజేపీ ఓడిపోవటం, పార్టీ పదవి ఉన్నా ప్రయోజనం లేదని గ్రహించిన తరువాత తన సొమ్ము తనకు ఇచ్చివేయాలని డిమాండ్ చేయటంతో అసలు కథ బట్టబయలైనట్లు స్పష్టంగా కనిపిస్తోంది.

- సత్య



కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-చింతకాని

ప్రతి పేదింటి ఆడపిల్లకు పెద్దన్నలా ముఖ్యమంత్రి కేసీఆర్ కళ్యాణ లక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టారని జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు పేర్కొన్నారు గురువారం చింతకాని రైతు వేదికలో జరిగిన కార్యక్రమంలో మండలంలోని 57 మంది లబ్ధిదారులకు రూ.57,06,612 చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమల్ రాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం ఓ పక్క అభివృద్ధి మరోపక్క సంక్షేమం పరుగులు పెట్టిస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో కేసీఆర్ రుణం తీర్చుకునే అవకాశం మన ముందుకు వచ్చిందని అన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ పూర్ణయ్య, జెడ్పిటిసి కిషోర్, వైస్ ఎంపీపీ గురజాల హనుమంతరావు, రైతు బందు సమితి మండల కన్వీనర్ పొనుగోటి రత్నాకర్, ఖమ్మం మార్కెట్ కమిటీ డైరెక్టర్ వంకాయలపాటి వెంకట లచ్చయ్య, నాగలవంచ సహకార సంఘం అధ్యక్షుడు శేషగిరిరావు, ఆత్మ కమిటీ డైరెక్టర్ అంబటి వెంకటేశ్వర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, తాసిల్దార్ రమేష్, ఎంపీడీవో శ్రీనివాసరావు, చింతకాని పంచాయతీ కార్యదర్శి సైదులు తదితరులు పాల్గొన్నారు.



యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు : ఏవో

నవతెలంగాణ-ముదిగొండ

యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి మందుల రాధ ఎరువుల దుకాణదారులను హెచ్చరించారు. మండలంలోని మాదాపురం, వనంవారికిష్టాపురం, కమలాపురం, ముదిగొండ గ్రామాల్లో ఉన్న పలు ఎరువుల దుకాణాలను గురువారం ఆమె క్షేత్రస్థాయిలో సందర్శించి రిజిస్టర్లను పరిశీలించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు సాగు చేసిన పంటలకు అధికంగా యూరియా అవసరం ఉంటదని రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని డీలర్లు యూరియాని బ్లాక్ చేసి అధిక ధరలకు విక్రయించొద్దన్నారు. ఎమ్మార్పీ రేట్లకే విక్రయించాలన్నారు. ఒక్క రూపాయి అధిక ధరకు విక్రయించినట్లు సమాచారం తెలిసిన డీలర్‌షిప్ రద్దుచేసి, కఠినచర్యలు తీసుకుంటామన్నారు. యూరియా కావాల్సిన రైతులు సొసైటీలో యూరియా అందుబాటులో ఉందని, అవసరమైన రైతులు సొసైటీల యూరియాని తీసుకెళ్లొచ్చుని ఏఓ రాధ తెలిపారు.



పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

నవతెలంగాణ-వైరా

వైరా ఎమ్మెల్యే లావుడియా రాములునాయక్ మండలంలో విస్తృతంగా పర్యటించారు. నారపనేనిపల్లి, విప్పలమడక, లింగన్నపాలెం, గరికపాడు, దాచాపురం గ్రామాలలో విస్తతంగా పర్యటించిన ఎమ్మెల్యే ఆయా గ్రామాలలో డిఎంఎఫ్‌టి, ఎస్‌డిఎఫ్ నిధులు ఒక కోటి 36 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగింది. అట్టి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, పూర్తి అయిన పనులకు శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఆయా గ్రామాలలో జరిగిన కార్యక్రమాలలో సర్పంచులు శీలం సుజాత, ఎంపీటీసీ వెంకటరామిరెడ్డి, సర్పంచి జాన్ పాపయ్య, ఎంపీటీసీ బూరుగు సంజీవరావు, సర్పంచ్ అనిత, సర్పంచ్ కోట ఎలీషా, ఎంపీటీసీ మాగంటి సుందరమ్మ, సర్పంచ్ వేల్పులు జయరాజు, ఎంపీపీ వేల్పులు పావని, జడ్పిటిసి నంబూరి కనకదుర్గ, జడ్పీ కోఆప్షన్ షేక్ లాల్ మహమ్మద్, ఎక్స్ మార్కెట్ చైర్మన్ బీడీకే రత్నం, విప్పలమడక మాజీ సర్పంచ్ పారుపల్లి కృష్ణారావు, మోటపోతుల సురేష్, కర్నాటి హనుమంతరావు, అమరనేని మాధవరావు, చింతనిప్పు కరుణాకర్, మెరుగు రత్నరాజు, నాగార్జున, మేడా సూర్య ప్రసాద్, మాగంటి తిరుమలరావు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీవో 142 రద్దు చేయాలని ఎంఎల్ఏకి వినతి

నవతెలంగాణ-తల్లాడ



ఇటీవల ఆరోగ్య శాఖ విడుదల చేసిన 142 జీవోను రద్దు చేయాలని కోరుతూ జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సీతారామ ఆధ్వర్యంలో గురువారం సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ జీవో వలన ఆరోగ్య శాఖలోని వివిధ క్యాడర్ల సిబ్బంది పోస్టులను తగ్గించడం లేదా రద్దు చేయడం జరుగుతుందని, దీనివల్ల ప్రజలకు ఆరోగ్య సేవలు సక్రమంగా అందే అవకాశం లేదన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు, ముగ్గురు స్టాఫ్ నర్స్, సూపర్వైజర్లు ప్రస్తుతం ఉండి ప్రజలకు 24 గంటల వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ఈ జీవో నెంబర్ 142 అయిలయితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కేవలం ఒక వైద్యుడు, ఒక స్టాఫ్ నర్స్, ముగ్గురు సూపర్వైజర్లు మాత్రమే ఉంటారని 24 గంటలు వైద్య సేవలు అందించడం ఇబ్బంది కరమన్నారు. కార్యక్రమంలో సత్తుపల్లి డివిజన్‌లోని ఆరోగ్యశాఖ సిబ్బంది భాస్కర్, శివరాజ్, వెంకటనారాయణ, పెద్ద పుల్లయ్య, ధనలక్ష్మి, ప్రమీల, శ్రీకర్, అనంత రాములు, నాగేశ్వరరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

వైరా : వైరా నియోజకవర్గ ఆరోగ్య సిబ్బంది జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడి ఇటీవల ఆరోగ్య శాఖలో వెలువడిన జీవో నెంబర్ 142(అనగా ఆరోగ్య శాఖలో ఉద్యోగుల హేతుబద్ధీకరణ) ను రద్దు చేయాలని జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో వైరా ఎమ్మెల్యేలావుడియ రాములు నాయక్‌కు గురువారం విజ్ఞాపన పత్రం అందజేశారు. కార్యక్రమంలో వైరా డివిజన్లోని ఆరోగ్యశాఖ సిబ్బంది ధనలక్ష్మి, భాస్కర్, శివరాజ్, అనంత రాములు,పెద్ద పుల్లయ్య , రాజా కొమరమ్మ, జ్యోతిరత్నం, మరియు ఏఎన్ఎంలు కష్ణకుమారి విజయలక్ష్మి పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల సమావేశాన్ని జయప్రదం చేయండి

అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గుడిమెట్ల రజిత

నవతెలంగాణ-వైరాటౌన్

సెప్టెంబర్ 30వ తేదీన హైదరాబాద్‌లో జరిగే అగ్రిగోల్డ్ బాధితుల సమావేశాన్ని జయప్రదం చేయాలని అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గుడిమెట్ల రజిత కోరారు. గురువారం గుడిమెట్ల రజిత మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లోని ముగ్దం భవనం నందు శనివారం ఉదయం 10.30 గంటలకు సమావేశం జరుగుతుందని తెలిపారు. అగ్రిగోల్డ్ ఏజెంట్లు, కస్టమర్లు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.



ఆశాల సమ్మెతో నిలిచిన వైద్య సేవలు

- మొండిచేయి చూపిస్తున్న ప్రభుత్వం
- కనీస వేతనం అమలు పరచాలి
- సీఐటీయు పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం
- సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తుమ్మ, కల్యాణం

నవతెలంగాణ - ఎర్రుపాలెం



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా వర్కర్లు కష్టపడి పని చేస్తే వారి నుండి కలిగే ఫలితాలను ప్రభుత్వాలు అనుభవిస్తు న్నాయని, గ్రామ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తున్న ఆశా కార్యకర్తలు సమ్మె బాట పట్టడంతో గ్రామాలలో వైద్య సేవలు నిలిచిపోయాయని సిఐటియు జిల్లా కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు ప్రభుత్వాలను విమర్శించారు. ఆశా కార్యకర్తలు తమ న్యాయమైన హక్కుల సాధనకు గత నాలుగు రోజులు నుండి తహసిల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేస్తున్న ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు ఈ సందర్భంగా నండ్రు సుధా అధ్యక్షతన జరిగిన సమా వేశంలో కళ్యాణం మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న ఆశా వర్కర్ల సమ్మె కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అసమర్థతకు కారణమని విమర్శించారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, అతిసార వ్యాధులతో గ్రామాలలో ప్రజలు బాధ పడుతున్నా ప్రభుత్వంలో చలనం లేదని, ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులు జీతాలు పెంచాలని అడగకపోయినా వారి ఇష్టం వచ్చిన రీతులలో పెంచుకున్నారని, సంవత్సరాల కాలం తరబడి పని చేస్తున్న ఆశా వర్కర్లు జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తున్నా మొండిచేయి చూపిస్తున్నారని విమర్శించారు. ఆశా కార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పనికి తగిన పారితోషకం, కనీస వేతనం 18 వేల రూపాయలు అమలు పరచాలని, పీఎఫ్, ఈఎస్ఐ రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇన్సూరెన్స్, గుర్తింపు కార్డులు, యూనిఫామ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లతో చర్చలు జరిపి వారి డిమాండ్లను వెంటనే పరిష్కరిం చాలని, లేని ఎడల అన్ని రాజకీయ పార్టీల మద్దతుతో సమ్మె మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అ ధ్యక్షుడు తుమ్మ విష్ణువర్ధన్ రెడ్డి, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి రమణ, జిల్లా అధ్యక్షురాలు మంగ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శీలం నరసింహారావు, మండల కన్వీనర్ సంజీవరావు, ఆశ వర్కర్లు వెంకటరమణ, యేసుమని, విజయ, మరియమ్మ, వెంకట్రావమ్మ, బాయమ్మ, చైతన్య, రోజా పాల్గొన్నారు.

కొణిజర్ల : రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఆశా వర్కర్లు సిఐటియూ ఆధ్వర్యంలో ఎంపిడివో కార్యాలయం ఎదుట సమ్మెను ప్రారంభించారు. ఆశా వర్కర్ల సమ్మెకు సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి క్రిష్ణ, సీఐటీయూ జిల్లా నాయకులు అనుమోలు రామారావులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు సాయిబి, రమణ, కృష్ణవేణి, సుజాత, ధనలక్ష్మి, నాగరత్నం, సునీత, దేవమణి, కుమారి, పద్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బోనకల్ : తమ సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మండల పరిషత్తు కార్యాలయం ముందు ఆశా కార్యకర్తలు గురువారం చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం ముందు ఆశా కార్యకర్తలు గత కొన్ని రోజులుగా సమ్మె శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సమ్మె శిబిరాన్ని సిఐటియు మండల కన్వీనర్ బోయినపల్లి వీరబాబు సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు గురువారం సందర్శించి సంఘీభావం మద్దతు తెలిపారు. సంఘీభావం తెలిపిన వారిలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఆకెన పవన్ తదితరులు ఉన్నారు. సమ్మె శిబిరంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు ఇరుగు యశోద, మండల కార్యదర్శి రామన సరోజిని, వంగల దుర్గ, మరీదు లీలా కుమారి, నక్కల నారాయణమ్మ, గద్దె తులసి, వి.రమాదేవి, బి.తులసమ్మ, ఇరుగు యశోద, కొమ్మ గిరి నాగేంద్రమ్మ, కొంగల వెంకటరమణ పాల్గొన్నారు.

వైరాటౌన్: ఆశ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఐద్వా వైరా పట్టణ కార్యదర్శి గుడిమెట్ల రజిత డిమాండ్ చేశారు. గురువారం వైరాలో ఆశ వర్కర్లు చెవిలో పూలు పెట్టుకుని నాల్గవ రోజు సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐద్వా వైరా పట్టణ కార్యదర్శి గుడిమెట్ల రజిత ఆశా వర్కర్ల సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు వైరా పట్టణ కన్వీనర్ అనుమోలు రామారావు, జిల్లా నాయకులు తోట నాగేశ్వర రావు, సిపిఐ(ఎం) వైరా పట్టణ కమిటీ సభ్యులు గుడిమెట్ల మోహనరావు, ఐద్వా నాయకురాలు బత్తుల ప్రమీల, ఆశా వర్కర్లు శైలజ, రేణుక, దీప, కోటేశ్వరి, అమృత, నాగమణి, రజిని, ప్రమీల, యశోద, పద్మ, ద్వారక, భవాని, మరియమ్మ హైమావతి, కృష్ణమ్మ, ప్రేమలీల, కుమారి పాల్గొన్నారు.

కారేపల్లి: ఆశా కార్యకర్తల న్యాయమైన కోరికలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశా కార్యకర్తలు చేస్తున్న సమ్మె గురువారంకు నాల్గోవ రోజుకు చేరుకుంది. సమ్మె శిబిరాన్ని సీఐటీయు మండల కన్వీనర్ కే.నరేంద్ర సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్షకార్యదర్శులు జంగ కళ్యాణి, వాంకుడోత్ కమల, నాయకులు కుమారి, అంజమ్మ సర స్వతి, కృష్ణమ్మ, అచ్చమ్మ, రేణుక, కమ్లి, గోమిలి పాల్గొన్నారు.

కొణిజర్ల(ఏన్కూర్) : రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తున్న ఆశా కార్మికులు, అంగన్వాడీ వర్కర్స్ మరియు మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించి సమ్మెను విరమింప చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న ఆశ కార్మికుల సమ్మె మరియు మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మెకు సంఘీభావం ప్రకటించి మద్దతు తెలిపారు. కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే వచ్చే ఎన్నికల్లో తగిన స్థాయిలో గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. సంఘీభావం తెలిపిన వారిలో సిపిఎం మండల కార్యదర్శి దొంతబోయిన నాగేశ్వరరావు, సిఐటియు మండల కన్వీనర్ ఏర్పుల రాములు, అరికాయలపాడు గ్రామ ఉపసర్పంచ్ గుడ్ల వెంకటేశ్వర్లు, ఆశా వర్కర్ యూనియన్ జిల్లా కార్యదర్శి బానోతు అమల తదితరులు పాల్గొన్నారు.

చింతకాని: సిఐటియూతోనే కార్మికుల సమస్యల పరిష్కారమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం చింతకాని మండల కేంద్రంలో సమ్మె చేస్తున్న ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులకు సిఐటియు జిల్లా కమిటీ సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తుమ్మ విష్ణువర్ధన్, కళ్యాణం వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో తమ కార్మికుల బతుకులు మారతాయనుకుంటే ఏ మాత్రం మార్పు లేదని అన్నారు. ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, రూ.18 వేలు ఫిక్స్ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు మడిపల్లి గోపాలరావు, నాయకులు గడ్డం కోటేశ్వరరావు, ఆశ కార్యకర్తలు కమల, ఉమా, మధ్యాహ్న భోజన కార్మికులు ప్రమీల, పద్మ, లక్ష్మి, ఉపేంద్ర, రాధా పాల్గొన్నారు.

మధిర: ఆశా వర్కర్ల సమస్యను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మధిర పిహెచ్‌సీ నందు చెవిలో పువ్వుతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తుమ్మ విష్ణువర్ధన్, కళ్యాణ వెంకటేశ్వరరావులు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పడకంటి మురళి, వడ్రానపు మధు, ఆశా వర్కర్లు సృజన, లక్ష్మి, అరుణ, సుజాత, భారతి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

దళిత బంధు, ఉచిత విద్యుత్ సాధనకై 4న సదస్సు : కెవిపీఎస్

నవతెలంగాణ నేలకొండపల్లి



దళిత బంధు ఉచిత విద్యుత్ సాధనకై ఈ నెల 4 న స్థానిక శ్రీ సీతారామ ఫంక్షన్ హాల్‌లో జరిగే కెవిపిఎస్ మండల సదస్సులు జయప్రదం చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర నాయకులు పాపేట్ల సత్యనారాయణ పిలుపునిచ్చారు. సదస్సు జయప్రదం కోరుతూ గురువారం మండలంలోని సదాశివపురం, అనాసాగరం, ముజ్జుగూడెం, గువ్వలగూడెం తదితర గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. దళితవాడలో కనీస మౌలిక సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎస్సీ కార్పొరేషన్ రుణాల మంజూరిలో లబ్దిదారులను ఎంపిక చేసి రెండేళ్ల గడుస్తున్న నేటికీ నిధులు మంజూరు చేయలేదన్నారు. 2021 ఆర్థిక సంవత్సరంలో దళితులకు ప్రభుత్వం మంజూరి చేయాల్సిన ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలను తక్షణమే పంపిణీ చేయాలని లేని ఎడల దళితులను పెద్ద ఎత్తున సమీకరించి కలెక్టరేట్ ముట్టడి చేపడుతామన్నారు. మండలంలోని అనేక దళితవాడలలో నేటికి స్మశాన వాటికలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జీవో నెంబర్ 1235 ప్రకారం ప్రతి దళితవాడకు రెండు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని చెబుతున్న అది ఎక్కడ అమలుకు నోచుకోవడం లేదన్నారు. అక్కడక్కడ స్మశాన వాటికలు కేటాయించిన ఆయా స్థలాలు కబ్జాకు గురవుతున్న సంబంధిత అధికారులు ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. మండలంలో బోదులబండ గ్రామంలో స్మశాన స్థలాన్ని కొంతమంది ఆక్రమించుకోవడానికి ప్రయత్నించడంతో కెవిపిఎస్ ఆధ్వర్యంలో అడ్డుకోవడం జరిగిందన్నారు. కొన్ని దళితవాడలలో గత 30 ఏళ్ల క్రితం నిర్మించిన పెంకుటిల్లు శిధిలావస్థకు చేరుకోవడంతో అవి ఎప్పుడు కూలిపోతాయే మోనని భయంతో బాధితులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. పేదలకు సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో ఆర్భాటంగా చేపట్టిన గహలక్ష్మీ పథకం అమలుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకుండా పోయిందన్నారు. లబ్ధిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించి ఇంటింటికి వెళ్లి అధికారులు సర్వే పూర్తి చేసి నెల రోజులు గడుస్తున్న లబ్దిదారులను ఎంపిక చేయకపోవడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. లబ్ధిదారుల ఎంపికలో జాప్యం పట్ల ప్రజలు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారన్నారు. గృహలక్ష్మి పథకం కింద ఎస్సీలకు ఎక్కువ ఇండ్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళితవాడలలో కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్లు, ఇండ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పెన్షన్లు మంజూరు చేయాలని లేనియెడల దళితులను పెద్ద ఎత్తున సమీకరించి ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కెవిపిఎస్ మండల నాయకులు పొట్టపింజర స్టాలిన్, పొట్టపింజర నరేష్, గీత కార్మిక సంఘం జిల్లా నాయకులు కట్టెకుల వెంకటేశ్వర్లు, మల్లికార్జున్‌రావు, ప్రశాంత్, పుల్లయ్య దీనయ్య దావీదు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



చావగాని సైదులుకు నివాళి

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

పిండిప్రోలు గ్రామానికి చెందిన సిపిఎం సానుభూతిపరుడు చావగాని సైదులు ఆకస్మికంగా మృతిచెందారు. మృతదేహాన్ని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు దొండేటి ఆనందరావు, బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, సొసైటీ వైస్ చైర్మన్ చామకూరి రాజు, గ్రామ శాఖ అధ్యక్షులు పరికిపల్లి చంద్రశేఖర్‌లు సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సైదులు లేని లోటు పార్టీకి తీరనిలోటని అన్నారు. వారి కుమారుడు ఉపేందర్‌తో పాటు ఆ కుటుంబం అంతా కూడా పార్టీ అభివృద్ధికి ఎంతో చేశారన్నారు. నివాళ్లర్పించిన వారిలో సిపిఎం సీనియర్ నాయకుడు దొండేటి ఆనందరావు, రామన బోయిన రవి, దొండేటి నిర్మల్‌రావు, మల్లెబోయిన యాదగిరి, ఉపేందర్, పప్పుల ఉపేందర్, నాగటి సురేష్, పప్పుల ప్రసాద్, తిరుమలాయపాలెం సొసైటీ డైరెక్టర్ చల్లా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్వామినాథన్ మృతి వ్యవసాయరంగానికి తీరని లోటు

తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

నవతెలంగాణ-వైరాటౌన్

భారతదేశ హరిత విప్లవ పితామహుడు, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ మృతికి తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు, రాష్ట్ర కమిటీ సభ్యులు చింతనిప్పు చలపతిరావు, జిల్లా కమిటీ సభ్యులు బొంతు సమత, మల్లెంపాటి రామారావు, వనమా చిన్న సత్యనారాయణ, వైరా మండల అధ్యక్షులు మేడా శరాబంధి, కార్యదర్శి కిలారు శ్రీనివాసరావు తదితరులు సంతాపం తెలిపారు. యూపీఏ 1ప్రభుత్వం సమయంలో రైతులు ఆత్మహత్యలు నివారణ, వ్యవసాయరంగంలో సంక్షోభం పరిష్కారం కోసం నియమించిన వ్యవసాయ కమిషన్ చైర్మన్‌గా దేశవ్యాప్తంగా రైతులు అభిప్రాయం సేకరించి ఇచ్చిన నివేదిక స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు ప్రసిద్ధి చెందాయని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. స్వామినాథన్ మృతి వ్యవసాయరంగంకు తీరని లోటని పేర్కొన్నారు.

భగత్‌సింగ్ ఆశయ సాధనకు పాటుపడాలి : డీవైఎఫ్ఐ

నవతెలంగాణ- ఖమ్మంకార్పొరేషన్



భగత్‌సింగ్ అంటే యువతకి ఉత్తేజమని, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని డివైఎఫ్ఐ ఖమ్మం త్రీ టౌన్ కార్యదర్శి శీలం వీరబాబు యువతకు పిలుపునిచ్చారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని స్థానిక త్రీ టౌన్ ప్రాంతంలో బుడిగం కృష్ణమూర్తి భవనంలో భగత్ సింగ్ 116 వ జయంతి వేడుకలు డివైఎఫ్ఐ ఖమ్మం త్రీ టౌన్ ఉపాధ్యక్షుడు యర్రా సాయికుమార్ అధ్యక్షతన జరిగింది. భగత్ సింగ్ జయంతి సభలో ముఖ్య అతిథిగా డివైఎఫ్ఐ త్రీ టౌన్ కార్యదర్శి శీలం వీరబాబు పాల్గొని మాట్లాడుతూ నిరుద్యోగ సమస్య, మతోన్మాదంపైన యువత రాజీలేని పోరాటాలు నిర్వహించడమే భగత్ సింగ్‌కి నిజమైన ఘన నివాళి అని డివైఎఫ్ఐ త్రీ టౌన్ కార్యదర్శి శీలం వీరబాబు తెలిపారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ త్రీ టౌన్ నాయకులు కీతా యశ్వంత్, పాషా, సురేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

జీఎంపీఎస్ నగదు బదిలీ పోరాటానికి మద్దతు

- జీఎంపిఎస్ నాయకత్వంపై అక్రమ కేసులు ఎత్తివేయాలి
- ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరాటానికి సిద్ధం గొర్రెల పంపిణీ పథకంపై 3న కలెక్టర్‌ను కలవనున్న అఖిలపక్ష పార్టీల నేతలు

నవతెలంగాణ- ఖమ్మంకార్పొరేషన్



గొర్రెల పంపిణీ పథకం అవినీతి, అక్రమాలకు తావు లేకుండా నగదు బదిలీ రూపంలో అమలు చేయాలని గొర్రెల మేకల పెంపకందారుల సంఘం ఆధ్వర్యంలో గత రెండు సంవత్సరాలుగా చేస్తున్న పోరాటానికి సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సిపిఐ యంయల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు, సిపిఐ జిల్లా నాయకులు మేకల శ్రీనివాసరావు, బియస్పి జిల్లా అధ్యక్షులు అల్లిక వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా నాయకులు మూడు ముంతల గంగరాజు, తెలుగు దేశం పార్టీ జిల్లా నాయకులు మీగడ రామారావు మరియు వివిధ ప్రజాసంఘాలు, సామాజిక సంఘాల నాయకులు సంపూర్ణ మద్దతు, సంఘీభావాన్ని తెలిపారు. స్థానిక యూటిఎఫ్ కార్యాలయంలో జియంపియస్ జిల్లా అధ్యక్షులు చింతలచెర్వు కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తుశాకుల లింగయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వమే లబ్దిదారుల వాటాదనం 43,750/- చెల్లించాలని, కట్టిన లబ్దిదారుల వాటాధనం డబ్బులు వాపస్ ఇవ్వాలని, దళిత బంధు, బీసీబంధు లాగే గొర్రెల పంపిణీ పథకం అవినీతికి ఆస్కారం లేకుండా నగదు బదిలీ ద్వారా అమలు చేయాలని అన్నారు. పట్టణ ప్రాంత యాదవ, కురుమలకు ఈ పథకం వర్తింపచేయాలని, 22న మహాధర్నా సందర్భంగా జీఎంపిఎస్ నాయకత్వంపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని అన్నారు. అక్టోబర్ 3న గొర్రెల పంపిణీ పథకంపై జిల్లా కలెక్టర్‌ని అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు కలవాలనే ఏజెండాలను ప్రతిపాదించడం జరిగింది అన్నారు.జియంపియస్ నాయకత్వం ప్రతిపాదనను హాజరైన రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు ఏకగ్రీవంగా ఆమోదిస్తూ ప్రత్యక్ష పోరాటానికి పూనుకొం టామని హామీ ఇచ్చారు. జిల్లాలో 17వేల యాదవ్, కురుమ కుటుంబాలను కెసిఆర్ ప్రభుత్వం తీవ్ర మనోవేదనకు గురిచేస్తూ అప్పుల పాలు చేస్తుందని విమర్శించారు. ఎన్నికల స్టంట్‌లో భాగమే సంక్షేమ పథకాలు తప్ప బిఆర్ఎస్‌కి నిజంగా పేదల అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి లేదని తెలిపారు. సమావేశంలో చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ యర్రా శ్రీకాంత్, మాదినేని రమేష్, వాసిరెడ్డి వర ప్రసాద్, గుడవర్తి నాగేశ్వరరావు, (రైతు సంఘం) పుచ్చకాయల వెంకటేశ్వర్లు (సిపిఐ), జి. రామయ్య (ఐయఫ్‌టియు), తోట రామాంజనేయులు (ఎఐటియుసి), హుస్సేన్ (కాంగ్రెస్), తిరుమలాచార్యులు



(సిఐటియు), గజ్జి సూర్యనారాయణ (ఐయన్‌టియుసి), నాగమలేశ్వరరావు(యూటియఫ్), ఝాన్సీ, బి.అనసూయ (పిఓడబ్ల్యూ), బోడపట్ల సుదర్శన్ (గీత కార్మిక సంఘం), అన్నారపు వెంకటేశ్వర్లు (రజక సంఘం), భద్రయ్య (వ్యవసాయ కార్మిక సంఘం), పగడాల నాగేశ్వరరావు (మత్స్య కార్మిక సంఘం), పోనుకుల కోటేష్ (యాదవ హక్కుల పోరాట సంఘం), గరిడేపల్లి సత్యనారాయణ, మామిళ్ళ వెంకటేశ్వర్లు, భట్టు నరసింహారావు, యడ్ల తిరుపతిరావు, కుర్రా వెంకట్రామయ్య, బండారు శ్రీనివాసరావు, వడ్డమూడి నాగేశ్వరరావు, యం. వీరన్న, దనియాకుల రామయ్య, తదితరులు పాల్గొన్నారు.



గుర్రం జాషువా స్ఫూర్తితో మనువాదంపై పోరాడాలి

కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్

నవతెలంగాణ - ఖమ్మం

నవయుగ కవి చక్రవర్తి అయిన గుర్రం జాషువా స్ఫూర్తితో నేడు పెచ్చరిల్లుతున్న మనువాదంపై యువత పోరాడాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్, జిల్లా అధ్యక్షులు ముత్తమాల ప్రసాద్‌లు పిలుపునిచ్చారు. గురువారం న కెవిపిఎస్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్నెస్పీ క్యాంప్ లోని సంఘం జిల్లా కార్యాలయంలో గుర్రం జాషువా 128వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి కవులు, కళాకారులు, యువత గుర్రం జాషువా అడుగుజాడల్లో నడిచి కుల, మత ఛాందసవాదాలకు వ్యతిరేకంగా తమ కవితల ద్వారా, పోరాటాల ద్వారా సమాజాన్ని మేల్కొల్పాలని కవులు, కళాకారులకు, యువతకు వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు నకరీకంటి చిరంజీవి, కుక్కల సైదులు, బోట్ల సాగర్, రెడపంగి ప్రకాష్, జోసెఫ్, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.



సాగర్ జలాలు విడుదల చేయాలి

తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

నవతెలంగాణ-ముదిగొండ

సాగర్ జలాలు విడుదల చేసి ఆయకట్టు పరిధిలో రైతుల పంటలు కాపాడాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలపరిధిలో వెంకటాపురంలో రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో సాగర్ ఆయకట్టుదారుల పంటలు రక్షించే ప్రయత్నం ప్రభుత్వం చేయాలన్నారు. వేలాది ఎకరాల విస్తీర్ణంలో రైతులు సాగుచేసిన వరి పంటకు అక్టోబర్, నవంబర్ నెలలో సాగునీరు అవసరం ఏర్పడుతుందని, వాగులు, వంకలు, చెక్ డ్యాంలో నీరు అందుబాటులో లేకపోతే, జిల్లాలో రైతాంగం పూర్తి స్థాయిలో నష్టపోయే అవకాశం ఉందని ఇప్పటికే సాగర్ ఆయకట్టు పరిధిలో పంటలు సాగు కావాల్సిన మేరకు కాలేదని మరోవైపు మిర్చికి తెగుళ్ళు వచ్చి మిర్చి పంటలను తొలగిస్తున్నారన్నారు. సాగైన పంటలను రక్షించే బాధ్యతను, ప్రభుత్వం గుర్తించి సాగర్ జలాలు విడుదల షెడ్యూల్ ప్రకటించాలని, రైతులు రుణమాఫీ సంపూర్ణంగా అమలు చేయాలని, ఖమ్మం జిల్లాలో 60 శాతం రైతులు రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాయల వెంకటేశ్వరరావు, తాతా భాస్కర్‌రావు, సహాయ కార్యదర్శి వాసిరెడ్డి వరప్రసాద్ పాల్గొన్నారు.



మోదుగు లక్ష్మయ్యకు మార్పు స్వచ్ఛంద సంస్థ చేయూత

నవతెలంగాణ-వైరాటౌన్

వైరా మున్సిపాలిటీ 14వ వార్డు ఇందిరానగర్ కాలని నివాసి మోదుగు లక్ష్మయ్యకు మార్పు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ప్లాస్టిక్ సామానులు అమ్ముకుని జీవనం సాగిస్తున్న మోదుగు లక్ష్మయ్యకు రోడ్డు ప్రమాదం జరగడం, కిడ్నీ సమస్య వలన బాడీ మొత్తం వాపు వచ్చింది. భార్యకు కూడా ఆరోగ్యం బాగా లేకపోవడం వలన వైద్య ఖర్చులను, కుటుంబ పోషణకు ఆర్థికంగా ఇబ్బంది పడుతూ దాతల సహాయం కోసం ఎదురు చూస్తున్న విషయం తెలుసుకున్న మార్పు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు గుడిమెట్ల రజిత గురువారం మోదుగు లక్ష్మయ్య ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా గుడిమెట్ల రజిత మాట్లాడుతూ చిన్న సహాయం కూడా ఆపదలో ఉన్నవారికి చాలా ఉపయోగ పడుతుందని, మానవత్వంతో దాతలు ముందుకు వచ్చి మోదుగు లక్ష్మయ్యకు సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్పు స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి గుడిమెట్ల మోహనరావు, ఆదూరి ప్రేమ్ కుమార్, మాదినేని నాగరాణి, పిసరు ప్రశాంత్, గరిడేపల్లి సాయి, కంభంపాటి సత్యనారాయణ, చట్ల దానియేలు, మోదుగు చిన్ననాగరాజు, కర్లకంటి వెంకటేశ్వర్లు, శ్రీను, పిడియల నరేష్ పాల్గొన్నారు.



ఆరు గ్యారెంటీ పథకాలపై ప్రచారం

మహిళా కాంగ్రెస్ సమావేశం

నవతెలంగాణ-ఎర్రుపాలెం

కాంగ్రెస్ పార్టీ నాయకురాలు సోనియా గాంధీ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలుగా ప్రవేశ పెట్టిన 6 గ్యారెంటీ పథకాలపైన ప్రజలకు వివరించాలని ఖమ్మం జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, ఖమ్మం మహిళా కాంగ్రెస్ పార్లమెంట్ ఇంచార్జ్ షేక్ అమర్జహ బేగ్ కార్యకర్తలకు సూచించారు. ఎర్రుపాలెం మండల పరిధిలోని మీనవోలు గ్రామ నందు కాంగ్రెస్ పార్టీ మండల మహిళ అధ్యక్షురాలు గంటా తిరుపతమ్మ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచులు వేమిరెడ్డి అనురాధ, సగ్గుర్తి రాజేశ్వరి, కోట వజ్రమ్మ, మహిళా నాయకురాలు అనుమోలు శ్రీదేవి, జంగా ఉమా మహేశ్వరి, షేక్ రజియా, మండల అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, టిపిసిసి సభ్యులు శీలం ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షులు శీలం శ్రీనివాసరెడ్డి, బండారు నరసింహారావు, సొసైటీ వైస్ చైర్మన్ కడియం శ్రీనివాసరావు, అనుమోలు కృష్ణారావు, దేవరకొండ రాజీవ్ గాంధీ,షేక్ జానీ భాష, గూడెటి బాబురావు, శీలం వెంకటరామిరెడ్డి, కంచర్ల వెంకట నరసయ్య పాల్గొన్నారు.

వైద్య ఖర్చుల నిమిత్తం వితరణ

నవతెలంగాణ- కల్లూరు

మిట్టపల్లి గ్రామానికి చెందిన తుమ్మలపల్లి కృష్ణ కుమార్తె శ్రీమల్లికా కాలేయ వ్యాధితో బాధపడుతుండగా వైద్య ఖర్చుల నిమిత్తం కల్లూరు లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు రాయల మురళి, అనితల మనవడు నాళ్ల బృహత్ జన్మదిన సందర్భంగా 4 వేలు వితరణగా గురువారం అందచేశారు. కార్యక్రమంలో లైన్స్ క్లబ్ జోన్ చైర్మన్ చలువాది నగేష్, అధ్యక్షులు దారా సురేష్, కోశాధికారి రాయల సత్యనారాయణ, ఉపాధ్యక్షులు గంగుల నారాయణరావు, రాయల నాగేశ్వరావు, నాళ్ల బాలాజీ, నవ్య, ఇందోజు రమేష్, నాగుబండి శ్రీనిసరావు తదితరులు పాల్గొన్నారు.

స్వామినాథన్ మృతి వ్యవసాయ రంగానికి తీరని లోటు

రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వరరావు

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త, దేశంలో హరితవిప్లవ పితామహుడు ప్రొఫెసర్ ఎంఎస్ స్వామినాథన్ మృతికి రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. స్వామినాథన్ మృతి వ్యవసాయ రంగానికి తీరని లోటు అని పేర్కొన్నారు. ఈ దేశంలో ప్రజలకు ఆహార భద్రతతో పాటు రైతులకు ఆదాయ భద్రత కల్పించాలాస్సిన బాధ్యత ప్రభుత్వాలు తీసుకోవాలని అనేక సిఫార్సులలో స్వామినాథన్ సూచించినట్లు తెలిపారు. పంటలకు మద్దతు ధర విషయంలో స్వామినాథన్ కమిటీ సిఫార్సులు నేటికీ ఆచరణీయమని స్పష్టం చేశారు. మద్దతు ధర రైతుకు లాభసాటిగా ఉండాలని, రైతు పెట్టే పెట్టుబడికి అదనంగా సగం కలిపి మద్దతు ధరను ప్రకటించాలని స్వామినాథన్ సూచించినట్లు పేర్కొన్నారు. ఈ సూచనలను అమలు చేస్తామని అన్ని పార్టీలు ఎన్నికలకు ముందు వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు మొండి చేయి చూపాయని తెలిపారు. స్వామినాథన్ స్ఫూర్తితో ఆయన చేసిన సిఫారసులను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు రాజకీయాలకు అతీతంగా రైతులు సంఘటితం కావాలని నల్లమల పిలుపునిచ్చారు.

వేతన హామీ అమలు చేయాలి

మధ్యాహ్న భోజన వర్కర్ల సమ్మె

నవతెలంగాణ-కారేపల్లి



మధ్యాహ్న భోజన వర్కర్లకు ప్రభుత్వం వేతనం రూ.3వేలు ఇస్తానన్నా హామీ వెంటనే అమలు చేయాలని,పెండింగ్ బిల్లులు చెల్లించాలని, ఉద్యోగ భద్రత, గ్యాస్ సబ్సిడీ వంటి డిమాండ్లు అమలు చేయాలని ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చినా స్పందించక పోవటంతో గురువారం నుండి సమ్మెలోకి దిగారు. కారేపల్లి ఎంఆర్‌సీ వద్ద సమ్మె శిబిరాన్ని సీఐటీయు మండల కన్వీనర్ కే.నరేంద్ర ప్రారంభించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షకార్యదర్శులు నరసమ్మ మేదరి మంగతాయి, ఉపాధ్యక్షురాలు విక్టోరియా, నాయకురాళ్లు స్వరూప, మంగా, లక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

కామేపల్లి : మధ్యాహ్న భోజన వర్కర్లకు నెలకు 25వేల రూపాయల వేతనం ఇవ్వాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గి కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని మధ్యాహ్న భోజన వర్కర్ల ఆధ్వర్యంలో కామేపల్లి తాసిల్దార్ కార్యాలయం ముందు సమ్మెను చేపట్టారు. ఈసమ్మెను ఆయన ప్రారంభించారు.

ఖమ్మంరూరల్ : కనీస వేతనాలు అమలు చేయాలని, తమ సమస్యలు పరిష్కరించాలని, జీవో నెంబర్ 8 ప్రకారం వేతనాలు విడుదల చేయాలని కోరుతూ గురువారం నుంచి మధ్యాహ్న భోజన వర్కర్లు సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె చేపట్టారు. మండలంలోని పెద్దతండా గ్రామం వద్ద ప్రధాని రహదారి పక్కన ఈ సమ్మె శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమ్మె శిబిరాన్ని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పి.మోహన్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో వెట్టి చాకిరీ చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం చిన్న చూపు చూడటం మంచి పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు మేడికొండ నాగేశ్వరరావు, మధ్యాహ్న భోజన వర్కర్ల నాయకులు దుంపల లక్ష్మి, జయమ్మ, చిత్రా స్వరాజ్యం, భద్రమ్మ, రాధమ్మ, సైదమ్మ, శ్రీలత, రూప, ఉమా, అరుణ, అన్నమ్మ, రమా, సుజాత, అరుణ, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మాన్ని మోడల్ నగరంగా అభివృద్ధి చేశా

మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

నవతెలంగాణ-ఖమ్మం



నగరంలో ప్రతి డివిజన్‌లో నాణ్యమైన రోడ్లు నిర్మించి నగరాన్ని మోడల్ నగరంగా అభివృద్ధి పర్చడం జరిగిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని 12వ డివిజన్‌లో రూ.20 లక్షల ఎల్ఆర్ఎస్ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మునుపెన్నడు లేని విధంగా నగర ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం జరిగిందని తెలిపారు. నగర సమగ్రాభివృద్ధిలో భాగంగా ఇప్పటికే కోట్ల రూపాయలు వెచ్చించి సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేకంగా మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులకు గాను మంజూరు చేసిన రూ.50 కోట్లతో పూర్తి స్థాయిలో సీసీ డ్రెయిన్లు నిర్మించేందుకు ఇప్పటికే శంకుస్థాపనలు చేశామని పనులు కూడా కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, సుడా ఛైర్మన్ విజయ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, కార్పొరేటర్ చిరుమామిళ్ల లక్ష్మీ నాగేశ్వరరావు, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, డిఇ ధరణి కుమార్, జిల్లా ఆర్‌టీఏ సభ్యులు వల్లభనేని రామారావు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సొంతింటి కలను సాకారం

నిలువ నీడ లేని నిరుపేదవారి సొంతింటి కలను సాకారం చేయలనే సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి గృహలక్ష్మి పథకానికి శ్రీకారం చుట్టారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. గురువారం ఖమ్మం నగరం భక్తరామదాసు కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి 223 మంది లబ్ధిదారులకు నగరంలోని 17, 18, 24, 42, 43, 46, 49, 50, 52, 53, 55, 56 డివిజన్లలో మంజూరైన గృహలక్ష్మి పథకం మంజూరు ఉత్తర్వుల పత్రాలను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గృహలక్ష్మి పథకం కింద స్వంత స్థలం కలిగి ఇళ్లు నిర్మించుకునేందుకు జిల్లాలో 15,500 మందికి లబ్ధి చేకూరనుందని, నియోజకవర్గానికి 3 వేల మందిని ఎంపిక చేయడం జరిగిందని, ఖమ్మం నియోజకవర్గానికి అదనంగా మరో వెయ్యి మంది లబ్ధిదారులకు లబ్ధి చేకూర్చడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, సుడా ఛైర్మన్ విజయ్‌కుమార్, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, డిప్యూటీ కమిషనర్ మల్లీశ్వరీ, కార్పొరేటర్ రాపర్తి శరత్, బుర్రి వెంకట్ కుమార్, పగడాల శ్రీవిద్య నాగరాజు, మోతారపు శ్రావణి, పైడిపల్లి రోహిణి సత్యనారాయణ, ధనాల రాధ, మందడపు లక్ష్మీ మనోహర్, కమర్తపు మురళీ, పాకాలపాటి విజయ నిర్మల శేషగిరి రావు, కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ, దండా జ్యోతి రెడ్డి, మక్బూల్ తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి పథకానికి పేదలను అనర్హులను ఎలా చేస్తారు?

ఎమ్మెల్యేకి మహిళల వినతి

నవతెలంగాణ-వైరా



నిరుపేదలమైన తమను ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గృహలక్ష్మి పథకానికి అనర్హులను చేసిన అధికారుల చర్యలను విప్పలమడక దళిత, బిసి కుటుంబాలకు చెందిన మహిళలు సిపిఎం ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే లావుడియ రాములు నాయక్‌కు వినతిపత్రం ద్వారా తెలిపారు. గృహలక్ష్మి పథకానికి గ్రామంలో మొత్తం 64 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 24 మంది దరఖాస్తులను మాత్రమే ఆమోదించిన రెవెన్యూ అధికారులు గ్రామ పంచాయతీ కార్యదర్శి ద్వారా ఆన్‌లైన్ చేయించారు. ఇంకా 40 మంది దరఖాస్తులను ఆన్‌లైన్ చేయవద్దని గ్రామ పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. విషయం తెలుసుకున్న సీపీఎం గ్రామ శాఖ పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరింది. ఆన్ లైన్ చేయని దరఖాస్తు దారులకు సంబంధించిన స్థలాలు, పూరిళ్లు గత 60 సంవత్సరాల క్రితం ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ళ స్థలాలే కాబట్టి ప్రభుత్వం ద్వారా వారికి మరోసారి లబ్ధి చేకూర్చ వద్దని రెవెన్యూ అధికారులు ఆదేశించినట్లు తెలిపారు. సీపీఎం గ్రామ శాఖ తాహసీల్దార్ శ్రీనివాసరావును ప్రశ్నించగా ఇళ్ళ స్థలాలు 60 సంవత్సరాల నుండి ఒకే కుటుంబం నుండి వారి అనుభవంలో ఉంటే వారి వారసులు అర్హులేనని అన్నారు. కాని ఆన్ లైన్ చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించలేదు. ఈ కారణంగా పేదల ఇళ్ళ స్థలాలు ఆన్ లైన్ కాలేదు. ఆన్‌లైన్ అయిన స్థలాలు, పూరిళ్లు ఉన్న వారే గృహలక్ష్మి పథకానికి అర్హులను చేస్తూ లిస్టు పంపారు. ఆన్‌లైన్ చేయని స్థలాల పేదలు గురువారం వైరారూరల్ మండల గ్రామాల పర్యటనలో భాగంగా విప్పలమడక వచ్చిన ఎమ్మెల్యే ఎల్ రాములు నాయక్‌కు తమ ఇళ్ళ స్థలాలను వెంటనే ఆన్‌లైన్ చేసి గృహలక్ష్మి పథకంలో ఇళ్లు మంజూరు చేయాలని మహిళలు వినతిపత్రం అందజేశారు. ఇప్పటి వరకు ఈ విషయాన్ని తన దృష్టికి ఎందుకు తీసుకు రాలేదని, పేదలను పథకానికి అనర్హులను చేసే అధికారం అధికారులకు ఎవరిచ్చారని కార్యదర్శిని ప్రశ్నించారు. కార్యక్రమంలో సర్పంచ్ తుమ్మల జాన్ పాపయ్య, మాజీ సర్పంచ్ పారుపల్లి కృష్ణారావు, ఉప సర్పంచ్ ఎదుల్ల కృష్ణకుమారి, ముత్తమాల ప్రమీల, బూరుగు పుష్పలత, ముత్త మాల నాగజ్యోతి, బూరుగు కల్యాణి, నాగరత్నం, తదితరులు పాల్గొన్నారు.

మంచి నీటి ట్యాంకుల వరకు సిసి రోడ్డు నిర్మించండి

ఎమ్మెల్యేని కోరిన ప్రజలు

విప్పలమడక గ్రామంలోని మంచినీటి ట్యాంకుల వరకు సిసి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విప్పలమడక, లింగన్న పాలెం గ్రామాల ప్రజలు ఆయా గ్రామాల సర్పంచ్‌లతో కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రామంలో సిసి రోడ్ల ప్రారంభం, మరో రెండు రోడ్లకు శంకుస్థాపన చేయుటకు విప్పలమడక వచ్చిన వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే ఎల్ రాములు నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. విప్పలమడక మంచి నీటి స్కీమ్ ఆ గ్రామంతో పాటు నారపనేని పల్లి, లింగన్నపాలెం గ్రామాలకు మంచినీరు అందిస్తున్నది. ఆర్అండ్‌బి రోడ్డు నుండి సుమారు 60 మీటర్ల దూరంలో ఉన్న ట్యాంకుల వరకు వెళ్లేందుకు మహిళలు, వృద్ధులు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విప్పలమడక మాజీ సర్పంచ్ పారుపల్లి కృష్ణారావు ఎమ్మెల్యేకి వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయుటకు అంగీకారం తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ తుమ్మల జాన్ పాపయ్య, ఎంపీటీసీ బూరుగు సంజీవరావు, లింగన్నపాలెం సర్పంచ్ భర్త కొరకొప్పు నాగార్జున, సొసైటీ డైరెక్టర్ దేవభక్తిని అర్జునరావు, కొలికొండ వీరభద్రరావు, దేవభక్తిని చిన్న సాంబయ్య, కోపెల ఆంతోని గరిడేపల్లి సుబ్బారావు, మురళీ తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ కాంగ్రెస్ నేతలకు అవకాశం ఇవ్వాలి

నవతెలంగాణ-కారేపల్లి

కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థిత్వాలలో కిసాన్ కాంగ్రెస్ నేతలకు అవకాశం కల్పించాలని ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీఎల్పీ లీడర్ మల్లు భట్టివిక్రమార్క, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిలను గురువారం కిసాన్ కాంగ్రెస్ సెల్ రాష్ట్ర, జిల్లా సభ్యులు కలిసి విన్నవించినట్లు టీపీసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షులు బానోత్ బాలాజీనాయక్ తెలిపారు. కిసాన్ కాంగ్రెస్ తరుపున రాష్ట్ర వ్యాప్తంగా కనీసం 5 సీట్లు ఇప్పించాలని వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. తమ విన్నపాన్ని అధిష్టానం దృష్టికి తీసుకవెళ్ళనున్నట్లు వారు తెలిపారన్నారు.

ధ్వజ స్తంభం ఏర్పాటుకు ఎంపీ రవిచంద్ర హామీ

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లిలోని సంత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ధ్వజ స్తంభం ఏర్పాటుకు రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర హామి ఇచ్చినట్లు సంత ఆలయ చైర్మన్ అడ్డగోడ ఐలయ్య తెలిపారు. గురువారం ఖమ్మంలో ఆలయ పాలక కమిటీ ఎంపీని కలిసింది. ఆలయంలో ధ్వజస్తంబం శిధిలావస్థకు చేరిందని దాని పునర్‌స్థాపనకు సహకరించాలని కోరిన తక్షణమే రూ.2లక్షలు ఇస్తానని హామీ ఇచ్చినట్లు ఆలయ చైర్మన్ ఐలయ్య తెలిపారు. ఎంపీ రవిచంద్రకు ఆలయ కమిటీ కృతజ్ఞతలు తెలిపింది.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ-తల్లాడ

మండలంలో పలు అభివృద్ధి పనులకు సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య గురువారం శంకుస్థాపన చేశారు. మంగాపురం గ్రామంలో బీసీ కమ్యూనిటీ హాల్, మంగాపురం నుండి నారాయణపురం బీటీ రోడ్డు, గొల్లగూడెం గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్, తల్లాడ కేతినేని థియేటర్ నుండి అన్నారుగూడెం బీటీ రోడ్డు, నారాయణపురం నుండి కొడవటిమెట్ట బిటి రోడ్డు, అంజనాపురం నుండి ముచ్చాడూరు బిటి రోడ్డు, నూతనకల్ నుండి లోకవరం బీటీ రోడ్డుకు, ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు, నూతనకల్ నుండి వెంకన్నపేట వంతెనకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ డి.శ్రీనివాసరావు, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు డి.వెంకట్ లాలు, సొసైటీ చైర్మన్ ఆర్ వీరమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధరావత్ కమల్ నాయక్ మృతికి సంతాపం

నవతెలంగాణ - ఖమ్మంకార్పొరేషన్

రోడ్డు ప్రమాదంలో గాయపడి హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మతి చెందిన ధరావత్ కమల్ నాయక్ మృతదేహాన్ని తుంబూరు దయాకర్ రెడ్డి ఖమ్మంనగరంలోని మామిళ్ళగూడెం వెళ్లి సందర్శించారు. అనంతరం దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ..చిన్న వయస్సులోనే మృత్యువు కబలించటం చాలా బాధాకరమని విచారం వ్యక్తం చేస్తూ. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

విమలమ్మ మృతికి మంత్రి పువ్వాడ సంతాపం

నవతెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ స్నేహితుడు దండి ప్రేమ్ కుమార్ తల్లి దండి విమలమ్మ(78) ఆమె మృతి పట్ల మంత్రి పువ్వాడ సంతాపం వ్యక్తం చేశారు. గురువారం ఖమ్మం నగరంలోని మామిళ్లగుడెంలో తన స్నేహితుడు దండి ప్రేమ్ కుమార్ నివాసంకు వెళ్లి ఆమె భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అంతరం మంత్రి పువ్వాడ విమలమ్మ భర్త కోటయ్య, కుమారులు ప్రేమ్ కుమార్, శ్యాం కుమార్, ఇతర కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు.

ఏఐటీయూసీ జాతీయ కౌన్సిల్ సభ్యులుగా క్లైమెంట్

నవతెలంగాణ- ఖమ్మం



ఈనెల 25, 26, 27 తేదీలలో తమిళనాడు రాష్ట్రంలోని తిరువల్లూరులో జరిగిన ఏఐటీయూసీ జాతీయ కౌన్సిల్ సమావేశాలలో తెలంగాణ రాష్ట్రం నుండి మరొకరికి చోటు లభించింది. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కొనసాగుతున్న ఖమ్మం జిల్లాకు చెందిన బిజి క్లెమెంట్‌ను జాతీయ కౌన్సిల్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అయన ఎన్నిక పట్ల రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు సహాయ కార్యదర్శులు హర్షం వ్యక్తం చేశారు.

అంగన్వాడీ సమస్యలు పరిష్కరించేంత వరకూ పోరాడుతాం : సీఐటీయూ

నవతెలంగాణ-మధిర



రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా 18వ రోజు అంగన్‌వాడీలు మధిరలో వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తుమ్మ విష్ణువర్ధన్, కళ్యాణం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అంగన్వాడి ఉద్యోగులు ఎన్నో సంవత్సరాల నుండి పనిచేస్తున్నారని అయినా వారికి ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించలేదని, కనీస వేతన చట్టం అమలు పరచడం లేదని, అదనపు పనికి వేతనం ఇవ్వటం లేదని పేర్కొన్నారు. అంగన్వాడి ఉద్యోగులను ఆయాలను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని, అదనపు, పనికి అదనపు వేతనం ఇవ్వాలని, రాజకీయ ఒత్తిడిలను నివారించాలని, పని భారాన్ని తగ్గించాలన్నారు. తక్షణమే అంగన్వాడీ సమస్యలు పరిష్కరించకపోతే ప్రభుత్వం పని పడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు శీలం నరసింహారావు సిఐటియు మధిర మండల కన్వీనర్ పడకండి మురళి, వడ్రానపు మధు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లానాయకులు తేలప్రోలు రాధాకృష్ణ, రైతు సంఘం జిల్లా నాయకులు రామ నరసయ్య, అంగన్వాడీ టీచర్స్, మినీ వర్కర్స్ ఆయాలు తదితరులు పాల్గొన్నారు..

అంగన్వాడి టీచర్ల మానవహారం

వేంసూరు : తమ సమస్యల పరిష్కారం కోసం 18 రోజులుగా సమ్మెకు దిగిన అంగన్వాడి టీచర్లు గురువారం తాసిల్దార్ కార్యాలయం నుండి సిఐటియు ఆధ్వర్యంలో మర్లపాడు వరకు ప్రదర్శన నిర్వహించి రింగ్ సెంటర్ నందు మానవహారం నిర్వహించారు. అనంతరం శిబిరం వద్ద నిరసన తెలిపారు ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర నాయకులు చలమాల విత్రావు మాట్లాడుతూ అంగన్వాడి టీచర్లులను ప్రభుత్వం ఉద్యోగులుగా గుర్తించి న్యాయమైన సమస్యలను పరిష్కరించేంతవరకు సిఐటియు అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మల్లూరు చంద్రశేఖర్, సర్వేశ్వరరావు, అరవపల్లి జగన్మోహన్‌రావు, సిఐటియు అనుబంధ సంఘాల నాయకులు అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

ఖమ్మంకార్పొరేషన్ : ఖమ్మంనగరంలో గత 18 రోజులుగా అంగన్వాడి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఖమ్మంఅర్బన్ ఎమ్మార్వో ఆఫీస్ ముందు అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకి గురువారం సిఐటియు ఖమ్మం త్రీ టౌన్ కమిటీ నాయకులు సంపూర్ణ మద్దతు తెలిపారు. అనంతరం ఖమ్మం అర్బన్ ఎమ్మార్వో ఆఫీస్ ముందు అంగన్వాడీలు చేస్తున్న ధర్నా కార్యక్రమంలో సిఐటియు త్రీ టౌన్ కన్వీనర్ యర్రా మల్లికార్జున్ మాట్లాడుతూ.. గత 18 రోజులుగా అంగన్వాడీలు రాష్ట్ర మొత్తం సమ్మె చేస్తున్న కూడా కనీసం ప్రభుత్వం ఒక్కసారి కూడా వారి చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సిఐటియు త్రీ టౌన్ నాయకులు బుగ్గ శ్రీశైలం, కృష్ణ, వెంకటేశ్వర్లు, యర్రా రంజిత్, తదితరులు పాల్గొన్నారు.



గణనాథులకు వీడ్కోలు

నవతెలంగాణ- కొత్తగూడెం

వినాయక చవితి సందర్భంగా గత 9 రోజులుగా మంటపల్లిలో కొలువుదీరి పూజలు అందుకున్న గణనాథులు గురువారం నిమజ్జనానికి భద్రాచలం గోదావరి నదికి తరలించారు. కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో నిమజ్జన ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల స్వాగత ద్వారాల వద్దకు కొత్తగూడెం పట్టణ పరిసర ప్రాంత ఏరియాలలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాలు చేరాయి. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వీడ్కోలు పలికారు. కొత్తగూడెం ప్రధాన రహదారి వెంట వందలాది విగ్రహాలు ఒకదాని వెంట మరొకటి భారీ వాహనాల్లో తరలించారు. డప్పు వాయిద్యాలు, సౌండ్ సిస్టం, బాణాసంచా కాల్చుతూ యువత ఊరేగింపులో పాల్గొన్నారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ట్రాఫిక్ నియంత్రణ నిర్వహించారు. స్థానిక పోస్ట్ ఆఫీస్ సెంటర్ నుండి ప్రకాశం స్టేడియం, బస్టాండ్ సెంటర్, సూపర్ బజార్, గణేష్ టెంపుల్, మొర్రేడు బ్రిడ్జి, పాల కేంద్రం మీదుగా గణనాథులతో బయలుదేరిన వాహనాలు భద్రాచలం వైపు వెళ్లాలి. కొత్తగూడెం రైల్వే ప్రాంగణంలో విశ్వహిందూ పరిషత్ ఏర్పాటు చేసిన వేదిక వద్ద కొత్తగూడం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వర రావు,మాజీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఉత్సవ కమిటీ నాయకులు రంగా కిరణ్, కంచర్ల చంద్రశేఖర రావు, ధారా రమేష్, వందనపు రమేష్, ఎర్ర కామేష్, కొత్తగూడెం డిఎస్పి రెహమాన్ తదితరులు పాల్గొని, నిమజ్జనానికి వెళ్లే వారికి సూచనలు, సలహాలు చేశారు. అభినందనలు తెలిపారు. నిమజ్జన సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్ వారికి సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

చంద్రుగొండ : చంద్రుగొండ సాయి బాబా ఆలయం, మహాలక్ష్మి అమ్మవారి ఆలయం, ఎదురుగా ఏర్పాటు చేసిన గణేష్ నవరాత్రుల్లో బాగంగా గురువారం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం గ్రామంలో నవరాత్రులు పూజలు అందుకున్న గణేశులను శోభాయాత్ర అన్ని వీధుల్లో చేశారు. స్థానిక జంట కుంట చెరువులో నిమజ్జనం చేశారు.

అంగన్వాడీ ఉద్యోగులపై ప్రభుత్వాలది కపట ప్రేమ

నవతెలంగాణ - ఆళ్ళపల్లి

అంగన్వాడీ ఉద్యోగులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలది కపట ప్రేమఅని, ఇప్పటికైనా కండ్లు తెరచి మా న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆ సంఘం మండల అధ్యక్షురాలు పూనెం సుజాత ప్రభుత్వాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీ ఉద్యోగులు ఆట-పాటలతో 18వ రోజు నిరవధిక సమ్మె కొనసాగించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు కరకపల్లి మమత, కొమరం జయశ్రీ, మెస్సు రాజ్యలక్ష్మి, చందా సరిత, ఈసం లక్ష్మి, కోరం మల్లుబాయి, ఈసం బాయమ్మ, కళావతి, విమల, సుజాత, తాటి రత్తమ్మ, కొమరం మల్లీశ్వరి, ఈసం పద్మ, గలిగ రాధాబాయి, భారతి, భద్రమ్మ, సుమలత, తదితరులు పాల్గొన్నారు.



గృహలక్ష్మి పథకాన్ని అర్హులకు అందజేయాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల

నవతెలంగాణ-దుమ్ముగూడెం

అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కుటుంబాలకు గృహలక్ష్మి పథకాన్ని వర్తింపజేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మండలంలోని సింగారం గ్రామంలోని కొడిమీ వారి గుంపులో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దుమ్ముగూడెం మండలంలో అర్హులైన పేదలందరికీ గృహలక్ష్మి పథకం ద్వారా ఇండ్లు మంజూరు చేయాలని, ఎస్సీలకు దళిత బంధు పథకాన్ని ఇవ్వాలని ఇవ్వాలని డిమాండ్ చేశారు. గృహలక్ష్మి పథకం ప్రకటన చేసిన మూడు రోజులు మాత్రమే గడువు ఇస్తే.. ప్రజలు నానా ఇబ్బందులు పడి పథకానికి దరఖాస్తు చేసుకున్నారని కానీ ఇంత వరకు పథకం ఊసే లేదన్నారు. గృహలక్ష్మీతో పాటు ఇతర ప్రభుత్వ పథకాల అమలుపై తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున దుమ్ముగూడెం తహశీల్దార్ కార్యాలయం వద్ద అక్టోబర్ 03న ధర్నా నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బిల్లా, ముత్యాలరావు, పాయం అశోక్, కొడిమి సురేష్, కొడిమి లక్ష్మి, నాగరాజు, కల్లూరి రామకృష్ణ, కోడిమి నరసింహారావు. పూస రామ్మూర్తి, కొడిమి సమ్మక్క, పూస ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

స్వామినాథన్ మరణం
వ్యవసాయ రంగానికి తీరని లోటు

- రైతు సంఘం జిల్లా నాయకులు అన్నవరపు సత్యనారాయణ

నవతెలంగాణ- కొత్తగూడెం

వ్యవసాయ రంగంలో విప్లవంతంగా మార్పులు తీసుకొచ్చి, అధిక దిగుబడినిచ్చే గోధుమలు, వరి రకాలను అభివృద్ధి చేయడంలో, ప్రచారం చేయడంలో ఎంఎస్. స్వామినాథన్ కీలక పాత్ర పోషించారని రైతు సంఘం జిల్లా నాయకులు అన్నవరపు సత్యనారాయణ అన్నారు. ఆయన మరణం వ్యవసాయ రంగానికి, దేశానికి తీరని లోటు అన్నారు. ఆయన వ్యవసాయ రంగానికి చేసిన సేవలకు గాను గుర్తింపుగా 1987లో స్థాపించబడిన ప్రపంచ ఆహార బహుమతికి మొదటి గ్రహీత అని అన్నారు. 1988లో ఎంఎస్. స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌ను స్థాపించాడని గుర్తు చేశారు. 2004 లో రైతులపై జాతీయ కమీషన్ అధ్యక్షుడిగా స్వామినాథన్ కనీస మద్దతు ధరను అందించాలని సిఫార్సు చేశారని గుర్తు చేశారు. ఉత్పత్తి సమగ్ర వ్యయం 50 శాతానికి సమానంగా ఉండాలని చెప్పారు. చారిత్రాత్మకమైన రైతుల పోరాటంలో ఇది ముఖ్యమైన డిమాండ్‌గా మిగిలి పోయిందన్నారు. మోడీ ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ ఇది ఇంకా అమలు కాలేదని సత్యనారాయణ అన్నారు. జిల్లా రైతు సంఘం జిల్లా కమిటీ స్వామినాథన్ కుటుంబ సభ్యులకు, అభిమానులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తోందన్నారు.



మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్

నవతెలంగాణ-పాల్వంచ

మధ్యాహ్న భోజన కార్మికులకు జీఓ నెంబర్ 8 ప్రకారం పెంచిన వేతనాలు ఏరియర్స్ తో చెల్లించాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గురువారం కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద 9వ రోజుకు చేరుకున్న మధ్యాహ్న భోజన భోజన కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సలహాదారు గంధం, పాల్వంచ పట్టణ అధ్యక్షుడు కోళ్ళపూడి ప్రవీణ్ కుమార్,సతేనపల్లి విజయలక్ష్మి, దాసుల పుష్ప, బాధిలా మంగలి తదితరులు పాల్గొన్నారు

మధ్యాహ్న భోజన కార్మికుల నిరవధిక సమ్మె ప్రారంభం

నవతెలంగాణ-ఇల్లందు

మధ్యాహ్న భోజన పథకం కార్మిక యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం నిరవధిక సమ్మెను సీఐటీయూ జిల్లా నాయకులు అబ్దుల్ నబి, ఈసం వెంకటమ్మ, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుల్తానా లు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన జీతం ఏరియర్స్‌తో పాటు చెల్లించాలని, గ్యాస్ డబుల్ సిలిండర్ ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, రిటైర్ మెంట్ బెనిఫిట్ పెన్షన్ సౌకర్యం కల్పించాలని మెనూ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో కుమారి, యాదమ్మ, జయా, రాములమ్మ లక్ష్మీ, సుచిత్ర, పద్మ, మానస, పద్మ,



సమ్మక్క టి పద్మ, రాధ, సలోమి, రాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి పతనం తప్పదు

పండుగల వేల మహిళా వర్కర్లను శిబిరాలకే పరిమితం చేస్తారా....?

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

నవతెలంగాణ-కొత్తగూడెం

ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న స్కీం వర్కర్లను నిర్లక్ష్యం చేస్తే కేసీఆర్ ప్రభుత్వానికి పతనం తప్పదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పట్టణంలోని బస్టాండ్ సెంటర్, చిల్డ్రన్ పార్కు ఎదుట సీఐటీయూ అనుబంధ అంగన్వాడీ వర్కర్లు, ఆశా కార్యకర్తలు చేపట్టిన నిరసన శిబిరాన్ని కూనంనేని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడారు. కేసీఆర్ పాలనలో ఏ ఒక్క ఉద్యోగి సంతోషంగా లేరని, వారి న్యాయమైన డిమాండ్లు, సమస్యలు పరిష్కరించకుండా ఏండ్ల తరబడి ప్రభుత్వం ఊడిగం చేయించుకుంటుందని విమర్శించారు. కనీస వేతనాలు, చట్టబద్ధ హక్కుల అమలుకోసం, ముఖ్య మంత్రి హామీ నెరవేర్చాలని అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు సమ్మె చేస్తుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్లైనా లేదన్నారు. కనీసం చర్చలకు పిలిచి వారి సమస్యలు తెలుసుకోవాలన్న కనీస జ్ఞానం కేసీఆర్‌కు లేకపోవడం బాధాకరమన్నారు. ఇందుకోసమేనా స్వరాష్ట్రాన్ని సాధించుకున్నదని ప్రశ్నించారు...? పండుగలవేళ మహిళా వర్కర్లు కుటుంబాలను వదిలి రోడ్లపై ఆందోళనలు చేయాల్సిన దుస్థితికి తీసుకొచ్చారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి న్యాయమైన సమస్యలు, డిమాండ్లు పరిష్కరించడం ద్వారా సమ్మెలను నివారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గుత్తుల సత్యనారాయణ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వై.శ్రీనివాసరెడ్డి, సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి డి.వీరన్న, అంగన్వాడీ, ఆశా విభాగాల సిబ్బంది కళావతి, పద్మావతి, శైలజ, జయ, లక్ష్మి, మనీలా తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వం స్పందించకపోవడం వల్లే సమ్మె

అశ్వారావుపేట : రాష్ట్రంలో కార్మికుల సమస్యలు పరిష్కారం కానందువల్లే పలు రంగాలకు సంబంధించిన కార్మికులు సమ్మెబాట పట్టారని కార్మికుల సమస్యలు పరిష్కారం చూపకుండా సమ్మెను అణిచి వేయడానికి ప్రభుత్వం చూస్తుందని సిఐటియు జిల్లా కార్యదర్శి ఏ.జే రమేష్ అన్నారు. గురువారం అంగన్వాడీలు నిర్వహిస్తున్న సమ్మె 18వ రోజుకు చేరింది. సమ్మె శిబిరాన్ని సందర్శించి ఆయన మాట్లాడుతూ బంగారు తెలంగాణ కార్మికుల బాధల తెలంగాణగా మారిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్, నరసింహారావు, రాధ, ఉషా, నాగమణి, కృష్ణ వేణి,విజయ,రమణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం : అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగుల గుర్తించాలని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జి పద్మ డిమాండ్ చేశారు. అంగన్వాడీలు చేపట్టిన 18వ రోజు సమ్మె శిబిరాన్ని ఆమె సందర్శించి మాట్లాడారు. 18 రోజులుగా కొనసాగుతున్న అంగన్వాడి సమ్మెకు సీసీఐ(ఎం) మండల కన్వీనర్ నియోజకవర్గ కో కన్వీనర్ కారం పుల్లయ్య సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అంగన్వాడీ నాయకులు కృష్ణవేణి, గజలక్ష్మి, బుచ్చమ్మ, పాల్గొన్నారు.

ఇల్లందు : అంగన్‌వాడీల సమ్మెలో బాగంగా గురువారం వంటా వార్పు దూం ధాం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు అబ్దుల్ నబి, జిల్లా అధ్యక్షులు ఈసం వెంకటమ్మ మరియు, ఫాతిమా దేవేంద్ర, ఏఐటియూసి మమత, నాగలక్ష్మి, వసంత, దీప్తి, కారం పద్మ, వనజ, అంజమ్మ, శోభ రాణి, తదితరు పాల్గొన్నారు.



భారీ వర్షంలో ఆశా వర్కర్ల సమ్మె

నవతెలంగాణ-ఇల్లందు

పట్టణంలో గురువారం భారీ వర్షం కురిసింది. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా 4వ రోజు సమ్మెను ఆశా వర్కర్లు సక్సెస్ చేశారు. జోరు వానలో టెంట్ వేసుకొని నిరవదిక సమ్మెలో పాల్గన్నారు. సమ్మె శిబిరాన్ని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమస్యల పట్ల ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వుంటున్నదన్నారు. ఈ కార్యక్రమంలో మన్యం మోహన్ రావు, జీ ఉమాదేవి, సునిత, చీమల రమణ, చంద్రకళ, విజయ,మల్లేశ్వరి లక్ష్మి కరుణ అరుణ స్వప్న రాధ చుంచు విజయ తదితరులు పాల్గొన్నారు.

పర్ణశాల రామయ్యను దర్శించుకున్న ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మెన్

నవతెలంగాణ-దుమ్ముగూడెం

ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల రామయ్యను ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మెన్ కొమ్మినేని శ్రీనివాసరావు గురువారం కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది ఆయనకు ఆలయ మర్యాదల ప్రకారం స్వాగతం పలికి గర్భలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీతా కుటీర ప్రదేశంతో పాటు నార చీరల ప్రాంతాలను సందర్శించి పర్ణశాల విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తాసీల్దార్ పి.చంద్రశేఖర్, ఆర్ఐలు ఆదినారాయణ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలే ఆధునిక దేవాలయాలు : వనమా

- మున్సిపల్ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన

నవతెలంగాణ-కొత్తగూడెం

ప్రభుత్వ పాఠశాలలే ఆధునిక దేవాలయాలు అని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం మునిపల్ పరిధిలోని పలు వార్డుల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. తొలుత 35 వార్డులో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభం చేశారు. కూలీ లైన్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో వనమా మాట్లాడుతూ కొత్తగూడెం కూలీలైన్ ప్రభుత్వ కూలి లైన్ పాఠశాలకు రూ.15 లక్షలతో నిర్మించనున్న పహరీకి ప్రారంభించడం ఆనందంగా ఉందని తెలిపారు. కూలీలైన్ ప్రాంతంలోని సూర్య ప్యాలెస్ ఎదురుగా ఉన్నస్థలంలో రూ.2 కోట్ల నిధులలో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ శంకుస్థాపన చేసినట్లు, దీని ద్వారా వ్యాపారులకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. సఖి బిల్డింగ్ కాంపౌండ్ వాల్‌ను కూడా అధికారులు వెంటనే పూర్తి చేయాలన్నారు. కూలీలైన్ పాఠశాలను మరింత అభివృద్ధి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలే ఆధునిక దేవాలాయాలు అని తెలిపారు. పేద విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తూ కార్పొరేట్ పాఠశాల ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నా దేశంలోనే ఏకైక రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమని వనమా తెలిపారు. నా తుది శ్వాస వరకు ప్రజల కోసమే ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తానని వనమా తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ కాపు సీతాలక్ష్మి, స్థానిక కౌన్సిలర్ రుక్మాంగాధర్ బండారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కళ్యాణ్ శర్మ, రమాదేవి, అరుణ, ఊహ, రజనీకాంత్ బండారి, పంది రాజు, పవన్, బాచి, కాళీ, నరసింహ, కుమార్ మోహన్, ఆర్పీ రాజ్యలక్ష్మి, రూప బండారి, సృజన, రేణుక, శ్రీదేవి, సుచరిత, వార్డ్ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.





భగత్ సింగ్ పోరాట
వారసత్వాన్ని అందిపుచ్చుకోవాలి

- నేడు దేశం ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడాలి
- మతోన్మాద రాజకీయాలను సమూలంగా నాశనం చేయడమే భగత్ సింగ్ కు ఇచ్చే నివాళి
- సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి

నవతెలంగాణ - భద్రాచలం

దేశ స్వాతంత్రం కోసం చిరుప్రాయంలోనే ఉరికంభం ఎక్కిన త్యాగదనడు విప్లవ వీరుడు భగత్ సింగ్ పోరాట వారసత్వాన్ని అందిపుచ్చుకోవాలని, నేడు దేశం ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం సాగించాలని, మతోన్మాద రాజకీయాలను కూకటి వేళ్ళతో సమూలంగా నాశనం చేయాలని అదే భగత్ సింగ్ కు మనం ఇచ్చే ఘన నివాళి అని సిపిఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అన్నారు. సర్దార్ భగత్ సింగ్ 116వ జయంతి సందర్భంగా పట్టణం పాత మార్కెట్ సెంటర్ నందు భగత్ సింగ్ విగ్రహానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు బి వెంకటరెడ్డి పూలమాల లు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో గడ్డం స్వామి మాట్లాడుతూ దేశానికి రాజకీయ స్వాతంత్రం సాధించడమే కాకుండా, ఆర్థిక స్వతంత్రం కూడా సిద్ధించాలని, సామాన్యుడి సంక్షేమం సహకారం కావాలంటే సోషలిజం పంథాను అనుసరించాలనే సమగ్ర రాజకీయ దృక్పథంతో ఉద్యమించిన నాయకుడు భగత్ సింగ్ అని అన్నారు. మతాన్ని రాజకీయాల నుండి దూరంగా ఉంచాలని, ప్రజల్లో మతసామరస్యం పెంపొందించాలని, శ్రామిక వర్గం చైతన్యంతోనే ప్రజల ఐక్యత సాధ్యమని నినదించిన వీరుడు సర్దార్ భగత్ సింగ్ అని అన్నారు. మతం పేరుతో రాజకీయాలు నడిపే సంఘాలు పార్టీలు నేడు భగత్ సింగ్ మావాడు అని చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు. వలసవాదంలాగే మతతత్వం సైతం ప్రజలకు పెద్ద శత్రువు అని నినదించిన నాయకుడు సర్దార్ భగత్ సింగ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కమిటీ సభ్యులు యు జ్యోతి, జి. లక్ష్మీకాంత్, ఎన్ నాగరాజు, పార్టీ నాయకులు కె సత్య, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇరువురికి తీవ్ర గాయాలు



నవతెలంగాణ-ఆళ్ళపల్లి

ఆళ్ళపల్లి మండలంలో గురువారం రెండు వేర్వేరు ప్రాంతాలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని తిర్లాపురం గ్రామానికి చెందిన కుంజ నరేష్ చేను పని నిమిత్తం గురువారం కాచనపల్లి వైపుగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. అదే సమయంలో కాచనపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ రఫీ అశోక్ లేల్యాండ్ (బొలెరో) వాహనం నడుపుకుంటూ ఆళ్ళపల్లి వైపుగా వస్తున్నాడు. ఈ క్రమంలో అనంతోగు బ్రిడ్జికి సుమారు కిలోమీటరు దగ్గరలో అశోక్ లేల్యాండ్ వాహనం కుడి పక్క భాగంలో ద్విచక్ర వాహనంను ఢీకొంది. దాంతో క్షతగాత్రుడిని అదే అశోక్ లేల్యాండ్ వాహనంలో ఆళ్ళపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. అక్కడ వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి 108 వాహనంలో నరేష్ ను తీసుకెళ్లారు. తలకు, కుడి మోకాలుకు తీవ్ర గాయాలు పరీక్షించి, అతని పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి వైద్యులు నుంచి ఖమ్మం రిఫర్ చేశారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఇదిలా ఉంటే మండల పరిధిలోని కర్ణగూడెం గ్రామానికి చెందిన బూడిద కోరం రామలత అదే గ్రామానికి చెందిన సాయి అనే యువకుడి ద్విచక్ర వాహనంపై అనంతోగు గ్రామానికి వెళ్తుండగా మార్గం మధ్యంలో మ్యాజిక్ ను తప్పించబోగా అదే సమయంలో హఠాత్తుగా కుక్క అడ్డొచ్చింది. దాంతో వెనుక కూర్చున్న రామలత కుడి కాలు మ్యాజిక్ ను ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. దాంతో ఆమెను మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. ఈ ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

గాన గాంధర్వుడు ఎస్‌పీ బాలసుబ్రమణ్యం వర్ధంతి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం పట్టణంలో రాజ వీధి జీయర్ మఠం నందు పద్మవిభూషణ్ స్వర్గీయ ఎస్‌పి. బాలు వర్ధంతి సందర్భంగా భద్రాద్రి మెలోడీ సింగర్స్ గ్రూప్ ఆధ్వర్యంలో స్వర రాగ తరంగిణి కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ప్రముఖులు, పాకాల దుర్గా ప్రసాద్, లయన్ డా.గోళ్ళ భూపతి రావు, చిట్టి లలిత,. భూషణ్ రావు, సోపాక సీత, తిరుమల రావు, నిర్వాహకులు జె.ఆర్. మూర్తి, కె. నాగమణి, జె.నాగలక్ష్మి పాల్గొన్నారు.

డిమాండ్లను పరిష్కరిస్తేనే సమ్మె విరమణ

నవతెలంగాణ - ఆళ్ళపల్లి

మా న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరిస్తేనే నిరవధిక సమ్మెను విరమిస్తాని స్థానిక ఆశా వర్కర్ల యూనియన్ మండల అధ్యక్షురాలు సడియం సుగుణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట 4వ రోజు చెవిలో పువ్వు పెట్టుకుని నిరవధిక సమ్మెను చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు పూసం చంద్రకళ, పి. సీతాదేవి, వై.కృష్ణకుమారి, జోగ సుశీల, కె.అనసూర్య, పి.సత్యవతి, కావేరి, పెండకట్ల సునీత, లక్ష్మీకాంత, జి.బుచ్చమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే అసంఘటిత కార్మికుల హక్కుల సాధన



- సీఐటియు జిల్లా కార్యదర్శి ఏ.జే రమేష్

నవతెలంగాణ-అశ్వారావుపేట

సంఘటిత పోరాటాలు,ఐక్య కార్యాచరణ కార్యక్రమాలతోనే అసంఘటిత కార్మికుల హక్కులు సాధన సాధ్యం అవుతుందని సిఐటియు జిల్లా కార్యదర్శి ఏ.జే రమేష్ పిలుపునిచ్చారు. మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన వేతనాలు చెల్లింపుకు బడ్జెట్ విడుదల చేయాలని, కొత్త మెనూ కు బడ్జెట్ కేటాయించాలని,పెండింగ్ బిల్లులు తక్షణం విడుదల చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఏ.జే రమేష్ డిమాండ్ చేశారు. గురువారం మండల పరిషత్ పూర్వ కార్యాలయం ప్రాంగణంలో చేపట్టిన మధ్యాహ్న భోజన కార్మికులు నిరవధిక సమ్మెను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరగిన సభలో రమేష్ మాట్లాడుతూ 2022 మార్చి 15 న ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ప్రస్తుతం పొందుతున్న వేతనం పై అదనంగా రూ.2 వేలు పెంచుతున్నట్లు ప్రకటించారు అని,యూనియన్ ఆధ్వర్యంలో చేసిన సుదీర్ఘ పోరాటాల ఫలితంగా జీఓ ఎంఎస్ నెం. 89 విడుదల చేసింది. కానీ కార్మికులు పెరిగిన జీతం ఇంతవరకు ఇవ్వలేదు అన్నారు. పెండింగ్ బిల్లులు కూడా విడుదల కావడం లేదన్నారు. కార్మికులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో పెరిగిన వేతనాలకు బడ్జెట్ కేటాయించి చెల్లించాలని,పెండింగ్ బిల్లులు, గుడ్లకు అదనంగా బడ్జెట్ ఇవ్వాలని, నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి వంట చేసిపెట్టిన వారికి బిల్లులు రాలేదు. దీంతో కార్మికులు అప్పులు పాలైనారు అని,తెచ్చిన అప్పుల వడ్డీలు పెరిగిపొయ్యాయి.ఇప్పుడున్న మెనూ కే కేటాయించిన బడ్జెట్ సరిపోవడం లేదు.పైగా కొత్త మెనూ మిక్స్ వెజిటబుల్ కర్రీ, వెజిటబుల్ బిర్యానీ, వారానికి 3 కోడు గ్రుడ్లు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అదనంగా బడ్జెట్ కేటాయించకుండా కొత్త మెనూ పెట్టడం సాధ్యం కాదన్నారు. కొత్త మెనూ కి అదనపు బడ్జెట్ కేటాయించాలి లేదా పాత మెనూ నే కొనసాగించాలి, ఇతర పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్, యామిని, పద్మ, రాములమ్మకనక,నన్ని నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంటను పీకేసిన ఫారెస్ట్ అధికారులు

నవతెలంగాణ-దమ్మపేట



దమ్మ పేట మండలం ఆర్ల పెంట, అంకం పాలెం, బొల్లి గట్టు గ్రామాల ఆదివాసీ గిరిజన రైతులు. గత 30 సంవత్సరం రాలునుండి. బండారు గుంపు ఏరియాలో పోడు వ్యవసాయం చేసుకుంటున్నారు. ఈ సంవత్సరం పత్తి పంట సాగు చేశారు. ప్రస్తుతం, పత్తి పంట పూత పూసింది. అట్టి పత్తి పంటను సుమారు 2 ఎకరాలను 27/9/2023 బుధవారం దమ్మపేట ఫారెస్ట్ రేంజర్ నాయకత్వంలో సుమారు 50 మంది ఫారెస్ట్ సిబ్బంది పత్తి పంటను పీకేసి ధ్వంసం చేశారు. ఇట్టి చర్యలను సీపీఐ(ఎం) మండల కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు పత్రికా ప్రకటన విడుదల చేశారు.

బీఈడీ ఫలితాల్లో మదర్ తెరిసా కాలేజీ ప్రభంజనం

నవతెలంగాణ- భద్రాచలం

ఇటీవల కాకతీయ యూనివర్సిటీ ప్రకటించిన బిఈడి సెకండ్ సెమిస్టర్ ఫలితాలలో అత్యధికంగా భద్రాచలంలో గల మదర్ తెరిసా బీఈడీ కళాశాల విద్యార్థులు తమ సత్తా చాటారు. విద్యార్థిని, విద్యార్థులు ఫస్ట్ క్లాసులలో పాసై నూటికి నూరు శాతం ఫలితాలను సాధించారు. 48 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా మొత్తం 48 మంది విద్యార్థులు పాస్ అవ్వడం జరిగింది. ఈ ఫలితాలలో డిక్షిన్షన్ లో 13, ఫస్ట్ క్లాసులో 35, ఉత్తీర్ణత సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన ఉమశ్రీ 7.54, యామిని 7.43,భావన 7.43 లను కళాశాల డైరెక్టర్ తోటమల్ల వెంకటరమణ అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థి, విద్యార్థినులు పాల్గొన్నారు.

జీవో నెంబర్ 8 ప్రకారం
వేతనాల ఏరియర్స్ చెల్లించాలి

మణుగూరు : మధ్యాహ్న భోజన కార్మికులకు జీవో నెంబర్ 8 ప్రకారం పెంచిన వేతనాలు చెల్లించాలని బడ్జెట్లో నిధులు కేటాయించాలని కనీస వేతనం 26,000 ఇవ్వాలని సిఐటియు మండల కన్వీనర్ ఉప్పతల నరసింహారావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందు తెలంగాణ మధ్యాహ్న భోజనం కార్మికులు యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలన్నారు. కొత్త మెనూ సవరించాలన్నారు. మధ్యాహ్న భోజన నిర్వహణను అక్షయపాత్రలాంటి స్వచ్ఛంద సంస్థలకు ఇవ్వరాదని హెచ్చరించారు. గుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలన్నారు. అక్రమ తొలగింపులు అరికట్టాలన్నారు. రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ప్రమాద బీమా పిఎఫ్, ఈఎస్ఈ సౌకర్యం కల్పించాలన్నారు. సమస్య పరిష్కారమయ్యే వరకు సమ్మె నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎం అరుణ, ఎన్ శైలజ, యు రాణి, ఎస్ పద్మ నాగమ్మ, మణెమ్మ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

గెజిటెడ్ లెక్చరర్స్ సమస్యలను పరిష్కరించాలి

మణుగూరు : తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ సమస్యలు పరిష్కరించాలని గురువారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ రేగా కాంతారావును తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ వారు కోరారు. వినతి పత్రం అందజేశారు. త్వరలోనే సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని రేగా కాంతారావు వారికి హామీ ఇచ్చారు.

మానవత్వం మరిచిన సభ్య సమాజం

మణుగూరు : మధ్యప్రదేశ్ లో ఉజ్జయిని వీధుల్లో అత్యాచారానికి గురై సాయం కోరిన 12 ఏళ్ల బాలిక ఘటనను జాతీయ వినియోగదారుల మరియు మానవ హక్కుల పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు మందాడి సంజీవరావు గురువారం తీవ్రంగా ఖండించారు. మణిపూర్ లో జరుగుతున్న సామూహిక అత్యాచారాలు మరువకముందే మానవత్వానికి మాయని మచ్చగా నిలిచిన ఘటన ఇది అని అన్నారు. 12 ఏళ్ల బాలిక అర్ధ నగ్నంగా రక్తమోడుతూ ఉజ్జయిని వీధుల్లో సాయం కోరుతూ తిరిగిన వీడియో అందరినీ కంటతడి పెట్టిస్తుందన్నారు. ఉజ్జయిని వీధుల్లో ఉన్నవారు మానవత్వాన్ని మరచడం చాలా బాధాకరం అన్నారు. ఈ ఘటన సభ్య సమాజం తలదించుకునేలాగా చేసిందన్నారు.

సింగరేణి ఏరియాలో పర్యటించిన డైరెక్టర్

మణుగూరు : మణుగూరు ఏరియాలో సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) జి.వేంకటేశ్వర రెడ్డి గురువారం పర్యటించారు. తమ అధికారిక పర్యటనలో భాగంగా మణుగూరు ఏరియాకు విచ్చేసి ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రాంచందర్ తో కలిసి కొండాపురం గనిని పరిశీలించారు కంటిన్యూయస్ మైనర్ యంత్రం ద్వారా జరుగు బొగ్గు ఉత్పత్తి ప్రక్రియను సంబంధిత అధికారులు మరియు కాంట్రాక్ట్ యాజమాన్యం వారితో చర్చించినారు. అనంతరం పికెటిసి-2 వ్యూ పాయింట్ నుండి క్వారీ లో జరిగే బొగ్గు ఉత్పత్తిని, యంత్రాల ద్వారా బొగ్గు లోడింగ్ ప్రక్రియను పరిశీలించినారు. మణుగూరు ఏరియాలో బొగ్గు ఉత్పత్తిని భవిష్యత్తు అవసరాల దృష్టిలో ఉంచుకొని ఏరియాలో సత్వరంగ నిర్దిష్టమైన ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. మణుగూరు ఏరియా ఉత్పత్తి, ఉత్పాదకత, లక్ష్యాల సాధనపై, బొగ్గు ఉత్పత్తి ప్రక్రియలో పూర్తి స్థాయిలో రక్షణ పాటించాలన్నారు. నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి చేస్తూ ఏరియాకు నిర్దేశించిన బొగ్గు మరియు ఓబి లక్ష్యాలను సాధించాలన్నారు. తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ సంవత్సర 2023-24 వార్షిక ఏరియా లక్ష్యమైన 119.50 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని సమిష్టి కృషితో సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రాంచందర్, లక్ష్మీపతి గౌడ్, వీరభద్ర రావు, వీరభద్రుడు, బి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ జ్వరంతో యువకుడు మృతి



నవ తెలంగాణ- టేకులపల్లి

మండలంలోని రాంపురం గ్రామపంచాయతీలో డెంగ్యూ జ్వరంతో యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మాలోతు శంకర్, పద్మ దంపతుల కుమారుడు మలోత్. రతన్(25) గత 4 రోజుల నుండి డెంగ్యూ జ్వరంతో బాధపడుతు ఖమ్మం లో ఒక ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబీకులు రోధిస్తూ తెలిపారు. గ్రామపంచాయతీలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ప్రజలు సంబంధిత అధికారులను కోరారు.

సింగరేణిలో పెనాల్టీలు రద్దు చేయాలి

- కార్మికుల వేతనాలు పెంచండి

నవతెలంగాణ- టేకులపల్లి

టేకులపల్లి ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం కోయగూడెం ఓసి పిఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి మేనేజర్ సుమన్‌కు కార్మికుల పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ యాకుబ్ షావలి మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికులకు, చట్టం పరంగా రావాల్సిన పండుగ సెలవులకు కాంట్రాక్టు కార్మికులకు మాస్టర్ తో కూడిన సెలవు ఇవ్వడం లేదన్నారు. కార్మికులు డ్యూటీ కి రాకపోతే, ఆప్ సెంట్ వేయకుండా, పెనాల్టీ వేస్తున్నారని, ఈ పేలాల్టి ఒక రోజుకి 300 రెండవ రోజు 600 మూడవరోజు 900దీని మూలాన కార్మికుడు మస్టర్ నష్టపోతు తిరిగి పెనాల్టీ చెల్లిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పెనాల్టీని రద్దు చేయాలని కోరారు. కార్మికులకు 2016 నుండి ఇప్పటివరకు జీతాలు పెంచలేదన్నారు. సింగరేణిలో కోట్ల రూపాయలకు ఈ కార్మికులే కారణమని ఈ కార్మికులకు జీతాలు పెంచకపోవడం సిగ్గుచేటు అన్నారు. జీతాలు నెలలో మొదటివారం చెల్లించాలని డిమాండ్ చేశారు. 30వ తేదీ ఇల్లందు జీఎం ఆఫీస్ ముందు ధర్నా ను జయప్రదం చేయాలని కాంట్రాక్టు కార్మికులను కోరారు.ఈ కార్యక్రమంలోఐఎఫ్టియు జిల్లా నాయకులు జరుపుల సుందర్, పాయం వెంకన్న, సైదులు, రామ్ కుమార్ పాల్గొన్నారు.

గ్యారెంటీ పథకాల వాల్ పోస్టర్ విడుదల

నవతెలంగాణ-కొత్తగూడెం టౌన్

కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని ఒకటి, రెండవ వార్డులో కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీ సంక్షేమ పథకాల వాల్ పోస్టర్లు ప్రజలకు తెలియజేసే విధంగా పొంగులేటి అభిమానులు గోడలకు వేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తాండ్ర నాగబాబు, బాల ప్రసాద్, సత్యనారాయణ రెడ్డి, రావూరి వీరభద్రం, పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో
వైభవంగా స్వామివారి కల్యాణ మహోత్సవం

నవతెలంగాణ-జూలూరుపాడు

మండల కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద బుధవారం రాత్రి గణపతి కళ్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని గత పది రోజులుగా ప్రత్యేక పూజలు అభిషేకాలు జ్యోతిర్లింగార్చనతో నవరాత్రి ఉత్సవాలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం వేద పండితులు పురాణం శ్రీనివాస శర్మ వేదమంత్రో చారణల నడుమ విఘ్నేశ్వరునికి సిద్ధిబుద్ధిమాతలతో కళ్యాణాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులు పెండ్యాల విజయభాస్కర్ దంపతులు, మండల ప్రధాన కార్యదర్శి తొండెపు సుబ్బారావు, కోశాధికారి కొదుమూరి భాను ప్రకాష్, కంచర్ల రామారావు, పెండ్యాల మురళి, నగేష్, పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

నవతెలంగాణ-దుమ్ముగూడెం

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సొంది సరోజిని (28) అనారోగ్యంతో మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. సరోజినికి అనారోగ్య సమస్య తలెత్తడంతో వైద్యం కోసం లక్ష్మీగరంలోని ఆర్ఎంపి వైద్యుడు వద్దకు వెళ్ళింది. చికిత్స అందిస్తుండగానే ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వైద్యుడు భద్రాచలం తీసుకెళ్లాలని సూచించాడు. భద్రాచలంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు సరోజిని మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా ఆమె మృతి పై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

కార్మికుల్ని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

సీపీఐ (ఎం) భద్రాచలం నియోజకవర్గం కో కన్వీనర్ కారం పుల్లయ్య

నవతెలంగాణ-దుమ్ముగూడెం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్న వివిధ రంగాలకు చెందిన కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తించాలని సీపీఐ(ఎం) నియోజకవర్గ కో కన్వీనర్ కారం పుల్లయ్య డిమాండ్ చేశారు. గురువారం అంగన్వాడీ వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, ఆశా వర్కర్లు చేపట్టిన నిరవధిక సమ్మె శిబిరాలను ఆయన సందర్శించి సిపిఐ (ఎం) ఆధ్వర్యంలో సంఘీభావాన్ని మద్దతు తెలిపారు. రాష్ట్రంలో కార్మికులంతా సమ్మెలో పాల్గొంటున్నప్పటికీ బిఆర్ఎస్ ప్రభుత్వం కనీసం కార్మికుల పట్ల నోరు మెదపడం లేదని అన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించకుండా గుర్తింపు కార్డులు ఇవ్వకుండా బెనిఫిట్స్ సౌకర్యాలు కల్పించా కుండా వెట్టి చాకిరీ చేపిస్తున్నారని ఆరోపించారు. కార్మికుల పట్ల కెసిఆర్ ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని పరిపాలిస్తున్నటువంటి పాలక ప్రభుత్వాలు కార్మిక హక్కులను అమలు చేయకుండా కాలరాస్తున్నాయని అన్నారు కార్మికుల చేసే పోరాటాలలో సిపిఐ (ఎం) పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని తెలియజేశారు. సంఘీభావం తెలిపిన వారిలో సిపిఐ (ఎం) జిల్లా నాయకులు మర్మం చంద్రయ్య, కొమరం చంటి నిమ్మల మధు అంగన్వాడిలు ఆశ వర్కర్లు మధ్యాహ్న భోజన కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

అనర్హులకు ఇంటి స్థలాలు..?

- ఎమ్మెల్యే కౌన్సిలర్స్ చేతుల్లో ఖాళీ స్థలాలు
- 75 గజల్లో ఇల్లు ఎలా నిర్మిస్తారు....?
- బిఆర్ఎస్ ఎన్నికల ముందు ఆడుతున్న హైడ్రామా..
- టీపిసిసి జనరల్ సెక్రెటరీ ఎడవల్లి కృష్ణ

నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం నియోజకవర్గంలో బీఆర్ఎస్ అధికార ప్రతినిధులు ఎమ్మెల్యే, వారి కుమారుడు కమీషన్స్ భూదందాలకు పాల్పడుతున్నాడని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పేదలకు 250 గజాల స్థలం, రూ.5 లక్షలు ఇచ్చి పేదలకు ఇళ్ల నిర్మాణం చేస్తామని టీపిసిసి జనరల్ సెక్రెటరీ ఎడవల్లి కృష్ణ తెలిపారు. గురువారం కొత్తగూడెం కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తున్నామని బోగస్ మాటలు చెప్పుకుంటూ మాయ మాటలతో ఎమ్మెల్యే పాబ్బం గడుపుతున్నాడని ఎడవల్లి విమర్శించారు. 75 గజాల్లో ఇల్లు నిర్మాణం ఎలా జరుగుతుంది...? అసలు నిజంగా అర్హులు అయిన వారికి ఇచ్చారా...? కేవలం పట్టణ కౌన్సిలర్ చేతుల్లో వారికి



నచ్చిన వారికి ఇచ్చారు తప్ప నిజమైన ఇల్లు లేని వారికి న్యాయం జరుగలేదని ఆరోపించారు. ఇట్టి స్థలాల విషయంలో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిజమైన పేదలకు ఇల్లు లేని వారికి ఇళ్లు ఇవ్వాలన్నారు. స్థలాల కేటాయింపులో అనార్హులకు ఎక్కువగా కేటాయించడం విడ్డూరమని, నియోజకవర్గంలో ఇటీవల 200వందల మందికి దళిత బంధులు వచ్చాయి, వీటిలో ఎమ్మెల్యే, అతని కుమారుడు రాఘవ ప్రతి ఒక్కరి దగ్గర మూడు లక్షలాది రూపాయలు కమీషన్స్ తీసుకోవడం, బీసీ బందు, మైనార్టీ బంధులలో కూడా తీవ్ర అక్రమాలు జరిగాయని, దీనిపై కమీషన్స్ తీసుకోవడం జరుగుతుందని ఆరోపించారు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళతాం, ఇటీవల తాజాగా ఇచ్చిన స్థలాలలో మున్సిపల్ చైర్మన్, 36వార్డులో ఊరిలో లేని వారికి కౌన్సిలర్ అండ దండలతో స్థలాలలో చాలా మందికి వారి స్వలాభం కోసం డ్రా తీసే టైంకి బాక్స్‌లో వేయడం విచిత్రం అన్నారు. ఏ రకంగా ప్రజలకు అన్యాయం చేస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారు.

కొత్తగూడెం రిపోర్టర్స్‌కి ఇంటి స్థలాలు కేటాయించాలన్నారు. నిర్లక్ష్యం చేయవద్దు వారు నిత్యం ప్రజల మధ్య ఉంటు ప్రజలకోసం శ్రమిస్తున్నారు తక్షణం ఇంటి స్థలం ఇవ్వాలని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం తథ్యం మని, వచ్చిన వెంటనే పేదలకు 250 గజాల స్థలం ఇచ్చి, రూ.5 లక్షలు ఇంటి నిర్మాణానికి ఇస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమములో బి.బ్లాక్ డెలిగేట్ రాయల శాంతయ్యా, కొత్తగూడెం పట్టణ అధ్యక్షులు బొమ్మిడి మల్లికార్జున్, పాల్వంచ పట్టణ అధ్యక్షులు నూకల రంగారావు, లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షులు సకినాల వెంకటేశ్వరావు, నియోజకవర్గ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

పని భారం తగ్గించాలి, 18వేలు వేతనం చెల్లించాలి

నవతెలంగాణ-చంద్రుగొండ

కనీస వేతనం 18000 చెల్లించాలని మండల ఆశా కార్యకర్తలు వినూత్నంగా చెవిలో పూలతో మండల తాసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. మా సమస్యలు పరిష్కరించే అంతవరకు నిరవధికంగా సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష కార్యదర్శులు జనగామ రుక్మిణి, రమాదేవి, కోశాధికారి అరుణ, జ్యోతి ,బడుగు పుణ్యవతి, శిరోమణి, చిన్న లక్ష్మి, నాగమణి,రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షునిగా షేక్ వసీం పాషా

నవతెలంగాణ-చంద్రుగొండ



ఎన్ఎస్‌యుఐ మండల అధ్యక్షునిగా షేక్ వసీం పాషాను నియమించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుతానన్నారు. నాపై ఎంతో నమ్మకంతో అధ్యక్షునిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షులు బల్మోర్ వెంకట్‌కు, రాష్ట్ర కార్యదర్శులకు, జిల్లా అధ్యక్షునికి, అశ్వరావుపేట నియోజకవర్గం అధ్యక్షునికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన
కార్మికుల సమస్యలు పరష్కరించాలి

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

ఆశా వర్కర్లుకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం 18 వేలు రూపాయలు ఇవ్వాలని, అదేవిధంగా మధ్యాహ్న భోజన కార్మికులు సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి జంగిలి వెంకటరత్నం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆశావర్కర్లు మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన సమ్మెకు ఆయన మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశావర్కర్లుతో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని, అశాలకు ఉద్యోగ భద్రత లేదని వెంటనే ఉద్యోగ భద్రత కల్పించి ప్రమాద భీమా 5 లక్షలు ఇవ్వాలని హెల్త్ కార్డులు మంజూరు చేయాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ 5 లక్షలు ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి, బేబీ, ముంతాజ్, మధ్యాహ్న భోజన కార్మికులు సీత,అనుసూర్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి
అనిల్ రెడ్డి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం తనదైన శైలిలో అలుపెరగని పోరాటాలు నిర్వహిస్తున్న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అక్రిడిటేషన్ నెంబర్ కర్ర అనిల్ రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం జర్నలిస్టులు ఘనంగా నిర్వహించారు. భద్రాచలం పట్టణంలోని కొత్త మార్కెట్ లో గల సంఘం యూనియన్ కార్యాలయంలో జరిగిన జన్మదిన వేడుకల్లో జర్నలిస్టులు పలువురు జర్నలిస్టు యూనియన్ నాయకులు అనిల్ రెడ్డిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. జర్నలిస్టు యూనియన్ జాతీయ నాయకులు చిర్ర శ్రీనివాస్ గౌడ్, టి డబ్ల్యు జేఎఫ్ జిల్లా కార్యదర్శి గుండెబోయిన వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి రవికుమార్, పినపాక నియోజకవర్గం కార్యదర్శి సూర్యం తదితరులు పాల్గొన్నారు.

సోయం భద్రయ్య ఆశయాలను కొనసాగించాలి

- సీపీఐ(ఎం) భద్రాచలం నియోజకవర్గ కో కన్వీనర్ కారం పుల్లయ్య

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మాజీ సర్పంచ్ సోయం భద్రయ్య ఆశయాలను కొనసాగించాలని సిపిఐ (ఎం) భద్రాచలం నియోజకవర్గ కోకన్వీనర్ కారం పుల్లయ్య పిలుపునిచ్చారు. గురువారం దుమ్ముగూడెం మండలం భీమవరం గ్రామంలో సిపిఐ (ఎం) పార్టీ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ సోయం భద్రయ్య ప్రథమ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కారం పుల్లయ్య మాట్లాడుతూ సోయం భద్రయ్య ఏ లక్ష్యంతో అయితే పనిచేశారో... ఆ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్ళేందుకు మనమంతా కృషి చేయాలని కోరారు. పంచాయతీ పరిధిలోని అనేక గ్రామాల్లో చెరువులు, సాగునీరు తాగునీరు కోసం భద్రయ్య పని చేశారని గుర్తు చేశారు. ఈ ప్రాంతంలో గృహలక్ష్మి ఇండ్లు గ్రామ సభలు ద్వారానే ఎంపిక చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం మాజీ ఎంపీపీ పార్టీ మండల కమిటీ సభ్యురాలు సోయం నాగమణి జెండా ఆవిష్కరణ చేసి పూలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కోశాధికారి పోయం జోగారావు, సీపీఐ (ఎం) నాయకులు నిమ్మల మదు, భద్రయ్య తనయుడు పోయం శేషారావు, జోగారావు, కోడలు వార్డ్ మెంబర్ సోయం వెంకటరమణ శాఖ కార్యదర్శి కోడి వీరస్వామి, సోంది కామమ్మ, మచ్చ బాబురావు, స్వయం వెంకటేశ్వర్లు, మచ్చ శ్రీరాములు. చిన్న మారయ్య, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



భద్రాద్రి జిల్లా స్థాయిలో నవోదయ మోడల్ పరీక్ష

నవతెలంగాణ -బూర్గంపాడు



గత 18 సంవత్సరాల నుండి ప్రతి సంవత్సరం నవోదయలో సీట్లు సాధిస్తున్న బ్రిలియంట్ నవోదయ కోచింగ్ ఆధ్వర్యంలో 2023-2024 సంవత్సరంలో జరగబోయే నవోదయ మెయిన్ పరీక్ష రాయబోవు విద్యార్థులకు పరీక్ష పై అవగాహన కల్పించుటకు 1వ తేదీన ఆదివారం ఉదయం 9:30 నిలకు బ్రిలియంట్ స్కూల్ లో నిర్వహించనున్నట్లు బ్రిలియంట్ నవోదయ కోచింగ్ చైర్మన్ బి.ఎస్.ఆర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెంటల్ ఎబిలిటీ, మాథ్స్, లాంగ్వేజ్ పై ఈ మోడల్ పరీక్ష ఉంటుందని ఆయన అన్నారు. ప్రైవేట్, గవర్నమెంట్ స్కూల్ ల లో 5 వ తరగతి చదువు తున్న తెలుగు , ఇంగ్లీష్ మీడియం విద్యార్థినీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని ఆయన అన్నారు. ఈ పరీక్షలో మొదటి, రెండు ర్యాంకులు సాధించిన విద్యార్థు లకు ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు బి.ఎస్. ఆర్ పేర్కొన్నారు.నవోదయ మోడల్ పరీక్ష వ్రాయ బోవు విద్యార్థులు ఒక్కరోజు ముందుగా తమ పేర్లను బ్రిలియంట్ స్కూల్ లో నమోదు చేసుకోవా లని ఆయన తెలిపారుపూర్తి వివరాలకు బ్రిలియంట్ స్కూల్ సారపాక 9866283566, 7675040619 నెంబర్ లను సంప్రదించాలని ఆయన కోరారు.

నేటి యువత భగత్ సింగ్ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలి

నవతెలంగాణ-జులురుపాడు

నేటితరం యువత, విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని ముందుకు నడవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు గార్లపాటి పవన్ కుమార్ అన్నారు. గురువారం భగత్ సింగ్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే ఈ దేశం కోసం ప్రాణాలు అర్పించిన గొప్ప వ్యక్తి భగత్ సింగ్ అని అన్నారు. మా దేహం ముక్కలైన ఈ దేశాన్ని ముక్కలు కానివ్వం అనే నినాదంతో భారతదేశ ప్రజల్లో గొప్ప చైతన్యం తీసుకువచ్చిన స్వాతంత్ర



సమరయోధుడు భగత్ సింగ్ అని అన్నారు. చిన్న వయసులోనే బ్రిటిష్ వారి పార్లమెంటు మీద పొగ బాంబు వేసి బ్రిటిష్ వారిని గడగడలాడించి గొప్ప వ్యక్తి భగత్ సింగ్ మా దేశం నుండి మీరు వెళ్లిపోవాలని బ్రిటిష్ వారిని హెచ్చరించిన వీరుడు భగత్ సింగ్ అని అన్నారు. నేటితరం యువత విద్యార్థులు వారి యొక్క పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని వారి ఆశయాల కోసం ముందు నడవాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బోడ అభిమిత్ర, నాయకులు పవన్ పృథ్వీ, జోష్, చరణ్, తరుణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

నవతెలంగాణ భద్రాచలం రూరల్

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన పథకం యూనియన్ సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్ అమరవీరుల స్తూపం వద్ద సమ్మె చేస్తున్నారు. సిఐటియు పట్టణ కో కన్వీనర్ మర్లపాటి రేణుక అధ్యక్షత జరిగిన ఈ సభలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు వెంకటరెడ్డి మాట్లాడుతూ 2001 నుంచి డ్వాక్రా మహిళలతో ప్రారంభించిన ఈ పథకాన్ని ఎటువంటి వేతనం లేకుండా 22 సంవత్సరాలుగా స్కూలు పిల్లలకు వంట చేసి పెడుతున్న మహిళలకు కనీస వేతనం అమలు చేయకపోగా స్వయంగా ముఖ్యమంత్రి అసెంబ్లీలో 2000 రూపాయలు వేతనం పెంచుతూ ప్రకటించిన దానిని వెంటనే అమలు చేయాలని, పెండింగ్ బిల్లులు ఇవ్వాలని, పెంచిన మెనూ కనుగుణంగా చార్జీలు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కన్వీనర్ ఎంబి నర్సారెడ్డి, సీఐటియు టౌన్ నాయకులు, గుడిపల్లి లక్ష్మీకాంత్ అప్పారి రాము, నాగరాజు, సత్య జ్యోతి, సతీష్, శ్రీను, మధ్యాహ్న భోజన పథకం కార్మిక యూనియన్ పట్టణ అధ్యక్షులు పిలకా శివకుమారి, పట్టణ కమిటీ సభ్యులు అక్కల జ్యోతి పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి



సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణం అంబేద్కర్ సెంటర్లో కొనసాగుతున్న ఆశా వర్కర్ల నాలుగో రోజు సమ్మె శిబిరాన్ని సందర్శించి ఆయన సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐటియు పట్టణ కో కన్వీనర్ మర్లపాటి రేణుక అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్వామి మాట్లాడుతూ... ఆశా కార్మికులకు ఫిక్స్‌డ్ వేతనం 18 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆశాలకు సంబంధంలేని పనులు అప్పజెప్పి వారితో వెట్టి చాకిరీ చేపించుకుంటుందని వెంటనే పని భారం తగ్గించాని డిమాండ్ చేశారు. గ్రామాలలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆశాలు చర్యలు తీసుకుంటున్నారని గుర్తు చేశారు. ప్రతి రోజు ఇంటింటికి తిరిగి వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తూ ప్రజల పై వ్యాధులు ప్రబలకుండా ఆశాల ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. వారికి అదనపు పనులు చేయాలని చెప్పి అధికారులు ఒత్తిడి, బెదిరింపులు గురి చేస్తున్నారని ఆశాల ను బెదిరింపులకు పాల్పడితే సహించబోమని హెచ్చరించారు. పనికి తగ్గ పారితోషకం పేరుతో ఆశలకు ఫిక్సుడ్ వేతనం ఇవ్వడం లేదని వెంటనే పనికి తగ్గ పారితోషకం పద్ధతిని రద్దు చేసి ఫిక్సుడ్ వేతనం ప్రకారం 18 వేల రూపాయలు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆశాలకు రక్షణ లేకుండా పోయిందని వారికి వెంటనే ప్రమాద బీమా ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆశ వర్కర్ల న్యాయమైన డిమాండ్ల ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కన్వీనర్ ఎంబి నర్సారెడ్డి, ఐద్వా పట్టణ అధ్యక్షురాలు ఉస్తెల జ్యోతి, సిఐటియు పట్టణ నాయకులు జి లక్ష్మణ్, అప్పారి రాము, నాగరాజు, గిరిజన సంఘం పట్టణ కార్యదర్శి కుంజ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సరోజినీ వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ

భద్రాచలం : మిలాదున్ నబి ప్రవక్త జన్మదిన మొహమ్మద్ జన్మదినాన్ని పురస్కరించుకొని అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో భద్రాచలంలోని సరోజిని వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆర్గనైజేషన్ అధ్యక్షులు మస్తాన్ మాట్లాడారు. అరేబియా ప్రాంతంలో జన్మించినటువంటి మానవ మహోపకారి ప్రవక్త మహమ్మద్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆర్గనైజర్స్ మస్తాన్, ఉస్మాన్,ఇమామ్, ఖయ్యూం పాషా, జాని, జవిద్, ఇలాహి బాక్షి, సొందుమియ,4 తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు పాషా, ఉపాధ్యక్షులు మహబూబ్, బిఆర్ఎస్ భద్రాచలం మండల ఉపాధ్యక్షులు నవాబ్, 1 వార్డు సభ్యులు మామిళ్ళ రాంబాబు తదితరులు పాల్గొన్నారు

అంగన్వాడీ ఉద్యోగులకు
కనీస వేతనం 26,000 ఇవ్వాలి

నవతెలంగాణ భద్రాచలం రూరల్

భద్రాచలం అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులగా గుర్తించాలని, మినీ టీచర్లను మెయిన్ టీచర్లుగా ప్రమోట్ చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 70 వేల మంది అంగన్వాడీ ఉద్యోగులు పనిచేస్తున్నారని, వీరికి కనీస వేతనం నెలకు 26000 ఇవ్వాలని మినీ టీచర్లను మెయిన్ టీచర్లుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం అంగన్వాడీ యూనియన్ పట్టణ అధ్యక్షురాలు లలిత అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, సిఐటియు పట్టణ కో కన్వీనర్ మర్లపాటి రేణుక, లయన్స్ క్లబ్ అధ్యక్షులు భీమవరం వెంకటరెడ్డి .సిఐటియు నాయకులు కే సత్య, జి లక్ష్మణ్, ఐద్వా అధ్యక్షురాలు యు.జ్యోతి ఏ. రాము, నాగరాజు కుంజ శ్రీను, అజయ్ కుమార్ మురళీకృష్ణ మేరీ రాజేశ్వరి, విజయ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన నూనె దిగుబడికి చర్యలు చేపట్టాలి

- ఫాం ఆయిల్ గ్రోవర్స్ సొసైటీ

నవతెలంగాణ - అశ్వారావుపేట

పరిశ్రమకు తరలించిన పామాయిల్ గెలలను ఎప్పటికప్పుడు గానుగ ఆడించి నాణ్యమైన నూనె దిగుబడి అయ్యేలా చర్యలు చేపట్టాలని ఆయిల్ఫెడ్ డి.ఓ బాలక్రిష్ణ కు ఆయిల్ ఫాం గ్రోవర్స్ సొసైటీ బాధ్యులు సూచించారు. గురువారం స్థానిక ఫాం ఆయిల్ పరిశ్రమను వారు సందర్శించి గెలలు నిల్వలు, ఓ.ఈ.ఆర్, గెలల దిగుబడి అంశాలపై బాలక్రిష్ణతో చర్చించారు. అశ్వారావుపేట పరిశ్రమకు తరలించిన గెలలు పాడవకుండా అప్పారావుపేట ఫ్యాక్టరీకి తరలించాలని కోరారు. సామర్థ్యం మించి నిల్వ చేసిన గెలలు కుళ్లి నూనె దిగుబడి తగ్గి ఎఫ్.ఎఫ్.ఎ పెరగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని, గెలలు నాణ్యత పెంచుకునే విధంగా రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీని సైతం సందర్శించి రైతుల సమస్యలపై మేనేజర్లు బాలకృష్ణ, కళ్యాణ్ లతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ పామ్ అడ్వైజరీ కమిటీ సభ్యులు రావు జోగేశ్వరరావు, ఆయిల్ ఫెడ్ అశ్వారావుపేట జోన్ ఆయిల్ పామ్ గ్రోవర్స్ సొసైటీ నాయకులు తుంబూరు మహేశ్వర్ రెడ్డి, కొక్కెరపాటి పుల్లయ్య, చెలికాని సూరిబాబు, శ్రీనివాస్ రెడ్డి, ముష్టిబండ సర్పంచ్ బత్తిని తిరుపతి రావు, బండారుపల్లి ప్రసాద్ లు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో
వ్యక్తి మృతి



నవతెలంగాణ-పినపాక

పినపాక మండలం గోపాలరావుపేట గ్రామానికి చెందిన బూరుగడ్డ రాములు (50) గురువారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడు ఈ బయ్యారం క్రాస్ రోడ్ లో ఇస్త్రీ బండి నడుపుకొని గోపాల్ రావు పేట గ్రామానికి వెళుతున్న క్రమంలో సీతంపేట శివారులో చెట్టుకు ఢీకొని మృతి చెందాడు. స్థానికులు గమనించి పినపాక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆ వ్యక్తి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.



దత్త నగర్‌లో అన్నదాన కార్యక్రమం

నవ తెలంగాణ-జూలూరుపాడు

మండలంలోని వెంగన్నపాలెం గ్రామపంచాయతీ ఎంపిడిఓ ఆఫీస్ రోడ్డు నందు దత్త నగరం వీధిలో బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మాడుగుల నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ నవరాత్రులు ఉత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎంపీపీ లావుడియా సోనీ, మండల ప్రధాన కార్యదర్శి నున్న రంగారావు, ఎస్సై పురుషోత్తం, మోదుగు రామకృష్ణ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పనితీ వెంకటేశ్వర్లు, మండల ఉపాధ్యక్షుడు ఎస్కే మైబు ప్రారంభించి భక్తులకు స్వయంగా వడ్డించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గణేష్ ఉత్సవాల కమిటీ సభ్యులు భక్తులు, సుజాత తదితరులు పాల్గొన్నారు.



ఔదార్యం చాటుకున్న చిన్న నాటి స్నేహితులు

- రాంబాబు కుటుంబానికి రూ.60వేలు వితరణ

నవతెలంగాణ-చర్ల

ఇటీవల అకాల మరణం చెందిన స్నేహితుడి పట్ల తమ ఔదార్యాన్ని చాటి ఆర్థికంగా ఆదుకున్నారు. వివరాల్లోకి వెళితే గుర్తుకొచ్చాయి చిన్న నాటి జ్ఞాపకాలు, గడిపిన మధురమైన అనుభూతులు.. ఆ తీపి క్షణాలు.. మరువక ముందే అనారోగ్యంతో తన స్నేహితుడు ఏకుల రాంబాబు నెలరోజుల క్రితం మృతి చెందాడని ఆవేదన చెందారు. ఏకుల రాంబాబు ఎరువుల దుకాణంలో పని చేసేవాడు. తన స్నేహితుడి కుటుంబం ఎంతో కొంత ఆర్థిక సహాయం చేయడానికి సిద్ధపడ్డారు. ఆర్థిక సహాయం కింద రూ.60వేలు పోగు చేసి 1987-88 నాటి టెన్త్ బ్యాచ్ మిత్రులు అందజేసి అనారోగ్యంతో మృతి చెందిన స్నేహితుని కుటుంబానికి బాసటగా నిలిచారు. ఆర్థిక సహాయం అందించిన వారిలో చిట్టిమల్ల శేషగిరిరావు(ఈనాడు విలేఖరి) ,ఎడారి భూపతి, శ్రీరాముల సాంబమూర్తి, గురిజాల రాము, పానుగంటి రామ్మోహన్ రావు, తోటపల్లి శ్రీనివాసరావు, ఏడెల్లి గణపతి, మామిడి భద్రం తదితరులు పాలు పంచుకున్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి రిమాండ్

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



కారులో గంజాయిని తరలిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి తెలిపారు. ఖమ్మంరూరల్ పోలీసు స్టేషన్ లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను ఏసీపీ వెల్లడించారు. ఒడిస్సా రాష్ట్రం మల్కన్ గిరి జిల్లా చింతకుంట మండలం రోస్యగూడ గ్రామానికి చెందిన వంత బలరామ్,ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా వై.రామవరం మండలం పాలగడ్డ గ్రామానికి చెందిన కులదీప్ కిషోర్ ఇద్దరు కలిసి రూ.10 లక్షల విలువ చేసే 44 కిలోల గంజాయిని విక్రయించేందుకు చింతూరు నుంచి విజయవాడ, గంర్రాయి మీదుగా వరంగల్‌కు తరలిస్తున్నారు. ముదిగొండ మండలం వల్లభి వద్ద బుధవారం సాయంత్రం తనిఖీలు చేపట్టగా పట్టుబడ్డారు. ఇద్దరు నిందితులతో పాటుగా కారు, ఒండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని సీజ్ చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ వివరించారు. కార్యక్రమంలో సీఐ రాజిరెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లో పలువురు చేరిక

నవతెలంగాణ- ముదిగొండ

మండల పరిధిలో బాణాపురంలో కాంగ్రెస్ పార్టీ నుండి ఏడు కుటుంబాలువారు అమ్మ ఫౌండేషన్ అధ్యక్షులు మల్లు నందిని సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు జోన్ ఇన్చార్జి పిల్లుట్ల రాఘవ గురువారం తెలిపారు.బిఆర్ఎస్ కార్యకర్తలను కాంగ్రెస్ కండువ కప్పి సాదరంగా ఆమె పార్టీలోకి ఆహ్వానించారు.ఈసందర్భంగా మల్లు నందిని మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ వారు ప్రజలకు మాయమాటలు చెప్పి,కొందరు దళితులను దళిత బంధు సాకుతో పార్టీలోకి చేర్చుకుంటున్నారని విమర్శించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు దొబ్బల సౌజన్య,గ్రామసర్పంచ్ ఆవుల రమలక్ష్మారెడ్డి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు మరికంటి వెంకటేశ్వర్లు, సొసైటీ డైరెక్టర్ ఉన్నం పూర్ణచంద్రరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యంగ్రాతి వెంకటేశ్వర్లు, గుండాల వెంకటప్పయ్య, గ్రామ నాయకులు శివయ్య, మేడి సుధాకర్, శీలం శ్రీనివాసరావు, మట్టా దుర్గాప్రసాద్‌రెడ్డి, బెందు దాసు, శనగల మన్మథరావు, బెందు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన సాగు విధానానికి స్వామినాథన్ బాటలు

తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

హరిత విప్లవం పేరుతో నూతన సాగుకు బాటలు వేసిన మహనీయుడు ఎం.ఎస్. స్వామినాథన్ అని తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. ఆయన మతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆహార వద్ధిలో భారత్ స్వయం సమద్ది సాధించేందుకు ఎంతగానో కృషి చేశారన్నారు. ఎక్కువ దిగుబడిని ఇచ్చే వరి వంగడాలను వృద్ధి చేయడంలో ఆయన చేసిన కృషి దేశ వ్యాప్తంగా తక్కువ ఆదాయం పొందుతున్న ఎంతో మంది రైతుల జీవితాలను మార్చేసిందని కొనియాడారు. ఆయన మృతి భారతదేశ వ్యవసాయ రంగానికి తీరని లోటని పేర్కొన్నారు.

నేడు ఖానాపురానికి జడ్పీ చైర్మన్ లింగాల రాక

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలో ఖానాపురం గ్రామానికి జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు శుక్రవారం రానున్నారు. గ్రామంలోనే గ్రామపంచాయతీ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మహాత్మజ్యోతిరావుపూలే, గాంధీ విగ్రహాలను ఆయన లాంచనీయంగా ఆవిష్కరించనున్నారు. అనంతరం పమ్మి గ్రామంలో పర్యటించి సిసి రోడ్డుకు శంకుస్థాపన చేయనున్నారు.

హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కొణిజర్ల



ఈనెల30వ తేదీన పామాయిల్ ఫ్యాక్టరీ శంకుస్థాపనకు ఐటి శాఖ మంత్రి కేటీఆర్ వస్తున్న సందర్భంగా హెలిపాడ్ ప్రదేశాన్ని వైరా శాసనసభ్యులు లావుడియా రాములు నాయక్ గురువారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంజనాపురం గ్రామంలో పామాయిల్ ఫ్యాక్టరీ శంకుస్థాపనకు కేటీఆర్ వస్తున్నారని తెలిపారు. కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రాజద్రోహం చట్టం కింద కేసు పెట్టడాన్ని ఖండించండి

నవతెలంగాణ-లక్ష్మీదేవి పల్లి



సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా భద్రాచలం డివిజన్ కార్యదర్శి కొండా చరణ్ పై ఉపా, రాజద్రోహం చట్టం కింద కేసు పెట్టడాన్ని ప్రజాస్వామ్యకవాదులు ఖండించాలని సీపీఐ (యం.యల్) ప్రజాపంథా రాష్ట్ర నాయకురాలు చంద్ర అరుణ కోరారు. కొండా చరణ్ పై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని, ఉపా, రాజా ద్రోహం చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం లక్ష్మీదేవి పల్లి మండల కేంద్రంలో పార్టీ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. తక్షణమే చరణ్ ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి మాచర్ల సత్యం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జాటోత్ కృష్ణ, జిల్లా నాయకులు ఆజాద్, ఐఎఫ్టియు జిల్లా సహాయ కార్యదర్శి ఏదులాపురం గోపాలరావు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బానోత్ ధర్మ, పార్టీ మండల కార్యదర్శి గుగులోతు రామచందర్, ఐఎఫ్టియు జిల్లా నాయకులు ఎం.రాజశేఖర్, పిఓడబ్ల్యు నాయకురాలు జ్యోతి, శీను తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కలను నెరవేర్చనున్న 'గృహలక్ష్మీ'

- సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య
- లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ

నవతెలంగాణ-సత్తుపల్లి



గృహలక్ష్మీ పథకం ద్వారా ఇండ్లు కట్టుకోలేని పేదలకు సొంతింటి కల నెరవేరనుందని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. గురువారం స్థానిక లక్ష్మీ ప్రసన్న ఫంక్షన్ హాల్ లో సొంత స్థలాలు ఉన్న ఇండ్లు లేని పేదలకు గృహలక్ష్మి పథకం మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సండ్ర మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఆడబిడ్డల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి కార్యక్రమాన్ని అమలుమరిచే సత్తా ఉన్న నాయకుడు సీఎం కేసీఆరే అన్నారు. గృహలక్ష్మి పేరుతో మహిళల గౌరవాన్ని పెంపొందించేందుకు వారి పేరుతో సొంత ఇంటి మంజూరు పత్రాన్ని ఇచ్చి సహాయంగా రూ. 3లక్షలు వారి జమ చేస్తుందని ఎమ్మెల్యే సండ్ర అన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఇండ్ల నిర్మాణాల్లో ఎన్నో అవకతవకలు జరిగాయని, పథకం తప్పుదారి పట్టే విధంగా మధ్యలో దళారులు వ్యవహరించారన్నారు. అలాంటి తప్పులు జరగకుండా నేరుగా బ్యాంక్ అకౌంట్ లోనే సహాయాన్ని అందిస్తూ బ్యాంకులో వారిపై అంతకుముందు రుణాలు ఉంటే వాటికి సంబంధం లేకుండా సంక్షేమ ఫలాలను వారికి అందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందన్నారు. మహిళలు అభ్యున్నతి సాధించాలని 33% రిజర్వేషన్ అమలను బీఆర్ఎస్ ప్రభుత్వం మద్దతు తెలిపిందన్నారు. 9 యేండ్ల కాలంలో దేశంలో ఎక్కడాలేని విధంగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఒంటరి మహిళలకు పింఛన్లు, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, ఆరోగ్య మహిళ వంటి గొప్ప పథకాలను చేపట్టిందన్నారు. వారి భద్రతకు పెద్దపీట వేస్తూ షీ టీమ్స్ తో భరోసా కల్పించిందన్నారు. మరో ముందు అడుగు వేసి గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టి మహిళల పేరుతో మంజూరు పత్రాన్ని అందించి పేదింటి మహిళలను గృహలక్ష్మిగా తీర్చిదిద్దిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. ఏ కార్యక్రమాన్నైనా అమలుపరిచే సత్తా ఉన్న గొప్ప నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధులు, అధికారులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

యువజన బీసీ సంఘం అధ్యక్షుడిగా ఆకుల సురేష్

నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



రఘునాధపాలెం మండలం యువజన బీసీ సంఘం అధ్యక్షుడిగా శివాయిగూడెం గ్రామానికి చెందిన ఆకుల సురేష్ నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పిండిప్రోలు రామమూర్తి, యువజన సంఘం జిల్లా అధ్యక్షులు పోతగాని రమణ కుమార్ నియామక పత్ర ఉత్తర్వులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆకుల సురేష్ మాట్లాడుతూ తనను బీసీ యువజన సంఘం అధ్యక్షుడిగా నియమించిన జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్యకి, జిల్లా అధ్యక్షులు పిండిప్రోలు రామమూర్తికి, యువజన సంఘం జిల్లా అధ్యక్షులు పోతగాని రమణ కుమార్‌కి కృతజ్ఞతలు తెలియజేశారు. రాబోయే కాలంలో బీసీ యువజన సంఘాన్ని బలోపేతం చేసి నియోజకవర్గ వ్యాప్తంగా యువజన సంఘం కమిటీలు వేసి ముందుకు తీసుకు వెళతామన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నగర అధ్యక్షులు గద్దె వెంకటరామయ్య, మధిర డివిజన్ అధ్యక్షులు మొరం పాపారావు, నగర కార్యదర్శి గజవెల్లి లక్ష్మీ, వరప్రసాద్, రూరల్ మండలాధ్యక్షుడు సావిడి శ్రీనివాస్, కూసుమంచి మండల అధ్యక్షుడు నాయిని విజయ్ అచిత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

నవతెలంగాణ - బోనకల్



మండల పరిధిలోని రావినూతల గ్రామంలోని బడి తండాలో నిర్మించనున్న సిసి రోడ్డుకు ఎంపీపీ కంకణాల సౌభాగ్యం గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సీసీ రోడ్డుకు మండల పరిషత్ నుంచి నిధులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా కంకణాల సౌభాగ్యం మాట్లాడుతూ మండల పరిషత్‌కు మంజూరైన నిధులను మండల పరిధిలోని 13 ఎంపీటీసీలకు ప్రాధాన్యత క్రమంలో నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామాలలో సిసి రోడ్ల వలన ఎంతో పరిశుభ్రంగా ఉంటాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలలో సిసి రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రావినూతల ఎంపీటీసీ కందిమల్ల రాధ మాజీ సర్పంచ్ గుగులోత్ పంతు మాజీ ఎంపీటీసీలు దొండపాటి నాగేశ్వరరావు, తాళ్లూరి బాబు, గండు సైదులు, బడి తండా పెద్దలు బానోత్ సాదు, బానోత్ రావిజ, సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి కొంగర గోపి, సిపిఎం నాయకులు జోని బోయిన గురవయ్య, షేక్ పఠాన్ అబ్జల్, సిపిఎం మహిళా శాఖ కార్యదర్శి గుగులోత్ శారద, వార్డు నెంబర్ లావూరి వెంకటేశ్వర్లు, టీఎస్ యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గుగులోతు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హ్యాట్రిక్ విజయం అందించాలి : మంత్రి పువ్వాడ

నవ తెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని స్థానిక 18వ డివిజన్ ముస్తఫా నగర్ లో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బొమ్మ రాజేశ్వరరావు అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తనకు హ్యాట్రిక్ విజయం అందించాలని కోరారు. అభివృద్ధి విషయంలో ఒళ్ళు దాచుకోకుండా పని చేశానని, మీరు కూడా ఇక్కడ జరిగిన అభివృద్ధిని గుర్తించాలన్నారు. ఎన్నికలు వచ్చినపుడు సహజంగా చాలా మంది వస్తారని, స్వార్థంతో కూడిన ప్రేమ చూపిస్తారని, కన్నీళ్లు పెట్టుకుంటారని, వాటికి కరగాల్సిన పని లేదు అన్నారు.

.కార్యక్రమంలో విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్ లు కమర్తపు మురళీ, మందడపు లక్ష్మీ, మక్బూల్, వర్తక సంఘం అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు,వర్తక సంఘం సభ్యులు కొప్పు నరేష్ కుమార్, మెంతుల శ్రీశైలం, బండారు శ్రీనివాసరావు, పిండిపోలు రాంమూర్తి, మన్నెం కృష్ణ, మాధవి, సుజాతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన జెడ్పీటీసీ

నవతెలంగాణ-కల్లూరు

మండల పరిధిలోని వెన్నవల్లి గ్రామంలో గణేష్ నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా గురువారం అన్నదాన కార్యక్రమాన్ని జడ్పిటిసి కట్టా అజయ్‌కుమార్, ఎంపీటీసీ ఉప్పు సుబ్బారావు ప్రారంభించారు. కల్లూరులోని లక్కినేని వారి వీధిలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని సర్పంచ్ లక్కినేని నీరజ రఘు ప్రారంభించారు. అనంతరం గ్రామాల్లో గణేష్ నిమజ్జనానికి ప్రదర్శన నిర్వహించి చెరువుల్లో నిమజ్జనం చేశారు. కార్యక్రమాల్లో పోచారం సొసైటీ వైస్ చైర్మన్ రాధాకృష్ణ, తిరుపతిరావు, సత్యం, కల్లూరులో బయ్యారపు నరేంద్ర, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థి అమూల్యకి ఆర్థికసాయం

నవతెలంగాణ-కల్లూరు

పట్నంలోని శాంతినగర్‌కు చెందిన విద్యార్థిని అమూల్యకు మాస్ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో 15వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ఆర్డిఓ అశోక్ చక్రవర్తి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా అమూల్యని ఆర్డీవో స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు గురువారం ఘనంగా సత్కరించారు. మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని శాంతినగర్‌కి చెందిన ఖమ్మంపాటి అమూల్య ఇటీవల నిర్వహించిన నీట్ పరీక్షలో 420 మార్కులతో ఎంబిబిఎస్‌లో సిరిసిల్ల ప్రభుత్వ కళాశాలలో సీటు సాధించినప్పటికీ ఆర్థికంగా పేద కుటుంబం కావడంతో మాస్ స్వచ్ఛంద సేవా సంస్థను ఆశ్రయించగా స్పందించిన సంస్థ నిర్వాహకులు ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో మహా ఆది సేవాసమితి సభ్యులు కొండూరి కిరణ్ కుమార్, గుర్రాల సుధీర్ కుమార్, నల్లగట్ల మధు, తడిక మళ్ళ వందనం, ఖమ్మంపాటి అప్పారావు, మల్లేశ్వరరావు, దాసరి సాల్మన్ రాజు, రాజా, ప్రకాష్, జానపాటి రోజ్ వేణు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఫుట్‌బాల్ పోటీలకు ముదిగొండ విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ-ముదిగొండ

జిల్లా గేమ్స్ అండ్ స్పోర్ట్స్ అథారిటీ,స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో గురువారం నిర్వహించిన క్రీడల పోటీల ఎంపికలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ముదిగొండ నుండి ఆరుగురు విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర ఫుట్బాల్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ ఎల్ ఉపేందర్ తెలిపారు. సంగారెడ్డిలో జరగబోయే రాష్ట్రస్థాయి అండర్ 17 ఫుట్బాల్ పోటీల్లో ఈవిద్యార్థులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. పాఠశాల నుండి ఫుట్బాల్ పోటీలకు ఎంపికైన ఆరుగురు విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్‌తోపాటు, ఉపాధ్యాయుల బృందం అభినందించారు. ఒకే పాఠశాల నుండి ఆరుగురు విద్యార్థులు ఎంపిక కావడం విశేషం. కాగా ఫుట్బాల్ పోటీలకు ఎంపికైన ఆరుగురు విద్యార్థులకు పాఠశాల గణిత బోధన ఉపాధ్యాయులు అంజయ్య రవాణా ఖర్చులు రూ.3 వేలు వితరణగా అందిస్తానని ప్రకటించారు. పాఠశాల పీఈటీలు శ్రీనివాస్, సురేష్‌లు ఫుట్బాల్ పోటీలో విద్యార్థులకు ఉత్తమ శిక్షణ ఇచ్చారని ప్రిన్సిపాల్ ఎల్ నరేంద్రకుమార్ పీఈటీలను మెచ్చుకున్నారు.

భగత్ సింగ్ జయంతి వేడుకలు

నవతెలంగాణ - ఎర్రుపాలెం

భారత దేశ స్వాతంత్రం కోసం భగత్ సింగ్ తన ప్రాణా న్ని త్యాగం చేశాడని డివైఎఫ్ఐ మండల కార్యదర్శి రా మిశెట్టి సురేష్ కొనియాడారు.మండల కేంద్ర మైన ఏర్రు పాలెం రామిశెట్టి పుల్లయ్య భవనం నందు భగత్ సింగ్ 116వ జయంతి వేడుకలను నిర్వహించారు.తొలుత ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా ని వాళులు అర్పించారు. కార్య క్రమంలో జువ్వా హు స్సేన్ రావు, షేక్ నాగుల్ మీరా పినపాక రాజేంద్ర ప్రసా ద్, జింకల తేజ, దేవరకొండ రామకష్ణ, దూదిగం బస వయ్య తదితరులు పాల్గొన్నారు.

పెనుబల్లి : వీఎం బంజర్ రింగ్ సెంటర్‌లో సిఐటియు ఆధ్వర్యంలో తాంద్ర రాజేశ్వరరావు అధ్యక్షతన భగత్ సింగ్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు చలమాల విఠల్, వ్యకాస మండల అధ్యక్షుడు గాయం తిరుపతి రావు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు నాగమణి, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బెజవాడ సాయి శేషు, సిఐటియు నాయకులు ధనలక్ష్మి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల ర్యాలీ

నవతెలంగాణ- తల్లాడ

ఆశ వర్కర్లకు ఫిక్స్ వేతనం 18000 ఇవ్వాలని సిపిఐఎం మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వర రావు డిమాండ్ చేశారు. గురువారం తల్లాడ ధర్నా చౌక్ వద్ద ఆశ వర్కర్ల సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ల మండల అధ్యక్షురాలు రాణి, సిఐటియు మండల అధ్యక్షుడు షేక్ మస్తాన్, చల్లా నాగేశ్వరరావు, పులి వెంకట నర్సయ్య పాల్గొన్నారు.

సాయిస్ఫూర్తిలో 'బోధన' అభివృద్ధి కార్యక్రమం

నవతెలంగాణ-సత్తుపల్లి



సత్తుపల్లి మండలం గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం బీటెక్, డిప్లొమా, ఎంబీఏ కోర్సులపై అధ్యాపకులకు భోదన అభివద్ధి అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హైదరాబాద్ కు చెందిన ఎం.సప్తగిరి అధ్యాపకులకు బోధనలో వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. అధ్యాపకులు వృత్తిపరమైన అభివృద్ధికి శిక్షణను కలిగి ఉండాలన్నారు. అయితే అధ్యాపకుల అభివృద్ధి, వృత్తిపరమైన అభివృద్ధి రెండూ అధ్యాపకుల కోసం కొనసాగుతున్న వృత్తిపరమైనదన్నారు. అధ్యాపకులు స్వీయ నిర్దేశిత అభ్యాస వృత్తిపరమైన అభివృద్ధిని కొనసాగించవచ్చన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకరరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వూటుకూరి శేషారత్నకుమారి మాట్లాడుతూ సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం అనేది నిరంతర ప్రక్రియ అన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ చెన్నుపాటి విజయకుమార్ మాట్లాడుతూ అధ్యాపకుడు అంటే నిరంతర అభ్యాసకుడన్నారు. నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందిచాలంటే నిరంతరం సాధన చేయటం తప్పనిసరి అని సూచించారు. కళాశాల చీఫ్ కౌన్సిలర్ కేవీ జవహర్, అన్ని ఇంజనీరింగ్ బ్రాంచీల విభాగాధిపతులు పాల్గొన్నారు.

NAME CHANGE

I **Bala Chennakeshava Rao** S/O, Bala Vasantha Rao R/o 4-39 Main Road, Thallamada Village, Sathupally Mandal, Khammam District, Telanagana 507303 have changed my name to **BALA CHENNAKESAVA RAO**

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE ::AT SATTUPALLI
O.S.NO 57 OF 2017

BETWEEN
Andhra bank (ubi),wyra Branch,
Ref.by its Branch Manager ...Plaintiff
"AND"'
Payala prabhakar and others ...Defendants

NOTICE

To
Payala Prabhakar S/o. Chandraiah
R/o peddatanda vill wyra Mandal,
Khammam Dist

The plaintiff herein had filed the above suit against you before this Hon' ble court for recovery of money, the above case is posted to date **5/10/2023** for your appearance.for suit notice along with Interlocutory applications ,That you are hereby require to be attend either in person or through an advocate on dt **5/10/2023 at 10.30A.M** before this Hon' ble court. Otherwise the matter will e heard and decided ex-parte/as per procedure.

(By order of the Hon' ble court)
K.PANDU RANGARAO
Advocate,khammam

పబ్లిక్ నోటీసు

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా. ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని విజయ నగర్ కాలనీ సర్వే నెం: 304/ అ, ఖానపురం హవేలి నందు గల ఖాళీ స్థలము ప్లాటు నెం : 23 విస్తీర్ణం :245-00 చదరపు గజములు - 204-84. చదరపు మీటర్లు గల స్థిరాస్తి .దాని యజమాని శ్రీమతి కడిమి సరళ w/o జయరాజు, వయస్సు 50 సం.లు వృత్తి : గృహిణి హౌస్.నెం: 1-414, సదానంద కాలనీ, భీమారం, హన్మకొండ, వరంగల్ జిల్లా. నుండి, నా క్లయింట్ ధూళ్ళ సోమ్లా S/o లస్కర్ వయస్సు 44 సం.లు , వృత్తి : టీచర్ , ఖమ్మం గ్రామం, ఖమ్మం జిల్లా వారు.దిగువ షెడ్యూల్ ప్రాపర్టీ ను కొనుగోలు చేయాలని భావిస్తున్నట్లు సాధారణ ప్రజలకు దీని ద్వారా తెలియజేస్తున్నాము.

పైన ఉద్దేశించిన విక్రయ లావాదేవీకి ఎవరికైనా అభ్యంతరం, దావా, ఆసక్తి, వివాదా లు ఉంటే, అతను/ఆమె/వారు ఏడు రోజుల లోపు అతని/ ఆమె/ వారి అభ్యంతరాలు/క్లెయిమ్‌లు / వివాదాలు/వివాదాల వివరాలను ధృవీకరించే డాక్యుమెంటరీ రుజువుతో క్రింద సంతకం చేసిన వారిని సంప్రదించవచ్చు. ఈ ప్రచురణ తేదీ నుండి (7)రోజులు విఫలమైతే షెడ్యూల్ ఆస్తికి సంబంధించి మూడవ పక్షం క్లెయిమ్‌లు/ అభ్యంతరాలు/వివాదాలు లేనట్లు మరియు ఆ తర్వాత ఎలాంటి క్లెయిమ్‌లు/ అభ్యంతరాలు లేనట్లుగా భావించి నా క్లయింట్, పై యజమాని తో విక్రయ లావాదేవీ పూర్తి కొనసాగుతుంది.

ఆస్తి షెడ్యూల్

ఖమ్మం జిల్లా మరియు సబ్ జిల్లా ఖమ్మం జిల్లా ప్రజాపరిషత్, ఖమ్మం అర్బన్ మండలము, ఖమ్మం నగర కార్పొరేషన్ పరిధిలో గల ఖానాపురం హవేలి, విజయ నగర్ కాలనీ సర్వే నెంబరు 304/అ మి.లే. - ఇంటి నెం.7-3-366,న్యూ ఇంటి నెం.17-15-366 ,నకు సమీపములో గల ఖాళీస్థలము, ప్లాటు నెంబరు 23, విస్తీర్ణం: 245-00 చదరపు గజములు - 204-84. చదరపు మీటర్లు గల స్థిరాస్తికి హద్దులు. **తూర్పు:** ప్లాటు నెం.26 **పడమర** :ప్లాటు నెం.22. **ఉత్తరం** :ప్లాటు నెం.24. **దక్షిణం**: 30'-0" వెడల్పు గల రోడ్డు.

తే.28-09-2023
ఖమ్మం.

ధూళ్య రమేష్, న్యాయవాది
ఇంటి. నెం 15-18-8/వి.
ప్రశాంతినగర్, ఖానాపురం హవేలీ,
ఖమ్మం పట్టణం&జిల్లా.-507 002.
సెల్: 79812 47566

IN THE COURT OF THE PRL SENIOR CIVIL JUDGE AT KOTHAGUDEM
I.P. NO 17 OF 2023

BETWEEN:
Kangala Ramakrishna ....Insolvent Petitioner
AND
1) Atchi Ramesh Reddy and others ....Respondents

1 Atchi Ramesh Reddy. S/o.Rajanna. Age:44 years. Occ: Business R/o.H.No.1-1-34, No.2 Basthi, Yellandu Town and Mandal, Bhadradri Kothagudem District
2) V.Rajasekhar, S/o.late.Malliah, Age:48 years,Occu: Business, R/o.H.No.4-3-23. 24 incline area. Yellandu Town and Mandal, Bhadradri Kothagudem-District
3) T.Ramakrishna Reddy. S/o.Malla Reddy, Age:44 years. Occu: Business, R/o.H.No. 1-3-90, Main Road, Yellandu Town and Mandal, Bhadradri Kothagudem District
4) Punem Ramakrishna. S/o.Munnaiah, Age:42 years. Occu: Business, R/o.Jagadambagumpu(v), Yellandu Mandal, Bhadradri Kothagudem District
5) Mukthi Janardhan, S/o.Venkati, Age:55 years,Occu:Teacher, R/o. H.No.1-121, Back side of ITDA Office, Near Manubothula cheruvu, Bhadrachalam Town and Mandal, Bhadradri Kothagudem Dist
6) Erpa Buchamma, W/o.Syamala Papa Rao. D/o.Laxmaiah, Age:42 years, Occu:Teacher, R/o.H.No.2-185. Pedamidiselugu(v), Charla Mandal, Bhadradri Kothagudem District.
7) Kodem Bheema Raju, S/o.Krishna Murthy, Age:45 years. Occu: Teacher, R/o.H.No.1-181, Rajupeta(v), Bhadrachalam Mandal, Bhadradri Kothagudem District
8) Korsa Venkataramana, W/o.Veeraiah, Age:55 Occu:Home Maker, R/o.H.No.5-195, ASR Colony, Bhadrachalam Town and Mandal, Bhadradri Kothagudem District.
9) Podium Venkateshwarlu,S/o.Ramaiah,Age:50 years, Occu: Business, R/o.H.N0.2-47, Sarvaipadu Banjara(v), Aswapuram Mandal, Bhadradri Kothagudem District
10) K.Ramesh, S/o.Venkateshwarlu,Age:41years. Occu: Business, R/o. H.N0,2-62, Sarvaipadu Banjara(v), Aswapuram Mandal, Bhadradri Kothagudem District
11) P.Raju,S/o.Nagabhushanam, Age:38 years, Occu:Business, R/o.H.No.2-14, Sarvaipadu Banjara(v), Aswapuram Mandal, Bhadradri Kothagudem District
12) Payam Venkatramana, S/o.Muthaiah, Age:43 years, Occu:Teacher, R/o.H.No.1-169, Back side of ITDA Office, Near Manubothula Cheruvu, Bhadrachalam Town and Mandal, Bhadradri Kothagudem Dist.
13) Korsa Sekhar Babu, S/o. Narsaiah, Age:32 years. Occu:Software Engineer, R/o.H.No.2-109, Marraiahbakthulanagaram, Krishnasagar(v). Burgampahad Mandal, Bhadradri No. 13 herein. Kothagudem District, is the respondent
14) Bolli Dhani Rao, S/o.Sarva Rayudu, Age:41 years, Occu:Business. R/o Burgampahad(v) and Mandal, Bhadradri Kothagudem district
15) Kandula Madhusudhana Rao, S/o.Peda Venkateshwar Rao, Age:45 years, Occu:Business, R/o.H.No.3.123, Main Road, Aswapuram(v) and Mandal, Bhadradri Kothagudem District
16) Bojja Naresh,S/o.Lingaraju,Age:36 years, Occu: Prop: Srinivasa Electricals,R/o.H.No.5-124, Mommugudem(v),Aswapuram Mandal, Bhadradri Kothagudem District
17) Tejavath Ramulu,S/o.Bitcha, Age:50 years. Occu: Agriculture, R/o.H.No.2-170, ST Colony, Burgampahad Mandal, Bhadradri Kothagudem District
18) Koram Vamshi, S/o.Venkaiah, Age:25 years. Occu:Business, R/o.Pullaigudem(v), Palvancha Mandal, Bhadradri Kothagudem Dist
19) R.Naresh Reddy, S/o.Krishna Reddy, Age:40 years, Occu: Employee, R/o.Edulla Bayyaram(v), Pinapaka Mandal, Bhadradri Kothagudem District.
20) R.Pulla Reddy, S/o.Raji Reddy, Age:48 years, Occu:Bricks Business, R/o.H.No.4-57, Morampalli Banjara(v), Burgampahad Mandal, Bhadradri Kothagudem District
21) Gunja Rama Rao, S/o.Venkat Rao, Age:39 years, R/o.H.No.6-1-128, Seshagirinagar, Manugur Town and Mandal, Bhadradri Kothagudem District
22) Vemula Venkanna, S/0.Rajaiah, Age:45 years, R/o.H.No.6-1-121/1, Seshagirinagar, Manuguru Town and Mandal,'Bhadradri Kothagudem District
23) Melipura Sunil Reddy, S/o.Jagga Reddy, Age:45 years, Occu:Business, R/o.H.No.7-177/1, Chinthiryala X Road, H/o. Gollagudem(v), . AswaPuram Mandal, Bhadradri Kothagudem Dist
24) Banoth Laxmi, Age:45 years, Occu:Nurse, R/o.H.No.2-95, Sundaraiahnagar, Indiranagar G.P., Yellandu Mandal, Bhadradri Kothagudgem District
25) G.Saraswathi, W/o.Veerabhadram, Age:40 years. Occu:Timber Business, R/o.H.No.3-52, Main Road, Yetapaka (v) and Mandal, East Godavari District.

నోటీస్

ఇందుమూలముగా తెలియ జేయునది ఏమనగా పై ఉదహరించిన వాది Insolvent Petitioner (దివాలాదారు) పై ఉదహరించిన ప్రతివాదులపై కేసు వేసియున్నారు. సదరు కోర్టు వారు పై కేసు **20-11-2023న మీ హాజరుకొరకు వాయిదా వేసి యున్నారు.** మీరు స్వయంగా గానీ లేక మీ తరపు న్యాయవాది ద్వారా గాని **ది. 20-11-2023న ఉ.గం. 10.30 నిఃలకు హాజరు కాగలరు.** లేని యెడల కోర్టు వారు కేసు మీకు పరోక్షంగా కోర్టు తీర్మానించబడును.

//కోర్టు వారి అనుమతితో//
YASA YUGANDER | YASA MOUNIKA | M. SATYA PRAKASH
Advocates Petitioner, KOTHAGUDEM,
Bhadradri Kothagudem Dist. Cell : 9676186066

కిసాన్ కాంగ్రెస్ చైర్మెన్ అన్వేష్‌రెడ్డికి టికెట్ ఇవ్వండి

- భట్టి విక్రమార్కకు కిసాన్ కాంగ్రెస్ వినతి

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీకి కీలకమైన 'కిసాన్ కాంగ్రెస్' చైర్మెన్ సుంకేట అన్వేష్‌రెడ్డికి టికెటు ఇవ్వాలంటూ సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్కను ఆ విభాగం కోరింది. రైతు సమస్యలపై గడిచిన ఎనిమిదేండ్లుగా ఆయన నిరంతర పోరాటాలు చేస్తున్నారని గుర్తు చేసింది. ఈమేరకు గురువారం హైదరాబాద్‌లోని భట్టి నివాసంలో కలిసి ఆయనకు వినతిపత్రం సమర్పించారు. నిజామాబాద్ జిల్లాలో బలమైన శక్తిగా ఉన్న గురడి కాపు సామాజిక వర్గానికి చెందిన అన్వేష్ రెడ్డికి టికెట్ ఇస్తే... కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు చాలా మేలు జరుగుతుందని కోరారు. అన్ని జిల్లాల కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు ఉన్నారు.

ఎంఎస్ స్వామినాథన్ మృతి పట్ల రేవంత్ సంతాపం

ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ మృతి పట్ల టీడీపీ అధ్యక్షులు ఎనుముల రేవంత్‌రెడ్డి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. దేశంలో మేలైన వరి వంగడాలను సృష్టించిన హరిత విప్లవానికి నాంది పలికిన స్వామినాథన్ మరణం దేశంలో వ్యవసాయ రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. వారి కుటుంబానికి నా సానుభూతి తెలిపారు. హరిత విప్లవ మార్గదర్శకుడు స్వామినాథన్

తెలంగాణ రైతు సంఘం

హరిత విప్లవ మార్గదర్శకుడు, ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ మరణం వ్యవసాయ రంగానికి తీరని లోటని తెలంగాణ రైతు సంఘం అభిప్రాయపడింది. గురువారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఏఐకేఎస్ సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్, ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ అరిబండి ప్రసాదరావు, సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ స్వామినాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

అక్టోబర్ 5 నుంచి 'ఎస్‌ఏ-1' పరీక్షలు

13 నుంచి దసరా సెలవులు

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలో వచ్చేనెల ఐదో తేదీ నుంచి ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్‌ఏ-1) పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అదేనెల 11 వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. ఇందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పరీక్షలను నిర్వహిస్తారు. ఆరు, ఏడు తరగతుల వారికి ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12.45 గంటలకు జరుగుతాయి. ఎనిమిదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు నిర్వహిస్తారు. తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చేపడతారు. జవాబుపత్రాలను మూల్యాంకనం చేసి వచ్చేనెల 30న ఫలితాలను ప్రకటిస్తారు. నవంబర్ ఒకటిన తల్లిదండ్రుల సమావేశాలను నిర్వహించి మార్కుల రికార్డులను అందజేయడంతోపాటు విద్యార్థుల పురోగతిపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చర్చిస్తారు. వచ్చేనెల 13 నుంచి 25 వరకు రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు దసరా సెలవులుంటాయి.

చెరుకూరి వీరయ్య మృతికి సీపీఐ సంతాపం

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

నీటిపారుదల రంగ నిపుణులు చెరుకూరి వీరయ్య మరణం పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సంతాపం వ్యక్తం చేశారు కృష్ణా, గోదావరి జలాల వినియోగం కోసం ఆయన విశేష కృషి చేశారని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నీటిపారుదల కల్పనకు ఆయన తన అనుభవాన్ని వెచ్చించారని పేర్కొన్నారు. వీరయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

వినాయక నిమజ్జనంలో విషాదం గోదావరిలో బాలుడి గల్లంతు

- బాణసంచా పడి చిరు వ్యాపార దుకాణం దగ్ధం

నవతెలంగాణ–భద్రాచలం రూరల్

వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా పలు చోట్ల విషాద ఘటనలు జరిగాయి. రాష్ట్ర నలుమూలల నుంచి నవరాత్రులు ముగించుకొని శోభాయాత్రతో నిమజ్జన నిమిత్తం భద్రాచలానికి వేల సంఖ్యలో గణనాథులు తరలిరాగా, ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోలీస్ శాఖ, రెవెన్యూ, పంచాయతీ శాఖల అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినప్పటికీ ఒకటి రెండు విషాదాలు జరిగాయి. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం వీర్య తండాకు చెందిన 20 మంది వినాయకున్ని నిమజ్జనానికి భద్రాచలం తీసుకొచ్చారు. నిమజ్జనం అనంతరం ముగ్గురు గోదావరిలో స్నానానికి దిగి గల్లంతు కాగా వెంటనే స్పందించిన ఎన్‌డిఆర్‌ఎఫ్ పోలీస్ సిబ్బంది ఇద్దరిని రక్షించినట్టు పట్టణ సీఐ నాగరాజు రెడ్డి తెలియజేశారు.

మరో బాలుడు గల్లంతయ్యాడు. గాలింపు చేపట్టారు. భద్రాచలం పట్టణంలోని భగవాన్ దాస్ కాలనీలో అంబేద్కర్ సెంటర్ వద్ద బాణసంచా పేలుస్తుండగా నిప్పు రవ్వలు ఫుట్‌పాత్‌పై ఉన్న చిరు వ్యాపారి దుకాణం పడటంతో దగ్ధమైంది. మంటలు పెద్దఎత్తున ఎగిసిపడ్డాయి. ఫైరింజన్ వచ్చి మంటలను అదుపు చేసింది.

వినాయక లడ్డూ రికార్డు

- వేలంలో రూ.1.26కోట్లు
- బండ్లగూడ రిచ్‌మండ్ విల్లాలో ఘటన
- బాలాపూర్ లడ్డూ రూ.27లక్షలు

నవతెలంగాణ–గండిపేట్/ బడంగ్‌పేట్

వినాయక లడ్డూ వేలం రికార్డు స్థాయిలో పలికింది. బండ్లగూడలో రూ.1.26కోట్లకు లడ్డూను బీఆర్ దియా చారిటబుల్ ట్రస్టు సభ్యులు వేలంలో దక్కించుకున్నారు. ఈసారి బాలాపూర్ లడ్డూ వేలంలో రూ.27లక్షలు పలికింది. వివరాలిలా ఉన్నాయి.. రంగారెడ్డి జిల్లా బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో పరిధిలోని పీఎస్ కాలనీ రిచ్‌మండ్ విల్లాలో వినాయక మండపం వద్ద లడ్డూ వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో విల్లాలో ఉండే సుమారు 300 కుటుంబాలు పాల్గొన్నాయి. వీరంతా లడ్డూను రూ.1.26కోట్లకు దక్కించుకున్నారు. లడ్డూ వేలం ద్వారా వచ్చిన డబ్బును చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పేద విద్యార్థులు, సామాజిక కార్యక్రమాల కోసం ఖర్చు చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

బాలాపూర్ లడ్డూ

బాలాపూర్ లడ్డూ వేలంలో మరోసారి రికార్డు ధర పలికింది. రూ.27 లక్షలకు తుర్కయాంజాల్‌లోని పాటిగూడ గ్రామానికి చెందిన దాసరి దయానంద్ రెడ్డి లడ్డూను దక్కించుకున్నారు. గురువారం అశేష జనవాహిని మధ్య ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బాలాపూర్ గణేష్ లడ్డూ వేలం, శోభా యాత్ర జరిగింది. గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు కళ్లెం నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో వంగేటి లక్ష్మారెడ్డి లడ్డు వేలంపాట నిర్వహించారు. వేలం పాట పోటా పోటీగా జరగ్గా దయానంద్ రెడ్డి రూ.27 లక్షలకు లడ్డూను సొంతం చేసుకున్నారు. గతేడాది బాలాపూర్ గ్రామానికి చెందిన వంగేటి లక్ష్మారెడ్డి రూ.24.60 లక్షలకు లడ్డూను దక్కించుకున్న సంగతి తెలిసిందే.

పరిశీలన అవసరమే

గోప్యత కంటే పారదర్శకతే ముఖ్యం
ఈవీఎంల పనితీరుపై నిపుణుల మనోగతం



న్యూఢిల్లీ : ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను (ఈవీఎంలు) తనిఖీ చేసేలా ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ఇటీవల తోసిపుచ్చింది. ఈవీఎంల వనరుకు సంబంధించిన కోడ్‌ను వెల్లడిస్తే సంఘ విద్రోహ శక్తులు ఆ యంత్రాల భద్రతకు ముప్పు కలిగించే ప్రమాదం ఉన్నదని అంటూ సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారణకు అనుమతించలేదు. అయితే భద్రతను కారణంగా చూపి పిటిషన్‌ను విచారణకు స్వీకరించకపోవడం సబబు కాదని న్యాయ న్యూఢిల్లీకి చెందిన భద్రతా పరిశోధకుడు, సాంకేతిక నిపుణుడు కరణ్ సైనీ అభిప్రాయపడ్డారు.

వ్యవస్థ సరిగా పనిచేయకపోతే దానికి మరింత భద్రత కల్పించాల్సిన అవసరం ఉంది. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కంటే గోప్యతకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం సరి కాదు. ఈవీఎంల పనితీరును పరిశీలించడానికి ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాన్ని పిటిషనర్ సునీల్ అహ్యా తప్పుపట్టారు. ఎన్నికల కమిషన్‌కు చెందిన సాంకేతిక మదింపు కమిటీ (టీఈసీ)కి మాత్రమే ఈవీఎంలను తనిఖీ చేసే అధికారం ఉంది. పిటిషన్‌ను విచారణకు స్వీకరించకపోవడానికి సుప్రీంకోర్టు రెండు కారణాలు చూపింది. మొదటిది...ఎన్నికల కమిషన్ తన విధి నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకోవడం లేదని చెప్పడానికి న్యాయస్థానానికి ఆధారాలేవీ చూపలేదు. రెండోది...కోడ్‌ను బహిర్గతం చేస్తే ఎన్నికల ప్రక్రియతో రాజీ పడినట్లు అవుతుంది. ఫలితంగా ఈవీఎంలలోని భద్రతా లోపాలు బయటపడి సంఘ విద్రోహ శక్తులు ప్రయోజనం పొందే ప్రమాదం ఉంటుంది. 'ఈవీఎంకు సంబంధించిన వనరు కోడ్‌ను పబ్లిక్ డొమైన్‌లో ఉంచితే దానిని ఎవరు హ్యాక్ చేస్తారో మీకు తెలుసు' అని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. కోడ్‌ను బహిర్గతం చేస్తే సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉన్న మాట నిజమే అయినప్పటికీ ఎన్నికల ప్రక్రియ సమగ్రతను, విశ్వసనీయతను పరిరక్షించాల్సిన అవసరం కూడా ఉంది. ఈవీఎంల వనరు కోడ్‌ను ప్రచురిస్తే ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలలో నమ్మకం పెరుగుతుంది. ఈవీఎంల పనితీరును స్వతంత్ర నిపుణులు పరిశీలించే అవకాశం కలుగుతుంది.

ఈవీఎంల విషయంలో గోప్యతను పాటించడం వల్ల వాటిపై ఎంత వరకూ ఆధారపడవచ్చునన్న అనుమానాలు ప్రబలుతున్నాయి. ప్రజల తీర్పును తారుమారు చేసే అవకాశాలు ఉన్నాయన్న సందేహాలూ వ్యక్తమవుతున్నాయి. వీటిని నివృత్తి చేయాలంటే ఈవీఎంల అంతర్గత పనితీరును పరిశీలించేందుకు పారదర్శకమైన ప్రక్రియ అవసరమవుతుంది.

2010లోనే పరిశీలన

ఈవీఎంల పనితీరును గతంలోనే కొందరు నిపుణులు పరిశీలించారు. 2010లో భద్రతా పరిశోధకుడు హరి కె.ప్రసాద్ మరో ఇద్దరితో కలిసి రెండో తరం ఈవీఎంను పరిశీలించి, లోపాలను బయటపెట్టారు. అయితే ఈవీఎంను దొంగిలించి, ప్రదర్శించాడన్న ఆరోపణపై ప్రసాద్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అప్పటి నుండీ ఆయన ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, భద్రత గురించి తరచూ మాట్లాడుతూనే ఉన్నారు. మూడో తరం ఈవీఎంలను సైతం హ్యాక్ చేయవచ్చునని ఆయన 2019లో ప్రకటించారు. అమెరికా వంటి దేశాలలో ఈవీఎంల భద్రతా తనిఖీలకు హ్యాకర్లను అనుమతిస్తారు. ప్రపంచంలో హ్యాకర్లు, భద్రతా సిబ్బందితో కూడిన అతి పెద్ద సంస్థ డెఫ్‌కాన్ ప్రతి సంవత్సరం నెవాడాలోని లాస్ వేగస్‌లో సామావేశాన్ని ఏర్పాటు చేస్తోంది. దీనిని 'ఓటింగ్ గ్రామం'గా పిలుస్తారు. ఈవీఎంలలో భద్రతా వైఫల్యాలను బయటపెట్టాల్సిందిగా ఆహుతులను కోరతారు. ఈ ప్రయత్నాలు అనేక సందర్భాలలో విజయవంతం అయ్యాయి కూడా. 2018లో 11 సంవత్సరాల బాలుడు ఎమరెట్ బ్రేవర్ ఓ నమూనా ఈవీఎంను హ్యాక్ చేశాడు. కీలక సమాచారాన్ని కాపాడుతూనే ఈవీఎంలను తెరిచి, భద్రతాపరమైన అంశాలను పరిశీలించవచ్చునని అమెరికా చెబుతోంది.

ఇదిలావుంటే వలసవాదులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా రిమోట్ ఓటింగ్ యంత్రాలను (ఆర్‌వీఎంలు) ప్రవేశపెట్టాలని ఎన్నికల కమిషన్ భావిస్తోంది. దీనిని అనేక పార్టీలు వ్యతిరేకించాయి. వలసవాదులకు ఇది ప్రయోజనకరమే అయినప్పటికీ ఈ విధానం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే సమ్మె

తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్(సీఐటీయూ) యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి



నవతెలంగాణ– ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పట్ల ప్రభుత్వం అనుసరించిన నిర్లక్ష్య వైఖరి కారణంగానే సమ్మె చేయాల్సి వస్తోందని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ (సీఐటీయూ) యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి అన్నారు. గురువారం ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల సమ్మె పోరు సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆగస్టు 18వ తేదీన మంత్రి సమక్షంలో జాయింట్ మీటింగ్ జరిగిందని, ఈ సమావేశంలో అంగన్‌వాడీ టీచర్‌కు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష ఇస్తామని హామీనిచ్చారని గుర్తుచేశారు. కానీ అదే నెల 25వ తేదీన మాట మార్చి ఇందులో సగానికి తగ్గించారని చెప్పారు. ప్రభుత్వమే ఇలా భిన్నమైన వైఖరితో ఉండటం సరికాదన్నారు. తెలంగాణ వస్తే అందరినీ క్రమబద్ధీకరిస్తామని చెప్పారని, 40ఏండ్లకు పైగా వెట్టిచాకిరీ చేస్తున్న అంగన్‌వాడీలను మాత్రం ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు పదేండ్లుగా పోరాడుతున్నారని అయినప్పటికీ పరిష్కారం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి పలుమార్లు వినతులు అందజేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. అందుకే సమ్మె చేయాల్సి వచ్చిందని వివరించారు. డిమాండ్లు పరిష్కరించని యెడల సమ్మెను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.వెంకటమ్మ అధ్యక్షత వహించిన సభలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, ఈశ్వర్‌రావు, కార్యదర్శి కూరపాటి రమేష్, యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.సునీత, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బండి దత్తాత్రి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్, జిల్లా ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్, లింగాల చిన్నన్న, సహాయ కార్యదర్శి ఎస్.నవీన్, నాయకులు డి.సునీత, రత్నమాల పాల్గొన్నారు.

నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఐసీడీఎస్ ఆఫీసు ముందు అంగన్వాడీలు మోకాళ్లపై నిల్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి పాల్గొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలంలో అంగన్‌వాడీలు బతుకమ్మ ఆడి నిరసన వ్యక్తం చేశారు.

కరీంనగర్ జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ దీక్ష శిబిరం వద్ద బిక్షాటన చేసి నిరసన తెలిపారు. జగిత్యాల జిల్లా బుగ్గారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట దీక్ష కొనసాగింది.



గుడిసెవాసులపై బీఆర్‌ఎస్ కార్పొరేటర్ అనుచరుల దాడి

గుడిసెల తొలగింపు

- దాడి చేసిన వారిపై చర్యలకు సీపీఐ(ఎం) డిమాండ్

నవతెలంగాణ–ఎన్జీవోస్ కాలనీ

ప్రభుత్వ భూమిలో రెండేండ్లుగా గుడిసెలు వేసుకుని జీవిస్తున్న పేదలపై బీఆర్‌ఎస్ నాయకుడు, అతని అనుచరులు దాడి చేశారు. గుడిసెలను కూల్చేశారు. అడ్డుకోబోయిన మహిళలపై దాడి చేశారు. ఈ ఘటన హనుమకొండ జిల్లా కేంద్రంలో గురువారం జరిగింది. బాధితులు, సీపీఐ(ఎం) నేతలు తెలిపిన వివరాల ప్రకారం..

హనుమకొండ నగర పరిధిలోని గోపాలపురం శివారులోని సర్వే నెంబరు 89లోని ప్రభుత్వ భూమిలో కొందరు రియల్టర్లు, భూ ఆక్రమణదారులు ఆక్రమించి పెద్ద పెద్ద భవనాలు, ఆలయాలు నిర్మించారు. శ్మశాన వాటికల పేరుతో స్థానిక బీఆర్‌ఎస్ కార్పొరేటర్, అతని అనుచరులు ఆక్రమించారు. మిగిలిన కొంత ప్రభుత్వ భూమిలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పేదలు గుడిసెలు వేసుకున్నారు. ఈ క్రమంలో ఎనిమిది నెలల కిందట గుడిసెవాసులపై కొందరు దాడి చేశారు. అప్పుడు సామరస్యంగా ఇరువైపులా కూర్చొని మాట్లాడి హద్దులు ఏర్పాటు చేసుకున్నారు. మళ్లీ గురువారం స్థానిక 56వ డివిజన్ కార్పొరేటర్ సునీల్ కుమార్ తన అనుచరులతో వచ్చి, ఇక్కడ మా శ్మశాన వాటిక ఉందని, గతంలో ప్రభుత్వం మాకు రాసిచ్చిందని దౌర్జన్యం చేసి గుడిసెలను తొలగించారు. అడ్డుకోబోయిన మహిళలపై రాళ్లు, కర్రలతో దాడి చేశారు. పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. వారికి సీపీఐ(ఎం) నేతలు చికిత్స చేయించారు. అనంతరం యూనివర్సిటీ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు సీపీఐ(ఎం) హనుమకొండ మండల కార్యదర్శి వాంకుడోత్ వీరన్న తెలిపారు. దళితులు, గిరిజనులపై దాడి చేసి గుడిసెలు తొలగించిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలని, చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. పేదలందరికీ డబుల్ బెడ్రూం ఇల్లు ఇస్తామని చెప్పిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నర ఏండ్లు దాటినా ఇవ్వకపోవడంతో భూ పోరాటం నిర్వహించి ప్రభుత్వ భూమిని కాపాడి నిరుపేదలకు గుడిసెలు వేయించామని చెప్పారు. ఇది సహించలేని బీఆర్‌ఎస్ నేతలు పేదల గుడిసెలపై దాడికి దిగడం సరైనది కాదన్నారు. అకారణంగా దాడి చేసిన 56వ డివిజన్ కార్పొరేటర్ సునీల్‌ను బీఆర్‌ఎస్ పార్టీ నుంచి బహిష్కరించాలని, లేదంటే కార్పొరేటర్ ఆగడాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి.ఉప్పలయ్య, నాయకులు కుక్కముడి రవీందర్, వల్లెపు రాజు, వల్లేపు లింగమూర్తి, బొంత కొమురెల్లి, ఉమాదేవి, ఇమ్మడి కవిత, ముదురు మంజుల, రమాదేవి, బానోతు వెంకన్న, జగన్, రాధిక తదితరులు పాల్గొన్నారు.

టెట్‌ను మినహాయించి పదోన్నతులివ్వాలి : టీపీటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

టెట్‌ను మినహాయించి ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై అశోక్‌కుమార్, పి నాగిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్‌సీటీఈ నిబంధన ప్రకారం 2010, ఆగస్టు 23 నుంచి ఉపాధ్యాయ నియామకాలకు టెట్‌ను తప్పనిసరి చేసిందని తెలిపారు. అంతకుముందే నియామకమై సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు మాత్రం మినహాయింపునిచ్చిందని పేర్కొన్నారు. టెట్ అర్హత లేకుండానే 2012, 2015లో పదోన్నతులు ఇచ్చారని గుర్తు చేశారు. కాబట్టి 2010కి ముందు నియామకమైన ఏ ఉపాధ్యాయుడూ టెట్‌ను రాయలేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం 2010 కంటే ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపునిస్తూ పదోన్నతులను యధావిధిగా కొనసాగించాలని కోరారు. కోర్టు ఉత్తర్వుల మేరకు తప్పనిసరి అయితే ఎన్‌సీటీఈ నుంచి ఐదేండ్ల గడువును కోరాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

టెట్‌తో సంబంధం లేకుండా పదోన్నతులివ్వాలి : డీటీఎఫ్

టెట్‌తో సంబంధం లేకుండానే ఉపాధ్యాయులకు పదోన్నతులివ్వాలని డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం సోమయ్య, టి లింగారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2010 కంటే ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు నివ్వాలని కోరారు. ప్రస్తుత షెడ్యూల్‌లో ఇచ్చే పదోన్నతులకు టెట్‌తో సంబంధం లేకుండా చూడాలని తెలిపారు. హైకోర్టు తీర్పు మేరకు ఉపాధ్యాయులకు టెట్‌ను వర్తింపచేయాలంటే 2010 తర్వాత నియామకమైన వారికి వారి సీనియార్టీ, అర్హతల మేరకు ఇవ్వాలని కోరారు. పాత వారికి వర్తింపచేస్తే టెట్ ఉత్తీర్ణతకు ఐదేండ్ల గడువు కోరాలని తెలిపారు.

సీనియార్టీ ప్రకారమే పదోన్నతులివ్వాలి : తపస్

కోర్టు అనుమతి తీసుకుని సీనియార్టీ ప్రకారమే అర్హతగల ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించాలని తపస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హన్మంతరావు, ఎన్ సురేష్ తెలిపారు. ఎస్జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్ పదోన్నతి పొందాలంటే టెట్ పేపర్-2 ఉత్తీర్ణత పొందాలంటూ ఉన్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చిందని పేర్కొన్నారు. అయితే 2010, ఆగస్టు 23 తర్వాత నియామకాలకు మాత్రమే టెట్ పేపర్-1, పేపర్-2 తప్పనిసరి అని ఉందని తెలిపారు. 2010, ఆగస్టు 23 కన్నా ముందు నియామకమైన వారు పదోన్నతి పొందడానికి టెట్ పేపర్-2 ఉత్తీర్ణత తప్పనిసరిగా ఉండాలన్న నిబంధన ఎక్కడా లేదని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ ప్రత్యేక చొరవ తీసుకుని కోర్టుకు సరైన వివరాలు, సమాచారాన్ని అందించాలని కోరారు.

ప్రశాంతంగా నిమజ్జనం

80 శాతం పూర్తి : డీజీపీ

నవతెలంగాణ–ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో గణేశ్ ప్రతిమల నిమజ్జనోత్సవం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా జరుగుతున్నదని రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ గురువారం రాత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 1.25 లక్షల గణేశ్ మండపాలు వెలిశాయని ఆయన అన్నారు. చివరి 11వ రోజున హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండతో పాటు నిజామాబాద్, సంగారెడ్డి, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో భారీ ఎత్తున విగ్రహాలు నిమజ్జనానికి తరలాయని తెలిపారు. లక్షలాది మంది ప్రజలు నిమజ్జనోత్సవ వేడుకలను తిలకించటానికి ట్యాంక్‌బండ్‌తో పాటు ఇతర చెరువులు, తటాకాల వద్దకు చేరుకొని వీక్షించి ఆనందించారని ఆయన అన్నారు. మతసామరస్యానికి ప్రతీకగా నిమజ్జనోత్సవం సాగిందని ఆయన అన్నారు. నిమజ్జనోత్సవం ప్రశాంతంగా సాగటానికి అన్ని వర్గాల ప్రజలు ఎంతగానో సహకరించారనీ, అలాగే గణేశ్ మండపాల నిర్వాహకులు సైతం పోలీసులకు తగిన సహకారాన్ని అందించారని ఆయన అన్నారు.

మంత్రులతో ఏరియల్ సర్వే

మూడు కమిషనరేట్ల పరిధులలో సాగిన నిమజ్జనోత్సవాన్ని హెలికాప్టర్‌లో రాష్ట్ర హెూం మంత్రి మహమూద్ అలీ, రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు తాను, నగర పోలీసు కమిషనర్ సి.వి ఆనంద్‌లు ఏరియల్ సర్వేను నిర్వహించటం జరిగిందని డీజీపీ తెలిపారు. లక్షలాది మంది ప్రజలు పాల్గొన్న నిమజ్జనోత్సవం ఎలాంటి విఘాతం లేకుండా సాగటానికి పోలీసు, విద్యుత్, జీహెచ్‌ఎంసీతో పాటు ఇతర ప్రభుత్వ శాఖలు సమన్వయంతో చేసిన కృషి, ఏర్పాట్లు సత్ఫలితాలను ఇచ్చాయని ఆయన అన్నారు. అర్ధరాత్రి నాటికి 90 శాతానికి పైగా నిమజ్జనోత్సవం పూర్తవుతుందనీ, మిగిలినవి శుక్రవారం ఉదయానికి పూర్తవుతాయని తెలిపారు. ప్రశాంతంగా నిమజ్జనం సాగటానికి ఐపీఎస్ అధికారులు మొదలుకొని కానిస్టేబుల్, హెూంగార్డుల వరకు శ్రమించారనీ, అందుకు వారందరికి అభినందనలు తెలుపుతున్నట్టు అంజనీకుమార్ చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా నిమజ్జనోత్సవం పూర్తయ్యేంత వరకు బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ నుంచి వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వేలాది సీసీ కెమెరాల ద్వారా ఉన్నతాధికారులు పర్యవేక్షించటం జరుగుతున్నదని ఆయన వెల్లడించారు.

లేని పోస్టుకు వేలల్లో జీతాలు

నాకో ఆమోదం లేకున్నా టీశాక్స్‌లో ఇష్టారాజ్యం

- నిధుల దుర్వినియోగంపై పదే పదే ఆరోపణలు
- అయినా సరిదిద్దుకోని అధికారులు

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

ఒక లక్ష్యం కోసం ఏర్పాటైన ఆ పథకంలో అవినీతి ఆరోపణలు. తరచూ వివాదాలమయమే. ప్రజల్లో హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై ప్రచారం చేయడం, దాని నియంత్రణ, దాని బారిన పడిన వారికి సేవలందించడమే లక్ష్యంగా జాతీయ స్థాయిలో నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ పని చేస్తున్నది. దాని పరిధిలో రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి పని చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే అసలు లక్ష్యసాధన దిశగా ఎంత సాధించారనే దాని కన్నా తరచూ అర్హత లేని వారికి పోస్టులను కట్టబెట్టడం, నిధుల దుర్వినియోగం, అమాత్యులకు బదిలీలు, అందలం ఎక్కించడం వంటి ఆరోపణలు నిత్యకృత్యంగా మారాయి. తమ అనుయాయుల కోసం నాకో విధించిన నిబంధనలను కూడా బేఖాతరు చేస్తున్నట్టు వినికిడి.

రాష్ట్రంలో ఎయిడ్స్ నియంత్రణ మండలితో కలిసి పని చేస్తున్న స్వచ్ఛంధ సంస్థల సంఖ్య ఆధారంగా రాష్ట్ర స్థాయిలో పర్యవేక్షణ పోస్టుల మంజూరు, వాటి సంఖ్యను నాకో నిర్ధారించింది. కనీసం వంద ఎన్జీవోలు ఉంటే వాటి పర్యవేక్షణ కోసం రాష్ట్ర స్థాయిలో జేడీ (టీఐ) పోస్టు ఉంటుంది. అయితే మన రాష్ట్రంలో అన్ని స్వచ్ఛంద సంస్థలు లేకపోవడంతో ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి నాకో ఈ పోస్టును రద్దు చేసింది. నిబంధనలకు విరుద్ధంగా పోస్టును భర్తీ చేసింది. అంతే కాకుండా ఆ లేనిపోస్టుకు ఎంతో అనుభవం ఉన్న వారిని తీసుకోవాల్సి ఉండగా కేవలం ఎన్జీవో అనుభవం ఉన్న వ్యక్తిని తీసుకోవడమే కాకుండా ఆ వ్యక్తికి వేలల్లో జీతాలు చెల్లిస్తున్నట్టు సమాచారం. ఎంపిక విధానంలోని దరఖాస్తుదారులందరికి సమాచారం ఇవ్వకుండా ఒక్కరికే ఇచ్చి భర్తీ చేశారనే విమర్శలూ ఉన్నాయి. దీనికి తోడు టీశాక్స్‌లో ఏవైనా పోస్టులను భర్తీ చేయాలంటే అందుకు సంబంధించిన ప్రతిపాదన కాపీలను తప్పనిసరిగా అక్కడి ప్రాజెక్ట్ డైరెక్టర్ లేదా అదనపు ప్రాజెక్టు డైరెక్టర్లకు తెలపాల్సి ఉంటుంది. అలా కాకుండా నేరుగా కంట్రీ డైరెక్టర్‌కు పంపించడం, అక్కడి నుంచి ఆయా పోస్టుల భర్తీకి ఆమోదం రాకపోవడం గమనార్హం. నాకో నిబంధనల ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులు ఇలా నేరుగా పంపించడానికి వీలు లేదని సమాచారం.

లంచాలకు అలవాటు పడిన అధికారులు జేడీ (టీఐ)ను వెనుకేసుకు వస్తూ నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఉద్యోగులు గుసగుసలాడుకుంటున్నారు. ఇలాంటి వారికి అడ్డుకట్ట వేయకపోతే శాక్స్ నిధులు మరింత దుర్వినియోగమయ్యే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అది ప్యారిస్‌లో ఓ హ్యాండ్‌లూమ్ ఎగ్జిబిషన్. ఒక అమ్మాయి వస్త్రాలను చూసి మంత్ర ముగ్ధురాలయ్యింది. ఆ వస్త్ర ప్రేమికురాలు ఉద్వేగానికి లోనవుతూ 'ఒక్కసారి వీటిని తాకవచ్చా' అంటూ వినమ్రంగా అడిగింది. "ఓహ్! తాకవచ్చు. అంతేకాదు కొనుక్కొని కట్టుకోవచ్చు కూడా!' అన్నది షాపు(స్టాల్) ఓనర్. ఆ అమ్మాయి వస్త్రాన్ని తడిమిచూసి ఏడ్చేసింది. ఎందుకని అడిగితే 'మజ్లిన్ (మల్ మల్) చేనేత గొప్పతనం గూర్చి పుస్తకాల్లో చదవడమే కానీ, ఇలా ప్రత్యక్షంగా చూసింది లేదు. చూడాలన్న కోరిక ఉన్నా ఇంతవరకు నెరవేరనేలేదు. ఇప్పుడు ఈ వస్త్రాల మృదుత్వాన్ని చూస్తుంటే ఏదో తెలియని అనుభూతి, ఆనందం కలుగుతున్నాయి' అని చెప్పింది. ఒక కళాకారిణికి ఇంతకన్నా తృప్తి ఇంకేముంటుంది? అంటున్నారు **LabelRama** సంస్థ వ్యవస్థాపకురాలు **రాజేశ్వరి రామా.** అసలు ఈ సంస్థ ఏమిటో? దీని ప్రత్యేకత ఏమిటో వారి మాటల్లోనే తెలుసుకుందాం.



విదేశీ వస్త్ర ప్రపంచంలో చేనేత ఢంకా

చేనేత ఒక కళాత్మక ప్రక్రియ... చేనేత ఒక సృజనాత్మక క్రియ... దారాల దూరాలను దగ్గరచేస్తూ పోగుపోగులో వర్ణజీవం పోస్తూ... మృదుత్వంతో అనుకూలంగా ఉంటూ దేహాలను అలంకరిస్తూ అందాన్ని ఇనుమడింపజేసే అద్భుత సృష్టి చేనేత. ఇది భారతదేశంలో అతి ప్రాచీనమైన ప్రక్రియ. వందల ఏండ్ల కిందట విదేశీ మారకద్రవ్యాన్ని సంపాదించిన ఘనత మన చేనేతది. శాతవాహనుల కాలంలో ఇక్కడి వస్త్రాలు యూరప్‌కు ఎగుమతి చేసేవారు. కానీ ప్రస్తుతం చేనేత పరిశ్రమకు అంతగా గుర్తింపు, ప్రగతి కనిపించడం లేదు. చేనేత చాలా శ్రమతో కూడుకున్న పని. మనం ధరించే దుస్తుల్లో ఫ్యాషన్‌తో పాటు అనుకూలత కూడా ఉండాలి అనే ఉద్దేశంతో చేనేత ప్రాచుర్యానికి పూనుకున్నారు రాజేశ్వరి రామా.

వస్త్రాలపై అభిరుచి పెరిగింది

మాది వైజాగ్. నాన్న టెక్స్ టైల్స్, జువెల్లరీ బిజినెస్ చేస్తారు. నేను గీతం కాలేజీలో ఎంబీఏ చేసాను. యూనివర్శిటీ ఆఫ్ మాంచెస్టర్ యు.కెలో ఎం.ఎస్సీ ఫ్యాషన్ రీటేలింగ్ చేసాను. అక్కడే బిజినెస్ ట్రిక్స్ నేర్చుకున్నాను. చిన్నప్పటి నుండి సెలవుల్లో మా కుటుంబమంతా కలిసి కాంచీపురం, వారణాసి ఇలా ఇండియాలోని వస్త్ర తయారీ కేంద్రాలకు వెళ్లేవాళ్ళం. అమ్మనాన్నకు భక్తి ఎక్కువ. వారి దైవదర్శనాలు అయ్యాక చీరలు కొనుక్కునే వాళ్ళం. అలా వస్త్రాలపై అభిరుచి పెరిగింది. ఏదైనా కొత్తగా చేయడమంటే నాకు చాలా ఇష్టం. చిన్నప్పుడే డ్యామేజ్ చీరలతో గౌన్లు, పరికిణిలు కుట్టేదాన్ని. అలా ఫ్యాషన్ డిజైనింగ్ పట్ల ఆకర్షితురాలినై ఈ సంస్థ స్థాపించాను.





వ్యాపార ప్రస్థానం

చేనేత అంటే మక్కువ ఎక్కువ. మా సంస్థలో చేనేత వస్త్రాలతో కొత్తగా డ్రెస్‌లు డిజైన్ చేస్తున్నా. మేము వాడే ఫ్యాబ్రిక్ మజ్లిన్(మల్ మల్). ఇది చాలా మృదువుగా ఉండి కుట్టేటప్పుడు పీక్కపోయే అవకాశం ఉంటుంది. అయినా చాలా జాగ్రత్తగా వివిధ రకాల దుస్తులు (ప్యాంట్ షర్ట్, వెస్ట్రన్ వేర్)తయారు చేస్తున్నాం. విదేశీయులకు మన చేనేత ప్రాముఖ్యాన్ని తెలియజేయడమే మా లక్ష్యం. అందుకని అనేక పుస్తకాలు చదివాను. చేనేత వస్త్ర తయారీ పరిశ్రమలను సందర్శించాను. చేనేత కార్మికులతో మాట్లాడాను. అనేక ప్రదేశాల్లో చేనేతపై అవగాహన కార్యక్రమాలు, వర్క్ షాపులు నిర్వహించాను. చీరలయితే మన దేశం వాళ్లే కట్టే అవకాశం ఉంటుంది కాబట్టి విదేశీయులు కూడా ధరించేవిధంగా అన్నిరకాల వస్త్రాలు కుట్టాలనుకున్నాను. విదేశీయులకు చేనేత గురించి అంతగా తెలియదు. వారికి చేనేత గూర్చి తెలియ పరచడానికి చాలా కష్టపడ్డాను. ఇష్టంతో చేస్తున్నాను కాబట్టి ఆ కష్టం కష్టంగా అనిపించడం లేదు. ఇప్పుడు మా వస్త్రాలు అనేక దేశాలలోకి ఎగుమతి అవుతున్నాయి. పర్యావరణ హితంగా కాటన్, సిల్క్ ఫ్యాబ్రిక్ వాడుతాం. ప్లాస్టిక్, పాలిస్టర్ వంటి కాలుష్య కారకాలు వాడాము. బటన్స్ కూడా వుడ్‌తో డిజైన్ చేస్తాం. ప్యాకింగ్‌కు బయోడిగ్రేడబుల్ కవర్స్ మాత్రమే వాడుతాం. పొల్యూషన్ లేని ఫ్యాషన్‌కు ప్రాముఖ్యం ఇస్తున్నాం. వీవర్స్‌కు పేమెంట్ ముందుగానే ఇస్తూ, వర్కర్స్‌ను ఫ్యామిలీ మెంబర్స్‌గా ట్రీట్ చేస్తూ ముందుకుసాగుతున్నాం.

కుటుంబమే నా బలం

మా తాతయ్య, మా నాన్నే నాకు ఇన్స్పిరేషన్. కష్టపడి పనిచేయడం, క్రియేటివిటీ వాళ్లదగ్గరే నేర్చుకున్నాను. నా బలం నా కుటుంబమే. మా సంస్థపేరు కూడా మా కుటుంబ సభ్యుల పేర్లలోని అక్షరాలన్నీ కలిసే విధంగా "లేబుల్ రామా" అని పెట్టాను. ఫ్రాన్స్‌లో మార్కెటింగ్‌కు 'వి హబ్' వారి సహాయం తీసుకుంటున్నాను. నేను నేటి తరాన్ని కోరేది ఒకటే చేనేత వస్త్రాలనే వాడండి. చేనేత పరిశ్రమల అభివృద్ధికి తోడ్పడం. చేనేత ఒక ఆర్ట్‌గా భావించి ఇష్టంగా కొనండి, అంతేగానీ సింపథీతో కాదు. మన వారసత్వాన్ని మనం కాపాడుకోవాలి. ఎక్కువ బట్టలు కొని వృధా చేయకుండా కొన్న వాటినే తృప్తిగా, తనివితీరా ధరించండి.

సంస్థ ముఖ్య ఉద్దేశ్యం

మన సంప్రదాయమైన చేనేతను అందరికీ పరిచయం చేయడం, అలాగే అంతరించిపోతున్న చేనేత పరిశ్రమలను బలోపేతం చేయడం. చేనేత బట్ట ప్రాముఖ్యతను విదేశాల్లో ప్రచారం చేస్తూ చేనేత వస్త్ర ప్రేమికులను పెంచడం. మన దేశ గౌరవాన్ని పెంచడం మా ముఖ్య ఉద్దేశం. స్వాతంత్ర్య పోరాటంలో కూడా మన ఖాదీకి ప్రముఖ స్థానం ఉంది. ప్రస్తుతం బెంగాల్ జందానీ ఖాదీతో, కళంకారి మచిలీపట్నంతో వర్క్ చేస్తున్నాం. మా ఉత్పత్తులను ఫ్రాన్స్‌కు ఎగుమతి చేస్తున్నాం. ఇంకా మా వ్యాపారాన్ని అమెరికా, యూరప్, జపాన్ దేశాలకు విస్తరింపజేయాలి.

- అయిత అనిత, 8985348424

దోమలను తరిమేద్దాం..



సాధారణంగా వర్షాకాలం వచ్చిందంటే దోమలు చాలా ఇబ్బంది పెడతాయి. వీటి వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. దోమలను నివారించడానికి వాడే లిక్విడ్స్, కాయిల్స్ వాసన కొంతమందికి పడదు. దాంతో మరిన్ని శ్వాస, చర్మ సమస్యలు ఎదురవుతాయి. అయితే వాటితో పని లేకుండా సహజమైన ఇంటి చిట్కాలతో దోమలను తరిమేయవచ్చు. ప్రస్తుతం జ్వరాలు ప్రబలుతున్న సమయంలో ఇంటి లోపల, పరిసరాలలో దోమలు లేకుండా చూసుకోవడం అనివార్యం.. వీటి నివారణకు ఏం చేయాలో తెలుసుకుందాం...

కర్పూరం : దోమలను తరిమేయడానికి కర్పూరం బాగా పని చేస్తుంది. దీని ఘాడమైన వాసన దోమలను ఇంట్లోకి రానివ్వదు. ఇందుకు చేయాల్సిందల్లా అన్ని తలుపులు మూసేసి కర్పూరం కాల్చడం. 30 నిమిషాల తర్వాత అన్ని తలుపులు తెరవొచ్చు. ఇది దోమలను పూర్తిగా నిర్మూలించడంలో ఎంతో ఉపకరిస్తుంది. దీని వల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉండవు.

వెల్లుల్లి : దోమలను దూరంగా ఉంచడానికి వెల్లుల్లి కూడా బాగా పని చేస్తుంది. కొన్ని లవంగాలు, వెల్లుల్లిని చూర్ణం చేసి నీటిలో ఉడకబెట్టుకోవాలి. ఈ నీటిని స్ప్రే బాటిల్‌లో పోసి ఇంటి మూలల్లో పిచికారీ చేయవచ్చు. క్షణాల్లో దోమల నుండి విముక్తి పొందవచ్చు.

కాఫీ : కాఫీ గింజలతో ఈ సమస్యను పరిష్కరించుకోవచ్చు. కొద్దిగా కాఫీ గింజలను నీటిలో మరగబెట్టి దోమలు ఎక్కువగా తిరిగేచోట చల్లాలి. ప్రతి రోజూ ఇలా చేయడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.

లావెండర్ ఆయిల్ : లావెండర్ నూనె నుండి వచ్చే వాసన కూడా దోమలను తరిమేస్తుంది. ఇంటి పరిసర ప్రాంతాలలో లావెండర్ నూనెను పిచికారీ చేయండి. అలాగే దోమ కాటును నివారించడానికి ఈ నూనెను శరీరంపై పూయవచ్చు. ఆరోగ్యానికి ఎలాంటి హానీ చేయదు.

పుదీనా : లావెండర్ ఆయిల్ మాదిరిగా దోమలను తిప్పి కొట్టడానికి పుదీనా కూడా బాగా పని చేస్తుంది. తాజా పుదీనా లేదా పుదీనా నూనె తీసుకొని మీ చుట్టూ పిచికారీ చేసుకుంటే దోమల బెడద నుండి తప్పించుకోవచ్చు. పుదీనా మొక్కలను ఇంట్లో పెంచుకున్నా మంచి ఫలితం ఉంటుంది.

టీ ట్రీ ఆయిల్ : ఇది యాంటీ బాక్టీరియల్ లక్షణాలను కలిగి ఉంటుంది. గాయాలు, అనేక వ్యాధులకు దీనితో చికిత్స చేస్తారు. ఇది దోమలను నివారించడానికి కూడా ఉపయోగపడుతుంది. టీ ట్రీ ఆయిల్ కొన్ని చుక్కలను నీటితో కలిపి స్ప్రే బాటిల్‌లో కలపండి. ఇంటి మూలల్లో పిచికారీ చేసుకుంటే దోమల నుండి ఉపశమనం పొందవచ్చు.

తులసి ఆకులు : తులసి ఆకులు దోమల లార్వాలను చంపడానికి సహాయ పడతాయి. పెరట్లో లేదా ఇంటి ప్రవేశద్వారం వద్ద ఒక తులసి మొక్కను నాటవచ్చు. ఇది దోమల సమస్య నుండి బయటపడటానికి ఉపయోగపడుతుంది.



ఇట్ల చేద్దాం

పుట్టగొడుగులు వేయించేపుడు చెంచా నిమ్మ రసం, చెంచా కరిగించిన వెన్నను కలిపితే వాటి రంగు కోల్పోకుండా ఉంటాయి. రుచి కూడా చాలా బాగుంటుంది.

వ్యవసాయ రంగం ... (మొదటిపేజీ తరువాయి)

దార్శనికతతో, సాంప్రదాయ పద్ధతిలో సాగుతున్న దేశీయ వ్యవసాయాన్ని స్వామినాథన్ వినూత్న పద్ధతుల్లో గుణాత్మక దశకు చేర్చారని తెలిపారు. ఆహారాభివృద్ధిలో భారత్ స్వయం సమృద్ధి సాధించిందంటే అది ఆయన కృషితోనే సాధ్యమైందని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. దేశ ప్రజల ప్రధాన ఆహార వనరులైన వరి, గోధుమ తదితర పంటలపై స్వామినాథన్ చేసిన గొప్ప ప్రయోగాలతో దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగి హరిత విప్లవాన్ని సాధించిందని తెలిపారు. స్వామినాథన్ కుటుంబ సభ్యులకు సీఎం తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. శాసన మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మెన్ బండా ప్రకాశ్ ముదిరాజ్, శాసన సభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, మంత్రులు కె తారకరామారావు, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, జగదీష్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ బోయినపల్లి వినోద్‌కుమార్, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ తదితరులు స్వామినాథన్ మరణం పట్ల తమ సంతాపాన్ని ప్రకటించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

సారీ.. రిస్క్ తీసుకోలేం (మొదటిపేజీ తరువాయి)

మీరు చెప్పిన నాయకుడికి టికెట్ ఇస్తే గెలిపించేందుకు మీరే బాధ్యత తీసుకుంటారా? అందుకు మీరేం చేస్తారో ముందుగా కాగితంపై రాసి ఇవ్వాలని పార్టీ సీనియర్లకు మెలిక పెట్టినట్టు తెలిసింది. టికెటు ఇప్పించుకోవడం, ఆ తర్వాత చేతులెత్తేయడం...ఫలితంగా పార్టీ ఓడిపోవడం ఆనవాయితీగా వస్తోందని నేతల వద్ద అధిష్టానం వాదించినట్టు సమాచారం. టీడీపీ, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన నేతలైనా సరే...గెలువడమే ముఖ్యం. అటువంటి వారికే టికెట్లు ఇస్తామంటూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ చెప్పినట్టు తెలుస్తోంది. మాజీ మంత్రులు జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కొండాసురేఖ, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితోపాటు మరికొంత మంది సీనియర్ నాయకులు సైతం రెండు టికెట్లు కావాలని అధిష్టానంపై ఒత్తిడి పెడుతున్నట్టు ఏఐసీసీ పెద్దలు చెబుతున్నారు. బీఫామ్ మీక్కావాలో, మీ కుటుంబ సభ్యులకు కావాలో తేల్చుకోవాలని హైకమాండ్ కోరుతున్నది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుకు మూడు టికెట్లు ఇస్తామన్న హామీని ప్రస్తావిస్తున్నట్టు తెలిసింది. ఆ మూడు సీట్లలో ఎంత ఖర్చయినా బాధ్యత తనదేనంటూ కచ్చితంగా గెలిపించుకొస్తానంటూ మైనంపల్లి అధిష్టానికి హామీ ఇచ్చారనీ, మీరు కోరే సీట్లకు మీరలాంటి బాధ్యత వహిస్తారా? అని హైకమాండ్ ప్రశ్నిస్తున్నట్టు తెలిసింది. పైరవీల ద్వారా టికెట్టు సాధించాలనే ప్రయత్నాలకు మాత్రం కాంగ్రెస్ అధిష్టానం చెక్ పెడుతున్నట్టు స్పష్టమవుతున్నది.

కిటెక్స్ సంస్థకు మంత్రి కేటీఆర్... (మొదటిపేజీ తరువాయి)

వస్త్ర తయారీ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్న కిటెక్స్ సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. ఆ సంస్థకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను ప్రభుత్వం నుంచి అందిస్తామని హామీనిచ్చారు. కిటెక్స్ సంస్థ తయారీ క్లస్టర్ల ఏర్పాటు ద్వారా రోజువారీగా ప్రపంచంలోనే అత్యధిక దుస్తులను ఉత్పత్తి చేస్తున్న తయారీ ప్లాంట్ ఉన్న ప్రాంతాల్లో ఒకటిగా తెలంగాణ నిలువబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జాకేబ్ మాట్లాడుతూ.. ప్రతిరోజూ ఏడు లక్షల దుస్తులను తమ సంస్థ ఉత్పత్తి చేయబోతుందని తెలిపారు. వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి తయారీ కేంద్రం నిర్మాణం పూర్తవుతుందనీ, వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఇప్పటికే కాకతీయ మెగా టెక్స్టైల్ పార్కులో తన భారీ తయారీ యూనిట్ నిర్మాణాన్ని కొనసాగిస్తున్నామనీ, ఈ డిసెంబర్ నాటికి వరంగల్ కేంద్రంగా తన కార్యకలాపాలను ప్రారంభిస్తామని చెప్పారు.

రూ.350 కోట్ల సింటెక్స్ తయారీ యూనిట్‌కు శంకుస్థాపన

వెల్స్పన్ సంస్థ తన సబ్సిడరీ సంస్థ ఆధ్వర్యంలో చందన్‌వెల్లిలో ఏర్పాటు చేయనున్న సింటెక్స్ తయారీ యూనిట్‌కు మంత్రి కేటీఆర్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వెల్స్పన్ వరల్డ్ చైర్మెన్ బీకే గోయెంకా పాల్గొన్నారు. మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ..రాష్ట్రంలో ఆ సంస్థ నూతన యూనిట్‌ను ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పరిశ్రమలు, సంస్థల విస్తరణ ప్రణాళికలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయి మద్దతు అందిస్తామని హామీనిచ్చారు. గోయెంకా మాట్లాడుతూ.. రూ.350 కోట్ల విలువైన సింటెక్స్ సంస్థ ద్వారా కొత్తగా 1000 ఉద్యోగాలు రాబోతున్నాయని చెప్పారు. వాటర్ ట్యాంకులను, యూపీవీసీ పైపులు మరియు ఇతర అనుబంధ ఉత్పత్తులను ఉత్పత్తి చేస్తామని తెలిపారు.

బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలి

(మొదటిపేజీ తరువాయి)

నవజాత శిశు సంరక్షణ (ఎస్ఎన్సియూ) కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఒక్కొక్క 100 పడకల ఆస్పత్రిని సుమారు రూ.36 కోట్లతో నిర్మించనున్నామని, ఆరు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. 40 మంది డాక్టర్లు రానున్నట్టు తెలిపారు. వరంగల్ జిల్లా కేంద్రంలో రూ.1100 కోట్లతో 24 అంతస్తుల్లో 2వేల పడకలతో హెల్త్ సిటీ నిర్మిస్తున్నామన్నారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ రాష్ట్రానికి రాకపోవడం బాధాకరమన్నారు. సీట్లు అమ్ముకొనే వారు రేపు అధికారంలోకి వస్తే రాష్ట్రాన్నే అమ్ముతారని విమర్శించారు.

కాంగ్రెస్ పింఛన్‌లను రూ.4వేలకు పెంచుతామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌కు దేశం మొత్తం మీద ఒక పాలసీ ఉండాలి కాదా ? ఒక్క తెలంగాణలో మాత్రమే రూ.4వేలు పింఛన్ ఇస్తామని చెబితే నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరన్నారు. రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ ఈ తొమ్మిదేండ్లలో సస్యశ్యామలం చేశారని చెప్పారు. సాగు నీటి రంగంలోనే కాదు విద్య, వైద్య రంగాల్లోనూ అనూహ్యమైన మార్పులతో పేద విద్యార్థుల ముంగిటకు ఉచిత చదువులు తీసుకొచ్చిన ఏకైక ప్రభుత్వమన్నారు. 33 జిల్లాల్లో వైద్య కళాశాలలు ఏర్పాటు చేసి లక్ష మందికి 22 మంది ఎంబీబీఎస్ డాక్టర్లు ఉండేలా చేస్తున్నామన్నారు.

వరంగల్ ఉమ్మడి జిల్లాలో కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టులతో గోదావరి నీళ్లు తెచ్చి సాగు నీరు అందిస్తున్నామన్నారు. అభివృద్ధి, సంక్షేమ రంగాలను అద్భుతంగా తీర్చిదిద్దిన కేసీఆర్‌ను నిండు మనస్సుతో మరోసారి ఆశీర్వదించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో గులాబీ పార్టీ విజయం తథ్యమని ధీమా వ్యక్త చేశారు. నగర పంచాయతీగా ఉన్న ములుగు ప్రాంతం నేడు జిల్లా కేంద్రంగా ఏర్పడిందని, సమీకృత కలెక్టరేట్, ఎస్పీ భవనం, వైద్య కళాశాలతో ములుగు రూపు రేఖలు మారనున్నాయని చెప్పారు. అనంతరం వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు, దళిత బంధు, గృహలక్ష్మీ పథకం మంజూరు పత్రాలను మంత్రి లబ్దిదారులకు అందజేశారు. భారీ వర్షాల సమయంలో పల్లెల్లో ఉత్తమ సేవలందించిన 11 మంది వైద్య సిబ్బందికి ప్రశంసా పత్రాల పంపిణీ చేశారు. వచ్చే సంవత్సరం నుంచి ములుగు జిల్లాలో వైద్య కళాశాల తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. ములుగు జిల్లాలో వైద్య కళాశాలతో పాటు ములుగు ప్రాంతంలో 400 పడకల ఆస్పత్రి ప్రజలకు సేవలు అందిస్తుందని అన్నారు. వచ్చే సంవత్సరం నుంచి 100మందికి పైగా వైద్యులు ములుగు జిల్లాలో సేవలు అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, గిరిజన, స్త్రీ శిశుసంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, శాసనమండలి వైస్ చైర్మెన్ బండా ప్రకాష్, ఎంపీ మాలోతు కవిత, కలెక్టర్లు, ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

హరిత విప్లవ పితామహుడు ఇక లేరు

(మొదటిపేజీ తరువాయి)

పీహెచ్‌డీ చేశారు. అంతేకాదు...విస్కాన్సిన్ వర్సిటీలోని జెనెటిక్స్ విభాగంలో పోస్ట్ డాక్టరల్ పరిశోధన చేశారు. 1954లో స్వదేశానికి తిరిగి వచ్చి భారత వ్యవసాయ పరిశోధనా సంస్థలో శాస్త్రవేత్తగా చేరారు. వ్యవసాయ పరిశోధనలకు సంబంధించి పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థలకు ఆయన నేతృత్వం వహించారు. వాటి ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. భారతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థలో జెనెటిక్స్ విభాగాన్ని, అణు పరిశోధనా ప్రయోగశాలను ఆయనే ఏర్పాటు చేశారు. ఫిలిప్పీన్స్‌లో అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ అధిపతిగా పనిచేశారు. దేశంలోని ఉష్ణ మండల ప్రాంతాల కోసం అంతర్జాతీయ పంటల పరిశోధనా కేంద్రం ఏర్పాటులో భాగస్వామి అయ్యారు. ఇటలీలో మొక్కల జన్యు వనరులకు సంబంధించి అంతర్జాతీయ బోర్డు ఏర్పాటులో, కెన్యాలో వ్యవసాయ-అటవీ భూములకు సంబంధించి అంతర్జాతీయ పరిశోధనా మండలి ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు.

వరి, గోధుమ పంటలపై ఆయన చేసిన పరిశోధనల కారణంగా దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. తద్వారా దేశం హరిత విప్లవాన్ని సాధించింది. స్వామినాథన్ ఎన్నో పదవులను చేపట్టి వాటికి వన్నె తెచ్చారు. మరెన్నో పురస్కారాలు ఆయన్ని వరించాయి. 1972-1979 మధ్యకాలంలో భారత వ్యవసాయ పరిశోధనా మండలి డైరెక్టర్ జనరల్‌గా, 1979-1980లో కేంద్ర వ్యవసాయ శాఖ ప్రధాన కార్యదర్శిగా, 1982-1988 మధ్య అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ డైరెక్టర్ జనరల్‌గా పనిచేశారు. 2019-22 మధ్యకాలంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రధాన శాస్త్రవేత్తగా పనిచేశారు. 20వ దశాబ్దంలో ఆసియా ప్రజలను అధికంగా ప్రభావితం చేసిన వారితో టైమ్స్ పత్రిక రూపొందించిన జాబితాలో స్వామినాథన్ పేరును చేర్చారు. స్వామినాథన్ 1987లో చెన్నైలో తన పేరిట రిసెర్చ్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు.

1967లో పద్మశ్రీ, 1972లో పద్మభూషణ్, 1989లో పద్మవిభూషణ్ అవార్డులు పొందారు. 1971లో రామన్ మెగసెసే అవార్డును, 1986లో ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ ప్రపంచ సైన్స్ అవార్డును అందుకున్నారు. 1987లో వ్యవసాయ పరిశోధనలో అత్యున్నత పురస్కారం ప్రపంచ ఫుడ్ అవార్డు ఆయనను వరించింది. 1989లో ఇందిరాగాంధీ శాంతి బహుమతి, 2013లో ఇందిరాగాంధీ సమైక్యతా పురస్కారం లభించాయి.

స్వామినాథన్‌కు ముగ్గురు కుమార్తెలు..సౌమ్య, మధుర, నిత్య...ఉన్నారు. ఆయన భార్య, విద్యావేత్త మీనా స్వామినాథన్ గత సంవత్సరమే కన్నుమూశారు.

గ్రూప్-1లో తప్పులు జరగలేదు

- అదనంగా ఓఎంఆర్ పత్రాలు కలిసే అవకాశం లేదు
- టీఎస్‌పీఎస్సీ స్పష్టీకరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణలో ఎలాంటి తప్పులు జరగలేదని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) స్పష్టం చేసింది. అదనంగా ఓఎంఆర్ పత్రాలు కలిసే అవకాశం లేదని తెలిపింది. బయోమెట్రిక్ విధానం పాటించలేదనీ, పరీక్షను సరిగ్గా నిర్వహించలేదని గ్రూప్-1 ప్రిలిమ్స్‌ను హైకోర్టు సింగిల్ జడ్జి తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. ఆ తీర్పుపై టీఎస్‌పీఎస్సీ డివిజన్ బెంచ్‌లో సవాల్ చేసింది. అయితే సింగిల్ జడ్జి ఇచ్చిన గ్రూప్-1 ప్రిలిమ్స్ రద్దు తీర్పును డివిజన్ బెంచ్ సమర్థించింది. పరీక్షను తిరిగి నిర్వహించాలని ఆదేశించింది. టీఎస్‌పీఎస్సీ గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. కొన్నేండ్లుగా నియామకాల కోసం పరీక్షలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికే ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేస్తున్నామని తెలిపింది. ఈ ఏడాది జూన్ 11న గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షను నిర్వహించామని పేర్కొంది. కలెక్టర్లు, ఇతర అధికారుల నుంచి సేకరించిన ప్రాథమిక సమాచారం మేరకు తొలుత 2,33,248 మంది అభ్యర్థులు హాజరయ్యారని ప్రకటించామని వివరించింది.

ఈ ప్రక్రియ పారదర్శకంగా చేపట్టామని స్పష్టం చేసింది. ఆ తర్వాత ఓఎంఆర్ పత్రాల స్కానింగ్ ప్రక్రియ మొదలయ్యాక 2,33,506 మంది హాజరయ్యారని వివరాలొచ్చాయని తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లోని 994 పరీక్షా కేంద్రాల్లో జూన్ 11న గ్రూప్-1 ప్రిలిమ్స్‌ను నిర్వహించామని పేర్కొంది. జిల్లాల్లోని కేంద్రాల్లో లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపింది. స్వల్ప సమస్యలు తలెత్తాయని వివరించింది. లేదంటే అభ్యర్థుల హాజరుకు సంబంధించి ప్రాథమిక సమాచారంలోని వివరాలకు, స్కానింగ్‌లో తుది వివరాలకు మధ్య కొంత తేడా ఉందని తెలిపింది. అయితే గ్రూప్-1 ప్రిలిమ్స్‌పై వచ్చిన ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేసింది. అదనంగా ఓఎంఆర్ పత్రాలు కలిసే అవకాశం లేదని పేర్కొంది. ఈ ప్రక్రియలో ఎలాంటి తప్పు జరగలేదని వివరించింది.

వెన్నంటే ఉంటాం

(మొదటిపేజీ తరువాయి)

ధరలు పెంచుతూ భారాలు మోపుతున్నదని విమర్శించారు. కేరళలో వ్యవసాయ కార్మికులకు ప్రభుత్వం రూ.1600 పింఛన్ ఇస్తున్నదని, పేదలందరికీ ఇండ్లు కట్టిస్తున్నదని తెలిపారు. ఇక్కడ ఎన్నికల సమయంలోనే పాలకులకు పేదలు గుర్తుకొస్తారని విమర్శించారు. పేదల భూ పోరాటంపై రాష్ట్ర ప్రభుత్వానికి తాను లేఖ రాస్తానని, పోరాటం విజయవంతం అయ్యే వరకు అండగా ఉంటామని అన్నారు.

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో పేదలను గుర్తించి ప్రభుత్వ భూములు పంచాలని, పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే రాష్ట్రంలో 67 కేంద్రాల్లో వేలాది మంది స్థలాలను ఆక్రమించుకుని ఇండ్లు నిర్మించుకున్నారన్నారు. పాలక పార్టీలు పేదల మధ్య ఐక్యతను దెబ్బతీయడానికి అనేక కుయుక్తులకు పాల్పడుతున్నాయన్నారు. వాటిని ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు, నాయకులు మచ్చ వెంకటేశ్వర్లు, పోన్నం వెంకటేశ్వర్లు, కనకయ్య రైతు సంఘం నాయకులు సూడి కృష్ణారెడ్డి

దేశానికి తీరనిలోటు : సీపీఐ(ఎం)

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభించారని తెలిపారు. వరి, గోధుమల అధికోత్పత్తి వంగడాల వినియోగం ద్వారా విత్తనరంగంలో పెనుమార్పులు తెచ్చారని పేర్కొన్నారు. భూసంస్కరణల అమలుకు కృషి చేశారని వివరించారు. ఆహారధాన్యాల లోటుతో ఉన్న భారత్ 1985 నాటికి ఎగుమతుల దేశంగా మారిందని తెలిపారు. ఆహారధాన్యాలు ఎగుమతులు చేసే స్థితికి చేరామని పేర్కొన్నారు. హార్టికల్చర్ ఉత్పత్తులు కూడా ఎగుమతులు చేయగలిగామని వివరించారు. 1988లో ఎంఎస్ స్వామినాథన్ పరిశోధనా సంస్థ ప్రారంభించారని తెలిపారు. స్వామినాథన్ చైర్మెన్‌గా భారత ప్రభుత్వం 2004లో జాతీయ రైతుల కమిషన్‌ను ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. ఆ కమిషన్ 2006లో నివేదిక సమర్పించిందని వివరించారు. ఆ నివేదిక ప్రకారం రైతుల పంటలకు ఉత్పత్తి వ్యయంపై 50 శాతం అదనంగా ధర నిర్ణయించాలనీ, వ్యవసాయ అనుబంధ రంగాలను ప్రోత్సహించాలని సిఫారసులు చేసిందని తెలిపారు. కార్పొరేట్‌ల లాభాల కోసం బీజేపీ-ఆర్ఎస్ఎస్ ప్రభుత్వం ఆ నివేదికను తొక్కిపెట్టిందని విమర్శించారు. వ్యవసాయ రంగంలో సమూల మార్పులు తీసుకొచ్చి, దేశ వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని అహర్నిశలూ కృషి చేసిన శాస్త్రవేత్త స్వామినాథన్‌కు నివాళులు అర్పిస్తున్నామని తెలిపారు.

వ్యవసాయ రంగానికి తీరనిలోటు : సీపీఐ

హరిత విప్లవ పితామహుడు, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ మరణం పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం వ్యవసాయ రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. ఆహారం కోసం ఇతర దేశాలపై ఆధారపడే పరిస్థితి నుంచి భారతదేశం స్వావలంబన సాధించేందుకు ఆయన ఎంతో కృషి చేశారని తెలిపారు. వ్యవసాయ రంగ బలోపేతానికి, రైతు తన కాళ్లపై నిలబడేందుకు స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫారసులు ఎంతో ఉపయుక్తమైనవని పేర్కొన్నారు. వాటిని యథాతథంగా అమలు చేయడమే స్వామినాథన్‌కు ఇచ్చే నిజమైన నివాళి అని తెలిపారు.

కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న మైనంపల్లి

(మొదటిపేజీ తరువాయి)

శ్రీనివాస్ రెడ్డి పలువురు ముఖ్యనేతలు పాల్గొన్నారు. త్వరలోనే బీఆర్ఎస్‌లో టికెట్ రాని మరో ఇద్దరు సిట్టింగులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడానికి ముహూర్తం ఫిక్స్ చేసుకున్నట్టుగా తెలుస్తుంది. మొత్తానికి తాజా చేరికలతో కాంగ్రెస్‌కు మరింత బలం చేకూరినట్లయింది. మైనంపల్లి హన్మంతరావు తన కుమారుడు రోహిత్‌కు మెదక్ టికెట్ ఇవ్వకపోవడంతో బీఆర్ఎస్ తిరుగుబావుటా ఎగరేశారు. వేముల వీరేశం పరిస్థితి కూడా అంతే. కుంభం అనిల్ మాత్రం కాంగ్రెస్ నుంచి కొద్దిరోజుల క్రితం బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకుని మళ్లీ సొంత గూటికి వచ్చేశారు.

నవచిత్రం

ఈ కథకి మా నాన్నే స్ఫూర్తి



శ్రీకాంత్ అడ్డాల

విరాట్ కర్ణ హీరోగా శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో రూపొందిన న్యూ ఏజ్ పొలిటికల్ థ్రిల్లర్ 'పెదకాపు-1'. ద్వారకా క్రియేషన్స్‌పై మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం నేడు (శుక్రవారం) ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల మీడియాతో మాట్లాడుతూ, '1982లో రామారావు పార్టీ పెట్టినప్పుడు మా నాన్న ఊర్లో చాలా క్రియాశీలంగా ఉండేవారు. ఒక కొత్తపార్టీ వస్తుందంటే జీవితాల్లో ఏదో కొత్త మార్పు వస్తుందనే ఆశ అందరిలో ఉంటుంది. అప్పుడు వచ్చిన రాజకీయ సమీకరణాల నేపథ్యంలో, కొన్ని సంఘటనల ఆధారంగా ఫిక్షన్‌ని జోడించి చేసిన కథ ఇది. దీనికి స్ఫూర్తి మా నాన్నే. మొదట్లోనే ఈ యూనిక్ స్టోరీని రెండు పార్టులు చేయాలనుకున్నాం. విరాట్ కర్ణకి ఇది తొలి సినిమా. కొత్తవాళ్ళతో ఈ తరహా జోనర్‌లో సామాన్యుడి పోరాటం చూపించడం ఒక ఛాలెంజ్‌గా ఫీలయ్యా. అనుకోకుండా ఇందులో నేనూ ఓ పాత్రలో నటించాల్సి వచ్చింది. ప్రీమియర్ చూస్తున్నపుడు నా పాత్రని బాగా ఎంజాయ్ చేశాను' అని అన్నారు.

డబుల్ పవర్‌తో డబుల్ ఇస్మార్ట్

రామ్ పోతినేనితో డైరెక్టర్ పూరి జగన్నాథ్ తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. మాస్, యాక్షన్‌ని ఇష్టపడే ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇవ్వడానికి ఈ కాంబో రెడీ అవుతోంది. హై బడ్జెట్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది.

గురువారం దర్శకుడు పూరి జగన్నాథ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ, 'డబుల్ ఇస్మార్ట్' టీమ్ పవర్ ఫుల్ పోస్టర్‌ను విడుదల చేసింది.

పోస్టర్‌లో దర్శకుడు, హీరో రామ్, విలన్ సంజయ్ దత్‌తో కలిసి చేతిలో డబుల్ బ్యారెల్ గన్‌లు పట్టుకుని కనిపించారు. రామ్, పూరీల డెడ్లీ కాంబినేషన్‌లో బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'ఇస్మార్ట్ శంకర్'కి సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్' చిత్రాన్ని పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్ నిర్మిస్తున్నారు.

"ఇస్మార్ట్ శంకర్'కి మించి అనేలా ఈ చిత్రాన్ని దర్శకుడు పూరీ తనదైన మార్క్‌తో ఎక్కడా రాజీపడకుండా తెరకెక్కిస్తున్నారు. ఈ హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ కోసం హాలీవుడ్ సినిమాటోగ్రాఫర్ జియాని జియానెల్లి పనిచేస్తున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది మహా శివరాత్రి కానుకగా మార్చి 8న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది' అని చిత్ర బృందం చెప్పారు.




సంజయ్‌దత్, పూరీ జగన్నాథ్, రామ్

బ్రో..ఐ డోంట్ కేర్

బాలకృష్ణ, డైరెక్టర్ అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భగవంత్ కేసరి'. ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ఈ నేపథ్యంలో ఈ సినిమా ప్రయాణాన్ని మేకర్స్ ఒక క్లిప్‌లో చూపించారు. పూజా కార్యక్రమం నుంచి నిర్మాణ పనులకు సంబంధించిన కీలకమైన వివరాలను ఈ వీడియోలో పొందుపరిచారు.

'ప్యాషనేట్ టీమ్ 8 నెలల పాటు తీవ్రంగా శ్రమించారు. 24 అద్భుతమైన ప్రదేశాలలో, 12 మాసివ్ సెట్లలో షూటింగ్ జరిగింది. బాలకృష్ణ కొన్ని పవర్ ప్యాక్డ్ డైలాగ్‌లు చెబుతున్నట్లు కూడా వీడియోలో ఉంది. "కలిసి మాట్లాడతా అన్నా కదా, అంతలోనే మందిని పంపాలా... గ్రౌండ్ ఫ్లోర్ బలిసిందా బే...' అంటూ గూండాలను హెచ్చరించారు. బాలకృష్ణ చెప్పిన చివరి డైలాగ్ 'బ్రో... ఐ డోంట్ కేర్' తన మొండి స్వభావాన్ని తెలియజేస్తుంది. బాలకృష్ణను మునుపెన్నడూ చూడని క్యారెక్టర్‌లో దర్శకుడు అనిల్ రావిపూడి ప్రెజెంట్ చేస్తున్నారు. గెటప్ కూడా పూర్తిగా కొత్తగా ఉంది. సాల్ట్ అండ్ పెప్పర్ లుక్‌లో బాలకృష్ణ కనిపిస్తారు. తమన్ అద్భుతమైన స్కోర్ విజువల్స్‌కు బలం చేకూర్చింది. ఇటీవలే గణేష్ చతుర్థి వేడుకల్లో సంచలనంగా మారిన 'గణేష్..' సాంగ్‌తో ఈ సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్ ప్రారంభమయ్యాయి. సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మిస్తున్న ఈ చిత్రంలో బాలకృష్ణ సరసన కాజల్ అగర్వాల్ కథానాయికగా నటిస్తోంది. శ్రీలీల ఓ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రం అక్టోబర్ 19న థియేటర్లలోకి రానుందని మేకర్స్ మరోసారి స్పష్టం చేశారు' అని చిత్ర యూనిట్ తెలిపింది.



బాలకృష్ణ

ఓ మనిషి యానిమల్‌గా మారితే..?

రణబీర్ కపూర్, సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'యానిమల్'. ప్రీ-టీజర్‌తో ఆశ్చర్యపరిచిన మేకర్స్ గురువారం రణబీర్ కపూర్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్ర టీజర్‌ని రిలీజ్ చేశారు. ఇది తండ్రీ కొడుకుల పాత్రల్లో కనిపించిన అనిల్ కపూర్, రణబీర్ కపూర్‌ల కథ. విలన్‌గా బాబీ డియోల్ ఎంట్రీ, పిల్లల గురించి రణబీర్, రష్మిక మందన్నల మధ్య చర్చ జరుగుతున్నప్పుడు చూపించిన రక్తపాతం, కారు ఛేజింగ్‌లు, ఇంటెన్స్ ఎలిమెంట్స్ చాలా ఎగ్జైటింగ్‌గా ఉన్నాయి. అలాగే రణబీర్ రెబల్‌గా మారే క్రమాన్ని దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తన మార్క్‌తో ప్రజెంట్ చేశారు. మొత్తంగా ఈ టీజర్ సినిమాకి ఓ గ్లింప్స్‌లా ఉండటం విశేషం. భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్ టి-సిరీస్, ప్రణయ్ రెడ్డి వంగా భద్రకాళి పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 1న హిందీ, తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది.



రణబీర్ కపూర్

ఆద్యంతం భయపెట్టే సినిమా



డేవిడ్ గోర్డాన్ గ్రీన్ దర్శకత్వం వహించిన అతీంద్రియ భయానక చిత్రం 'ది ఎక్సార్సిస్ట్: బిలీవర్'. ఇది 'ఎక్సార్సిస్ట్..' ఫ్రాంచైజీలో ఆరవది. అలాగే ఇది 'ది ఎక్సార్సిస్ట్'కి సీక్వెల్ కూడా. విలియం పీటర్ రాసిన 'ది సమె నేమ్' నవల ఆధారంగా దీన్ని తెరకెక్కించారు.

1973లో రిలీజైన 'ది ఎక్సార్సిస్ట్' సూపర్ నేచురల్ హర్రర్ చిత్రంగా ప్రేక్షకుల్ని విశేషంగా భయపెట్టింది. అంతేకాదు వరల్డ్ బాక్సాఫీస్ దగ్గర భారీ వసూళ్ళని కూడా కలెక్ట్ చేసింది. అలాగే 10 అకాడమీ నామినేషన్లు నామినేట్ చేయబడిన మొదటి భయానక చిత్రంగానూ ఇది నిలిచింది.

ఒక రోజు ఏంజెలా, ఆమె సహచరురాలు కేథరీన్ (ఒలివియా ఓనీల్) తప్పిపోతారు. మూడు రోజుల తర్వాత ఏమి జరిగిందనే దానిపై ఎలాంటి క్లూ ఉండదు. క్రిస్ మాక్‌నీల్ (ఎల్లెన్)ని సంప్రదించమని విక్టర్‌ని బలవంతం చేస్తుంది. ఆ తరువాత ఏమి జరిగింది అనేది కథ.

ఈ సినిమా విడుదలైన 50 సంవత్సరాల తర్వాత దీనికి సీక్వెల్‌గా రూపొందిన "ది ఎక్సార్సిస్ట్: బిలీవర్' అక్టోబర్ 6న తెలుగు, తమిళం, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో విడుదల కానుంది. దీనికి సినిమాటోగ్రఫీ-మైఖేల్ సిమండ్స్, సంగీతం- డేవిడ్ వింగో.

ఆసియా క్రీడల్లో టీమ్ ఇండియా పతక జోరు కొనసాగుతుంది. హాంగ్జౌలో భారత్ వరుసగా ఐదో రోజు పతకాల పంట పండించింది. షూటింగ్‌లో మరో పసిడి పతకం దక్కగా.. వుషూలో సిల్వర్ మెడల్ సొంతమైంది. ఈక్వెస్ట్రియన్ (గుర్రపుస్వారీ)లో కాంస్య పతకం లభించింది. ఐదో రోజు మూడు మెడల్స్ సాధించిన భారత్.. పతకాల పట్టికలో 25 మెడల్స్‌తో ఐదో స్థానంలో నిలిచింది.



> నిజాయితీగా చెప్పాలంటే, ఈ పసిడి పతకం ఊహించలేదు. ఇవి మాకు తొలి ఆసియా క్రీడలు. తొలి ప్రయత్నంలోనే పతకం సాధించటం, అదీ బంగారం సొంతం చేసుకోవటం ఎంతో సంతోషంగా ఉంది. మేము అన్నదమ్ముల్లా ఉంటాం. షూటింగ్ రేంజ్‌లో పోటీ, ఆ తర్వాత చెలిమి మా నైజం. శివ, అర్జున్‌తో కలిసి సాధించిన ఈ గోల్డ్ మెడల్ ఎంతో ప్రత్యేకం. వ్యక్తిగత విభాగంలో నాల్గో స్థానంలో నిలువటం సంతృప్తి ఇవ్వలేదు. రానున్న టోర్నీల్లో పతక ప్రదర్శన చేసేందుకు మెరుగవుతాను'
>
> - సరబ్జోత్ సింగ్

గురి అదిరింది

- షూటింగ్‌లో మరో పసిడి
- వుషూలో రోషిబినాకు రజతం
- ఈక్వెస్ట్రియన్‌లో అనూశ్‌కు కాంస్యం

హాంగ్జౌ ఆసియా క్రీడలు 2023

నవతెలంగాణ-హాంగ్జౌ

షూటింగ్‌లో మెన్స్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్. భారత యువ షూటర్ సౌరభ్ చౌదరి ఈ విభాగంలో ఆసియా రికార్డు నెలకొల్పాడు. 2018 జకర్తా క్రీడల్లో సౌరభ్ రికార్డు 240.7 పాయింట్లతో పసిడి కొల్లగొట్టాడు. దీంతో సహజంగానే ఈసారి ఈ విభాగంలో భారత్ పతక ఆశలతో బరిలోకి దిగింది. కానీ పతక వేటలో 4, 8 స్థానాలకు మాత్రమే పరిమితమైంది. సరబ్జోత్ సింగ్ 199 స్కోరుతో నాల్గో స్థానంలో నిలిచి పతకాన్ని తృటిలో చేజార్చుకోగా.. చీమా సింగ్ అర్జున్ ఫైనల్లో చివరి స్థానంలో నిలిచాడు. దీంతో మెన్స్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ జట్టు విభాగంలో మనోళ్లపై పెద్దగా అంచనాలు లేకుండా పోయాయి. ఇక్కడే యువ షూటర్ల త్రయం అద్భుతం చేసింది. ఆసియా క్రీడల్లో తొలిసారి గురి పెట్టిన సరబ్జోత్ సింగ్, చీమా అర్జున్ సింగ్, శివ నర్వాల్‌లు అదరగొట్టారు. 1734 పాయింట్లతో పసిడి పతకం అందుకున్నారు. చైనా షూటర్లు 1733 పాయింట్లతో రజతం, వియత్నాం జట్టు 1730 పాయింట్లతో కాంస్యం సాధించాయి. పతక వేటలో భారత్‌కు చైనా నుంచి గట్టి పోటీ ఎదురైంది. చివరి రౌండ్‌లో కచ్చితంగా పదేసి పాయింట్లు సాధిస్తే కానీ పసిడి రేసులో నిలువలేని పరిస్థితి. ఒత్తిడిలో మరింత మెరుగ్గా గురి పెట్టిన సరబ్జోత్, అర్జున్, శివలు బంగారు పతకం ముద్దాడారు. సరబ్జోత్ సింగ్ వరుసగా 95, 95, 97, 98, 97, 98 పాయింట్లు సాధించగా.. చీమ అర్జున్ సింగ్ 97, 96, 97, 97, 96, 95తో మెరిశాడు. శివ నర్వాల్ 92, 96, 97, 99, 97, 95తో దుమ్మురేపాడు. షూటింగ్‌లో భారత్‌కు ఇది నాలుగో పసిడి పతకం కావటం విశేషం.

వుషూలో రోషిబినాకు రజతం :

ఆసియా క్రీడల్లో భారత్‌కు పతక అవకాశాలు మెరుగ్గా ఉన్న మరో ఈవెంట్ వుషూ. క్రీడల ఆరంభానికి ముందే వుషూ అథ్లెట్లు వార్తల్లో నిలిచారు. అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన ముగ్గురు వుషూ అథ్లెట్లకు చైనా స్టాంప్డ్ వీసా నిరాకరించింది. దీంతో పతకం నెగ్గే అవకాశం ఉన్న ముగ్గురు అథ్లెట్లు టోర్నీకి దూరంగానే ఉండిపోయారు!. మార్షల్ ఆర్ట్స్ గేమ్‌లో బరిలో నిలిచిన ఇతర అథ్లెట్లు మాత్రం సత్తా చాటుతున్నారు. మణిపూర్ మణిపూస రోషిబినా దేవి మహిళల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించింది. మహిళల 60 కేజీల శాండ విభాగంలో పోటీపడిన రోషిబినా దేవి గురువారం జరిగిన పసిడి పోరులో చైనా అమ్మాయికి స్వర్ణం కోల్పోయింది. తొలి రౌండ్లో రోషిబినా దేవి లెగ్ కిక్స్‌తో మెరిసినా.. చైనా అమ్మాయి 1-0తో ముందంజ వేసింది. చావోరేవో తేల్చుకోవాల్సిన రెండో గేమ్‌లో సైతం రోషిబినా దేవి మెరుగైన ప్రదర్శన చేసినా ప్రత్యర్థిదే పైచేయిగా నిలిచింది. దీంతో మూడో రౌండ్ అవసరం లేకుండానే చైనా అమ్మాయి 2-0తో స్వర్ణం దక్కించుకుంది. పసిడి పోరులో పోరాడి ఓడిన రోషిబినా దేవి సిల్వర్ మెడల్ సొంతం చేసుకుంది. 2018 జకర్తా ఆసియా క్రీడల్లో కాంస్య పతకం సాధించిన రోషిబినా దేవి.. తాజాగా రజతంతో పతకం రంగు మెరుగుపర్చుకుంది.



ఈక్వెస్ట్రియన్‌లో మెరిసిన అనూశ్ :

2023 ఆసియా క్రీడల్లో భారత గుర్రపు స్వారీ జట్టు అదరగొడుతుంది. డ్రెసేజ్ విభాగంలో టీమ్ ఇండియా ఇప్పటికే టీమ్ విభాగంలో పసిడి సాధించి చరిత్ర సృష్టించగా.. అదే విభాగం వ్యక్తిగత పోటీలో అనూశ్ అగర్‌వాలా మెరిశాడు. పలు సిరీస్‌లుగా జరిగిన ఈ పోటీల్లో అనూశ్ అగర్‌వాలా, అతడి గుర్రం ఎట్రో 73.030 స్కోరు సాధించారు. ఓవరాల్‌గా మూడో స్థానంలో నిలిచిన అనూశ్ అగర్‌వాలా కాంస్య పతకం సొంతం చేసుకున్నాడు. మలేషియా రైడర్ 75.780 స్కోరుతో పసిడి నెగ్గగా.. హాంగ్‌కాంగ్ రైడర్ 73.450 స్కోరుతో రజతం గెల్చుకున్నాడు.

ఆటలు

హాకీ ఇండియా గెలుపు

భారత మెన్స్ హాకీ జట్టు గ్రూప్ దశలో కీలక విజయం సాధించింది. గ్రూప్-ఏలో డిఫెండింగ్ చాంపియన్ జపాన్‌పై 4-2తో గెలుపొందింది. ఈ విజయంతో గ్రూప్-ఏలో భారత్ అగ్రస్థానానికి చేరుకుంది. 30 నిమిషాల ఆట అనంతరం భారత్ 2-0తో ముందంజలో నిలిచింది. ద్వితీయార్థంలో జపాన్ గోల్స్ కొట్టినా.. భారత్ సైతం మెరిసింది. అభిషేక్ 13, 45వ నిమిషాల్లో గోల్ కొట్టగా.. రోహిదాస్, మన్‌దీప్ సింగ్‌లు గోల్స్ నమోదు చేశారు. జపాన్ తరఫున కటో, మిటానిలు గోల్స్ సాధించారు.

ఛెత్రి సేన ఇంటిముఖం

సమకరణాలు కలిసొచ్చి గ్రూప్ దశ దాటి నాకౌట్ దశకు చేరుకున్న భారత ఫుట్‌బాల్ జట్టు.. ప్రీ క్వార్టర్స్‌లో పరాజయం పాలైంది. సౌదీ అరేబియా చేతిలో 0-2తో ఓటమి చెంది ఇంటిముఖం పట్టింది. ప్రథమార్థం ముగిసే సరికి ఇరు జట్లు గోల్స్ కొట్టలేదు. కానీ ద్వితీయార్థం ఆరంభంలోనే సౌదీ ఆటగాడు మారెన్ 51, 58వ నిమిషాల్లో డబుల్ గోల్స్‌తో విరుచుకుపడ్డాడు. గోల్స్ వేటలో విఫలమైన భారత్ ఆసియా క్రీడల నుంచి నిష్క్రమించింది.

ఆకుల శ్రీజ ముందంజ

టేబుల్ టెన్నిస్‌లో తెలంగాణ స్టార్ ఆకుల శ్రీజ శుభారంభం చేసింది. మహిళల డబుల్స్‌లో దియ చితాలెతో కలిసి ప్రీ క్వార్టర్స్‌కు చేరుకుంది. 11-8, 15-13, 11-6తో వియత్నాం జోడీపై గెలుపొంది ముందంజ వేశారు. మహిళల సింగిల్స్‌లో శ్రీజ 6-11, 4-11, 13-15, 9-11తో ఉత్తర కొరియా ప్యాడ్లర్ చేతిలో ఓడింది.

విజేతగా నిలిచి.. ఇంటికెళ్లలేని దుస్థితి!



- మణిపూర్ అథ్లెట్ రోషిబినా దేవి కన్నీటిగాథ

నవతెలంగాణ-హాంగ్జౌ

ఆసియా క్రీడల్లో పతకం సాధించిన అథ్లెట్లు సహజంగానే విజయ సంబురాలు, అభిమానుల స్వాగతం నడుమ స్వరాష్ట్రానికి చేరుకుంటారు. ప్రతి క్రీడాకారుడు కోరుకునే, కలలు కనే హోమ్‌కమింగ్ ఇదే. కానీ మణిపూర్ అథ్లెట్లు ఆ ఆనందానికి నోచుకోలేదు. రాజకీయ ప్రేరేపిత చిచ్చుతో రెండు తెగల నడుమ గత ఐదు నెలలుగా మణిపూర్ మంటల్లో కాలిపోతున్న సంగతి ప్రపంచానికి తెలిసిన సంగతే. 2023 ఆసియా క్రీడల్లో వుషూ (మార్షల్ ఆర్ట్స్)లో సిల్వర్ మెడల్ సాధించిన రోషిబినా దేవిది మణిపూర్‌లోని ఓ కుగ్రామం. విద్వేషం మత్తులో హింస రాజ్యమేలుతున్న మణిపూర్‌లో ఉండటం క్షేమం కాకపోవటంతో రోషిబినా దేవి ఇంఫాల్‌లో సాయ్ స్పోర్ట్స్ హాస్టల్‌లోనే ఉంటూ సాధన చేసింది. గత ఐదు నెలలుగా రోషిబినా దేవి ఇంటి ముఖం చూసిందే లేదు. ఇప్పుడు ఆసియా క్రీడల్లో పతకం సాధించినా విజయ గర్వంతో స్వరాష్ట్రం వెళ్లలేదు, పతకం సంబురం కుటుంబంతో కలిసి పంచుకోలేదు. గురువారం మహిళల వుషూ ఫైనల్లో రజతం అందుకున్న రోషిబినా దేవి.. మణిపూర్, కుటుంబం దుస్థితి తలచుకుంటూ కన్నీంటి పర్యంతమైంది. ఫైట్ ముగిసినా.. తన రెండు గ్లౌవ్స్‌తో పంచ్‌లు విసురుతూ కనిపించటం అక్కడ స్టేడియంలో ఉన్న ప్రేక్షకులను కట్టిపడేసింది.

భయం.. భయంగా బతుకుతున్నారు : 'అవును, ఇప్పుడు అక్కడ మాకు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. మణిపూర్‌లో అందరూ భయం భయంగా బతుకుతున్నారు. త్వరలోనే పరిస్థితులు సద్దుమణిగి, ప్రజలు శాంతియుతంగా మెలుగుతారని ఆశిస్తున్నాను. రాష్ట్రంలో చెలరేగిన హింసతో కండ్ల ముందు అంతా కాలిపోతుండటం ఎంతో బాధగా ఉంది. నేను ఇప్పుడు అక్కడికి (మణిపూర్) వెళ్లలేను. అక్కడ ప్రజలను కాపాడుతూ, ప్రజల కోసం శ్రమిస్తున్న వారికి ఈ రజత పతకం అంకితం ఇస్తున్నాను. మణిపూర్‌లో హింస చెలరేగుతున్న సమయంలోనే నా ట్రైనింగ్ మొదలైంది. ఈ సమయంలో నేను ఇంటికి వెళ్లనేలేదు. మా నాన్న ఓసారి ఇంఫాల్‌లోని హాస్టల్‌కు వచ్చి నన్ను చూసి వెళ్లారు. పరిస్థితులు మరీ దారుణంగా మారడంతో.. రోజు మా కుటుంబంతో ఫోన్‌లో మాట్లాడవద్దని కోచ్‌లు చెప్పారు. కేవలం ఆదివారం మాత్రమే ఇంట్లో వాళ్లతో మాట్లాడేందుకు అనుమతి ఇచ్చారు. నన్ను గ్రామానికి రావద్దని మా కుటుంబ సభ్యులు చెప్పారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886